
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 300
శుక్రవారం 14-7-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 14-7-2023





ఫ్యాషన్

పువ్వుల నగలు

డ్రెస్ డిజైన్స్‌లో ఫ్లోరల్ ప్రింట్స్ ప్రాముఖ్యత మనకు తెలిసిందే. ఫ్యాషన్ జువెలరీలోనూ పువ్వుల సిరులు బోలెడంత హంగామాను సృష్టిస్తున్నాయి. పెళ్లికూతురు అలంకరణలో మాత్రమే విరివిగా కనిపించే ఈ పువ్వుల నగలు ఇప్పుడు యువత మదిని అన్ని వేళలా ఆకట్టుకుంటున్నాయి. ఇయర్ హ్యాంగింగ్స్‌గానూ, నెక్‌పీస్‌గానూ ఫ్యాబ్రిక్ పువ్వులు ప్రత్యేకతను చాటుతున్నాయి.








ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో తయారైన పువ్వుల ఆభరణాలు మిగతా వాటిన్నింటితో పోల్చితే ముందువరసలో ఉన్నాయి. లైట్ వెయిట్, ప్లెయిన్‌గా ఉండే లేత రంగులు ఆర్గంజా ఫ్యాబ్రిక్‌లో కనిపిస్తాయి. అలాగే, లేస్, లైట్ వెయిట్ సిల్క్ ఫ్యాబ్రిక్‌ను కూడా ఈ పూల తయారీకి ఉపయోగిస్తారు. ఇయర్ హుక్స్ మార్కెట్‌లో తీసుకుంటే, ఈ పూల నగలను ఇంట్లోనూ చేసుకోవచ్చు. కొనుగోలు చేయాలన్నా తక్కువ ధరకే లభిస్తాయి. డ్రెస్‌కు తగిన మ్యాచింగ్ ఫ్లోరల్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవడమూ సులువే.





యూ ట్యూబర్

మమ్మల్ని ప్రచారం చేయవూ...

ఎన్నికల సమయం రాబోతూ ఉంది. పెద్ద పెద్ద రాజకీయ నాయకులు సోషల్ ఇన్‌ఫ్లూయెర్స్‌ను సంప్రదించి ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ప్రచారం పొందుతున్నారు. 'కర్లీ టేల్స్' యూ ట్యూబ్ చానల్‌తో విశేషంగా ఫాలోయర్స్‌ను సాధించుకున్న కామియా జని ఇటీవల రాహుల్ గాంధీ, ఆదిత్య థాకరే వంటి నేతలను కూడా ఇంటర్వ్యూ చేస్తోంది. 20 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉన్న కామియా జని కేవలం ఈ ఇంటర్వ్యూల ద్వారా పేరు, పైకం సంపాదిస్తోంది.


కామియా జని

కామియా జని 'సండే బ్రంచ్' పేరుతో చేసే యూ ట్యూబ్ ఇంటర్వ్యూలు 100వ ఎపిసోడ్‌కు చేరుకున్నప్పుడు గెస్ట్‌గా సచిన్ టెండూల్కర్ వచ్చాడు. 'శివాజీ పార్కులో చిన్నప్పుడు క్రికెట్ ఆడితే చాలా ఆకలేసేది. మూడు నాలుగు వడ పావ్‌లు లాగించేసేవాణ్ణి' అని చెప్పాడు. వెంటనే కామియా జని 'మీ కోసం జుహూ, అంధేరి, శివాజీ పార్క్ నుంచి మూడు వడపావ్‌లు తెప్పించాను. వాటిలో ఏది శివాజీ పార్క్‌దో మీరు తిని కనిపెట్టి చెప్పాలి' అంది. సచిన్ టెండూల్కర్ చిటికెలో కనిపెట్టాడు.

ఇలా ఇంటర్వ్యూ చేస్తే జనం చూడరూ?

'సండే బ్రంచ్'కు విరాట్ కోహ్లీ ఒక వారం గెస్ట్. 'అనుష్కతో పెళ్లయ్యాక మమ్మల్ని ఎవరూ గుర్తు పట్టకూడదని హనీమూన్‌కు ఫిన్లాండ్ వెళ్లాం. హాయిగా తిరుగుతున్నాం. ఒక చోట కాఫీ తాగుతూ ఉంటే ఒక సర్దార్‌జీ మమ్మల్ని గుర్తు పట్టాడు. కోహ్లీ... మా ఇంటి పేరు కూడా కోహ్లీనే అన్నాడు. పెద్దాయనా... ఇప్పుడు హడావిడి చేసి మా గుట్టు బయట పెట్టకు అని బతిమాలుకున్నాం' అని సరదా విషయాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు.

ఇలాంటి సరదా కబుర్ల కోసం కామియా జని ఇంటర్వ్యూలు చూస్తారు.

భారత్‌జోడో యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ రాజస్థాన్‌లో ఉన్నప్పుడు 'సండే బ్రంచ్'కు పిలిచి మరీ ఇంటర్వ్యూ ఇచ్చాడు. కామియా జనితో 'నాకు పాతికేళ్ల వయసు వచ్చినప్పుడు లండన్‌లో ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేశాను. ఆ రోజుల్లో మొదటి జీతం 2,500 పౌండ్లు అందుకున్నప్పుడు అది చాలా పెద్ద అమౌంట్ అనిపించింది' అని గుర్తు చేసుకున్నాడు.

కామియా జని యూట్యూబ్ చానల్ 'కర్లీ టేల్స్'కు 20 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారు. ఆమె ఇప్పటి వరకూ ప్రొడ్యూస్ చేసిన


ధోనీతో...


రాహుల్ గాంధీతో...


జగ్గీ వాసుదేవ్‌తో...

వీడియోలకు 88 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఆమె చానల్ ఇండియాలో అత్యంత పాపులర్ చానల్‌గా గుర్తింపు పొందింది. అందుకే కొత్త సినిమా రిలీజ్ అయినా, ఈవెంట్ జరుగుతున్నా సెలబ్రిటీలే ఆమెను ఇంటర్వ్యూ చేయమని కోరుతున్నారు. ఇప్పుడు ఎన్నికలు కనుక రాజకీయ నేతలు కూడా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ ఇంటర్వ్యూల వ్యూస్ కామియా జనికి భారీ ఆదాయం సంపాదించి పెడుతున్నాయి.

ఒకప్పుడు జర్నలిస్ట్

ముంబైలో ఒక సాధారణ ఆటో డ్రైవర్‌కు జన్మించిన కామియా జని మాస్ మీడియాలో డిగ్రీ చేసింది. తర్వాత ఎల్ఎల్‌బీ చేసి 2006లో టైమ్స్ ఆఫ్ ఇండియాలో సబ్ ఎడిటర్‌గా పని చేసింది. ఆ తర్వాత సిఎన్‌బిసి తదితర చానల్స్‌లో పని చేసి 2016 నాటికి ఈ రోజువారీ పని బోర్ కొడుతోందని భావించి ఉద్యోగం మానేసింది. ఆమెకు ప్రయాణాలు, ఫుడ్ అంటే చాలా ఇష్టం. తన మనసుకు నచ్చిన ప్రయాణాలు చేస్తూ, నచ్చింది తింటూ వాటి మీద వీడియోలు తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తుంటే విశేషమైన ఆదరణ లభించింది. కామియా జని జుట్టు రింగులు రింగులుగా ఉంటుంది కనుక 'కర్లీ టేల్స్' పేరుతో యూట్యూబ్ చానల్ మొదలెట్టింది. 'సండే బ్రంచ్' పేరుతో సెలబ్రిటీలను బ్రంచ్‌కు పిలిచి వారికి నచ్చిన ఫుడ్ ఐటమ్స్ వడ్డిస్తూ పిచ్చాపాటి కబుర్లతో ఇంటర్వ్యూ చేయడం కామియా జని స్టయిల్. విహారం, ఆహారం అంటే అందరికీ ఇష్టం కనుక వ్యూస్ విపరీతంగా పెరిగాయి. పెరుగుతూనే ఉన్నాయి.

ఫాలోయెర్స్ ఉన్నవారే నిర్ణేతలు

ఇవాళ ఎక్కువమంది ఫాలోయెర్స్ ఉన్నవారే అభిప్రాయాలను నిర్మిస్తున్నారు. ప్రచారం చేస్తున్నారు. రాజకీయ నాయకులు ఇది కనిపెట్టారు. లక్షల మంది ఫాలోయెర్స్ ఉన్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల సాయం పొందుతున్నారు. వారు చేసే కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఇంటర్వ్యూలు ఇస్తూ తాము ప్రచారం పొందుతున్నారు. ఇటీవల్ ఉద్ధవ్ థాక్రే కుమారుడు ఆదిత్యా థాక్రే కామియా జనికి ఇంటర్వ్యూ ఇచ్చాడు. రానున్న ఎన్నికల్లో కామియా జని లాంటి వాళ్లకు ఇంకా డిమాండ్ పెరగనుంది.

పేరెంటింగ్ టిప్స్

మారాం చేస్తే అరవకండి!



స్కూళ్లు ప్రారంభం అయ్యాయి. పొద్దున లేచి స్కూలుకు వెళ్లాలంటే భయం, బాధతో బడికెళ్లమని మారాం చేస్తుంటారు చిన్నారులు. మరికొంతమంది అయితే మొండికేసి ఏడుపు అస్సలు ఆపరు. ఇలాంటి పిల్లలను నవ్వుకుంటూ స్కూలుకు పంపాలంటే ఈ నాలుగు పాటిస్తే సరి...

- **మానసికంగా సిద్ధం చేయాలి:** ముందుగా పిల్లలతో పాటు తల్లిదండ్రులు స్కూలుకు వెళ్లి తరగతి టీచర్, తోటి విద్యార్థులు, ఇతర స్కూలు సిబ్బందితో మాట్లాడి, వారితో స్నేహంగా మెలగాలి. అప్పుడు అది దగ్గర నుంచి చూసిన పిల్లలు స్కూలు వాతావరణాన్ని కొత్తగా భావించరు. దీంతో పాటు వీలు చిక్కినప్పుడల్లా నవ్వు తెప్పించే కథలు చెబుతూ ఉండాలి.
- **గట్టిగా అరవకూడదు :** పిల్లలు స్కూలుకు వెళ్లను అని మారాం చేసినప్పుడు గట్టిగా తిట్టడం, అరవడం, కోప్పడటం చేయకూడదు. ఇలా చేస్తే వాళ్లు మరింత భయపడతారు. ఎందుకు స్కూలుకు వెళ్లనంటున్నారో బుజ్జగిస్తూ కారణాలు తెలుసుకోవాలి. కారణాన్ని బట్టి వాళ్లను స్కూలుకు వెళ్లడానికి అనుకూలంగా ఆలోచించేలా వివరిస్తూ, వాళ్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలి.
- **అనుకూలంగా మాట్లాడాలి :** స్కూలు ప్రారంభంలో పిల్లలను స్కూలో దింపడం, స్కూలు అయిపోయాక తీసుకురావడం చేయాలి. వాళ్లకిష్టమైన టిఫిన్ పెట్టాలి. స్కూలు నుంచి వచ్చాక ''స్కూల్లో ఎలా గడిచింది? ఈ రోజు కొత్తగా ఏం నేర్చుకున్నావు? '' అని అడగాలి. స్కూల్లో తమ పిల్లలు ఎలా ఉంటున్నారో పిల్లలకు తెలియకుండా టీచర్‌ను అడిగి తెలుసుకుంటూ ఉండాలి. టీచర్ చెప్పిన సలహాలు సూచనలు పాటించాలి.
- **ప్రోత్సహించాలి:** స్కూలుకు వెళ్లేందుకు ఆసక్తి కలిగేలా పిల్లలను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తుండాలి. స్కూల్లో స్నేహితులను ఏర్పర్చుకోమని చెబుతుండాలి. ఇవన్నీ చేయడానికి తల్లిదండ్రులు కాస్త సహనం పాటిస్తే.. పిల్లలు సంతోషంగా స్కూలుకు వెళ్లి చదువుకుంటారు.

వంటిల్లు

చిరుజల్లుల్లో.. ఘుమఘుమలు!

వర్షాలతో చలికి దుప్పటి ముసుగేసుకోవాలని పిస్తుంటుంది. కానీ స్కూళ్లకు, ఆఫీసులకు టైం అయిపోతుంటుంది. ఈ సమయంలో టిఫిన్, లంచ్ బాక్స్‌ల తయారీలో హైరాన పడిపోకుండా క్షణాల వ్యవధిలో చేసుకోగల వంటకాలతో ఈ వారం వంటిల్లు...

రాగి ఢోక్లా



కావలసినవి: రాగిపిండి – అరకప్పు; **సూజీ రవ్వ** – అర కప్పు; **పెరుగు** – అరకప్పు; **ఉప్పు** – రుచికి సరిపడా; **చక్కెర** – పావు టీస్పూను; **పచ్చిమిర్చి తరుగు** – ఒకటిన్నర టీస్పూన్లు; **అల్లం తురుము** – పావు టీస్పూను, **నూనె** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **ఈనో సాల్ట్** – ముప్పావు టీస్పూను; **క్యారట్ తురుము** – రెండు టేబుల్ స్పూన్లు; **నువ్వులు** – టీస్పూను; **ఆవాలు** – అరటీస్పూను; **ఇంగువ** – చిటికెడు; **కరివేపాకు** – రెండు రెమ్మలు.

తయారీ: • డోక్లా గిన్నె అడుగు భాగంలో కొద్దిగా నూనె రాసి, క్యారట్ తురుమును చల్లుకోని పక్కన పెట్టుకోవాలి • రాగి పిండి, సూజీ రవ్వ పెరుగు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తురుము చక్కెర, రుచికి సరిపడా ఉప్పు వేసి ఇడ్లీపిండిలా కలిపి, మూత పెట్టి పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి •తరువాత డోక్లా గిన్నెలో ఈ మిశ్రం పోసేముందు ఈనో సాల్ట్ వేసి చక్కగా కలపాలి • ఇప్పుడు డోక్లా గిన్నెలో పోసి పదినిమిషాలు ఆవిరి మీద ఉడికించాలి • మిగిలిన నూనెను వేడిచేసి ఆవాలు, నువ్వులు, ఇంగువ , కరివేపాకు వేసి తాలింపు పెట్టాలి • ఈ తాలింపుని ఉడికిన డోక్లా మీద వేసి సర్వ్‌చేసుకోవాలి.

వెల్లుల్లి పచ్చడి



కావలసినవి: పొట్టుతీసిన వెల్లుల్లి రెబ్బలు – కప్పు; **కారం** – ఒకటిన్నర టీస్పూన్లు; **ధనియాల పొడి** – టీస్పూను; **ఆమ్‌చూర్ పొడి** – టీస్పూను; **పసుపు** – అరటీస్పూను; **ఉప్పు** – రుచికి సరిపడా; **నూనె** – నాలుగు టీస్పూన్లు; **జీలకర్ర** – టీస్పూను ; **ఇంగువ** – టీస్పూను.

తయారీ: • వెల్లుల్లి రెబ్బలను రోట్లో వేసి కచ్చాపచ్చాగా దంచాలి • ఇప్పుడు రుచికిసరిపడా ఉప్పు, కారం, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పొడి, పసుపు వేసి అన్ని కలిసేలా దంచాలి • ఇది ముద్దలాగా మారేంత వరకు దంచి గిన్నెలోకి తీసుకోవాలి • బాణలిలో నూనెవేసి, కాగిన తరువాత జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి • జీలకర్ర చిటపటలాడాక వెల్లుల్లి ముద్దను వేసి చక్కగా కలుపుకుని దించేయాలి. బ్రెడ్, చపాతీ, అన్నంలోకి ఈ పచ్చడి మంచి సైడ్ డిష్.

దేశీ మసాలా చాయ్

కావలసినవి: **యాలకులు** – కప్పు; **లవంగాలు** – కప్పు; **శొంఠి** – కప్పు; **దాల్చిన చెక్కలు** – పన్నెండు; **మిరియాలు** – టేబుల్ స్పూను; **పెద్ద యాలక్కాయలు** – ఆరు; **అతిమధురం పొడి** – టేబుల్ స్పూను; **తులసి ఆకులపొడి** – టేబుల్ స్పూను; **బద్ద సోంపు** – టేబుల్ స్పూను; **చక్కెర** – రెండు టేబుల్ స్పూన్లు .

తయారీ: • యాలకులు, లవంగాలు, చెక్క, మిరియాలు, శొంఠిని దోరగా వేయించాలి • మసాలా దినుసులు చల్లారాక అతి మధురం తులసి పొడి, బద్దసోంపు, చక్కెర వేసి మెత్తగా పొడిచేసుకోవాలి • ఈ పొడిని గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి • టీ డికాక్షన్ మరిగేటప్పుడు ఈ పొడిని టీ మోతాదును బట్టి ఒకటి లేదా రెండు టీస్పూన్లు వేసుకుని మరిగించి, తరువాత పాలు, పంచదార వేసి మరిగిస్తే ఎంతో రుచికరమైన దేశీ మసాలా చాయ్ రెడీ.



పప్పు అన్నం వడ



కావలసినవి: అన్నం – కప్పు; పచ్చిశనగపప్పు – రెండు కప్పులు; **పచ్చిమిర్చి తరుగు** – టేబుల్ స్పూను; **మిరియాల పొడి** – రెండున్నర టీస్పూన్లు; **కొత్తిమీర తరుగు** – అర కప్పు; **ఉప్పు** – రుచికి సరిపడా; **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: • శనగపప్పును శుభ్రంగా కడిగి ఐదు గంటలపాటు నానబెట్టాలి • నానిన పప్పును మెత్తగా రుబ్బుకోవాలి • పప్పు మిశ్రమంలో అన్నం, పచ్చిమిర్చి తరుగు, మిరియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి చక్కగా కలుపుకోవాలి • ఈ మిశ్రమాన్ని వడలుగా చేసుకుని డీప్ఫ్రై చేస్తే పప్పు అన్నం వడ రెడీ. పచ్చడి, సాస్‌తో సర్వ్‌చేసుకోవాలి.

ఇన్‌స్టంట్ దాల్ ఫ్రై



కావలసినవి: కంది పప్పు – కప్పు; **ఎర్ర పప్పు** – పావు కప్పు; **పెసరపప్పు** – పావు కప్పు; **బ్లాక్ సాల్ట్** – అరటీస్పూను; **నూనె** – టేబుల్ స్పూను; ఇంగువ – అరటీస్పూను; **జీలకర్ర** – రెండు టీస్పూన్లు; **ఎండు మిర్చి** – నాలుగు; **పసుపు** – అరటీస్పూను; **కారం** – టీస్పూను; **ధనియాలు** – రెండు టీస్పూన్లు; **ఎండిన ఉల్లిపాయ తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు, **వెల్లుల్లి పొడి** –టేబుల్ స్పూను; **శొంఠి పొడి** – టీస్పూను; **కొత్తిమీర ఆకుల పొడి** – టేబుల్ స్పూను; **కసూరీ మేథి** – టీస్పూను; **నెయ్యి** – టీస్పూను; **టొమాటో** – ఒకటి ; **నిమ్మరసం** – టీస్పూను; **కొత్తిమీర తరుగు** – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: • కందిపప్పు, ఎర్రపప్పు, పెసరపప్పులను దోరగా వేయించి బ్లాక్ సాల్ట్ వేసి పొడి చేసుకోని పక్కన పెట్టుకోవాలి • బాణలిలో నూనె వేయాలి. కాగిన నూనెలో జీలకర్ర, ఎండు మిరపకాయలు వేయాలి • ఇవి వేగాక తాలింపు దినుసుల పొడులన్నీ వేయాలి. ఇవి ఒక నిమిషం వేగాక పప్పుల మిశ్రమం వేసి ఐదు నిమిషాలు వేయించి దించేయాలి • ఈ పొడిని గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి • ఇన్‌స్టంట్‌గా దాల్ ఫ్రై చేసుకోవాలనుకున్నప్పుడు... కాగిన నూనెలో టొమాటో పేస్టువేసి వేయించాలి • ఇది వేగాక పప్పుకు సరిపడా నీళ్లు పోసి మరగనివ్వాలి • మరుగుతోన్న నీటిలో మూడు టేబుల్ స్పూన్ల ఇన్‌స్టంట్ దాల్, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి • ఈ పప్పు మిశ్రమాన్ని మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి కొత్తిమీర చల్లి దించేస్తే ఇన్‌స్టంట్ దాల్‌ఫ్రై రెడీ. నిమ్మరసంతో సర్వ్ చేసుకోవాలి.

శుక్రవారం 14-7-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 300

'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

● యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.


సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



● సక్సెస్ స్టోరీ


తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్

స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

● టెక్.. టాక్



హువావే నోవా 11 ప్రో

● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హార్మని ఓఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్స్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేఔట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల



వస్తున్నారహో!

ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్


● పూజా హెగ్డే
● రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశీతో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.


● కత్రినా కైఫ్


● ప్రియాంకా చోప్రా


● అనుష్క శర్మ


● కియారా అద్వానీ

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.


● మీనాక్షీ చౌదరి
● శ్రీలీల

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


● ఆలియా భట్


● 'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ


● విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.


● అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయూర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.


● సయ్యద్ సోహైల్, రూపా కొడవాయూర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ-''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 300
శుక్రవారం 14-7-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



చందమామ చిక్కేనా..!

ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. ప్రతిష్టాత్మక చంద్రయాన్‌–3 మిషన్‌ను చంద్రుని దక్షిణ ధ్రువంపైకి పంపేందుకు సర్వం సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీశ్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌ రెండో ప్రయోగవేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌వీఎం3–ఎం4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా ఈ ప్రయోగం జరగనుంది. 6లో



జలదిగ్బంధంలో ఢిల్లీ

యమునా నది ఉప్పొంగడంతో దేశ రాజధాని ఢిల్లీలో జనజీవనం స్తంభించింది. రహదారులు, ఇళ్లు నీటమునిగాయి.
వివరాలు 6లో ▸



ప్రధానికి రెడ్‌కార్పెట్‌ స్వాగతం

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఫ్రాన్స్‌ చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి పారిస్‌లో రెడ్‌కార్పెట్‌ స్వాగతం లభించింది.
వివరాలు 6లో ▸



26 రఫేల్‌ జెట్లు, 3 సబ్‌మెరైన్లు

ఫ్రాన్స్‌ నుంచి 26 నావల్‌ వేరియెంట్‌ రఫేల్‌ జెట్లు, 3 స్కార్పిన్‌ సబ్‌మెరైన్‌ల కొనుగోలు ప్రతిపాదనలను రక్షణ శాఖ ఆమోదించింది.
వివరాలు 6లో ▸



ప్రిగోజిన్‌ హతం!

పుతిన్‌పై తిరుగుబాటు చేసిన 'వాగ్నర్‌ గ్రూప్‌' చీఫ్‌ ప్రిగోజిన్‌ను రష్యా చంపి ఉండొచ్చని అమెరికా మాజీ సైనికాధికారి పేర్కొన్నారు.
వివరాలు 6లో ▸

ప్రపంచాన్ని గెలిచేలా..
పాఠాలను మారుద్దాం

ఏఐ విప్లవంలో మన విద్యార్థులను క్రియేటర్లను చేద్దాం

వీసీల సమావేశంలో తన విజన్‌ను ఆవిష్కరించిన సీఎం వైఎస్‌ జగన్‌

- విద్యా వ్యవస్థలో ఏఐ, ఏఆర్, వీఆర్‌ సాంకేతికతతో బోధన.. తొలిసారిగా టీచింగ్, లెర్నింగ్‌లో ఎమర్జింగ్‌ టెక్నాలజీస్‌తో అనుసంధానం..
- 4వ పారిశ్రామిక విప్లవంలో ఏపీ విద్యార్థులను గ్లోబల్‌ లీడర్లుగా తయారు చేయడమే లక్ష్యం
- టెక్నాలజీ సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమూల మార్పులు
- పాఠశాల, ఉన్నత విద్యకు వేర్వేరు బోర్డులు
- ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులతో అకడమిక్‌ బోర్డు.. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, కేంబ్రిడ్జ్‌లోని బోధన పద్ధతులు, కరిక్యులమ్, ప్రశ్నపత్రాలతో సరికొత్త పాఠ్య ప్రణాళిక
- విద్యార్థికి నచ్చిన కోర్సులను అభ్యసించే అవకాశం
- మెడికల్‌ సహా అన్ని రకాల విద్యలో ఏఐ రోబోటిక్స్‌ బోధన.. బోధన, పాఠ్య ప్రణాళికలో ఎమర్జింగ్‌ టెక్నాలజీస్‌ అంశాలు
- అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇవి సమానంగా అందాలని దిశా నిర్దేశం



"మన విద్యా వ్యవస్థలో వీఆర్‌ (వర్చువల్‌ రియాలిటీ), ఏఆర్‌ (అగ్‌మెంటెడ్‌ రియాలిటీ), ఏఐ (ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌) టెక్నాలజీల సాంకేతికతను పెంచాలి. లో లెవల్‌ మెషిన్‌ లెర్నింగ్, మెటావర్స్‌తో మిళితం చేయాలి. మన విద్యార్థులు ఏఐలో నిష్ణాతులుగా మారి, ఆ తర్వాత క్రియేటర్లుగా రాణించేలా ఇక్కడి నుంచే తొలి అడుగు వేయాలి. అందుకే పాఠశాల విద్య, ఉన్నత విద్య స్థాయిలో వేర్వేరుగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేస్తాం. ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటూ విద్యా వ్యవస్థలో సాంకేతికతను ముందుకు తీసుకెళదాం. అత్యుత్తమ ప్రతిభావంతుల ద్వారా పాశ్చాత్య దేశాల విద్యా విధానంలోని అంశాలతో మన కరిక్యులమ్‌ను రీడిజైన్‌ చేద్దాం."
– ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ విద్యా విధానంలో ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ)ను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ బోధన, నేర్చుకునే సామర్థ్యం పెంచడంతో పాటు.. వారిని ఏఐ క్రియేటర్లుగా తీర్చిదిద్దేలా పాఠ్య ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వర్సిటీల వీసీలకు పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కరిక్యులమ్‌లో ఏఐ ఒక భాగం కావాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు విద్యా విధానాన్ని ఏఐ మార్చబోతోందని, ఈ రూపంలో ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవం దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. బోధన, నైపుణ్యాభివృద్ధిలో తొలిసారిగా ఎమర్జింగ్‌ టెక్నాలజీ అనుసంధానం చేసేలా
మిగతా 2వ పేజీలో ▸

జ్యోతి 'స్వర్ణ' చరిత్ర



ఆసియా అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర అమ్మాయికి పసిడి పతకం

11లో

గతంలో ఏ భారతీయ అథ్లెట్‌కు సాధ్యంకాని ఘనతను తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ సాధించింది. ఆసియా అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్‌ క్రీడాకారిణి జ్యోతి స్వర్ణ పతకంతో మెరిసింది. థాయ్‌లాండ్‌ రాజధాని బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో గురువారం జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌ ఫైనల్‌ రేసును 13.09 సెకన్లలో ముగించి చాంపియన్‌గా అవతరించింది. తద్వారా 50 ఏళ్ల ఈ పోటీల చరిత్రలో 100 మీటర్ల హర్డిల్స్‌లో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా జ్యోతి గుర్తింపు పొందింది. విశాఖ జిల్లాకు చెందిన జ్యోతి ఈ ప్రదర్శనతో వచ్చే నెలలో బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌ పోటీలకు కూడా అర్హత సాధించింది. ప్రస్తుతం భువనేశ్వర్‌లోని రిలయన్స్‌ అథ్లెటిక్స్‌ హై పెర్ఫార్మెన్స్‌ సెంటర్‌లో ఇంగ్లండ్‌కు చెందిన కోచ్‌ జేమ్స్‌ హీలియర్‌ వద్ద జ్యోతి శిక్షణ తీసుకుంటోంది. గత రెండేళ్లుగా జ్యోతి జాతీయ, అంతర్జాతీయ మీట్‌లలో నిలకడగా పతకాలు సాధిస్తోంది.

న్యూస్‌రీల్‌

రక్షణ రంగానికి వెన్నెముక విశాఖ



'రక్షణ రంగానికి విశాఖ వెన్నెముక లాంటిది. రక్షణ రంగ పరికరాల తయారీ పరిశ్రమలు విశాఖలో అభివృద్ధి చెందుతున్నాయి' అని రక్షణ శాఖ సైంటిఫిక్‌ అడ్వైజర్‌ డాక్టర్‌ సతీశ్‌రెడ్డి అన్నారు. సీఐఐ విశాఖలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు.
వివరాలు 12లో ▸

ఏపీలో రోడ్ల నిర్మాణం 'డబుల్‌ స్పీడ్‌'



'అభివృద్ధి పనులకు నిధులు రాబట్టడంలో ఆంధ్రప్రదేశ్‌ ఎంపీలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నారు. ఏపీలో రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది' అని కేంద్ర మంత్రి గడ్కరీ అన్నారు. కృష్ణపట్నం పోర్టు కనెక్టివిటీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు.
వివరాలు 5లో ▸

పోలీస్‌ కస్టడీకి రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్‌ స్వర్ణలత



నోట్ల మార్పిడి పేరుతో నేవీ ఉద్యోగులను మోసం చేసిన కేసులో రిమాండ్‌లో ఉన్న హోంగార్డ్స్‌ రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్‌(ఆర్‌ఐ) స్వర్ణలతతో పాటు నిందితులు విజ్జన సూరిబాబు, మహంతి హేమసుందర్, శ్రీనులను విశాఖ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు.
వివరాలు 12లో ▸

వలంటీర్ల వ్యవస్థ రద్దు కోసమే కుట్ర



రాష్ట్రంలో పేద ప్రజలందరికీ మేలు చేసే వలంటీర్ల వ్యవస్థనే రాష్ట్రంలో లేకుండా చేసేందుకు రామోజీ, చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌ ఒక్కటై కుట్రలు మొదలుపెట్టారు. 2019లోనే హైకోర్టుకు వెళ్లి అడ్డుకునేందుకు విఫలయత్నం జరగగా.. ఇప్పుడు ఎన్నికల ముందు మరోసారి అదే స్కెచ్‌ వేశారు.
వివరాలు 10లో ▸

విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్‌ సమావేశంలో పాల్గొన్న మేధావులు



వలంటీర్లకు పవన్‌ క్షమాపణ చెప్పాల్సిందే

లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్‌ స్టేషన్లలో ప్రైవేట్‌ కేసులు

- 'మానవ అక్రమ రవాణా–గ్రామ వలంటరీ వ్యవస్థ'పై రౌండ్‌ టేబుల్‌లో మేధావుల ఆగ్రహం
- పరువు నష్టం దావా కూడా వేయాలని ఏకగ్రీవ తీర్మానం
- గతంలో చంద్రబాబు చేసిన విమర్శలు ప్రజలు పట్టించుకోలేదు
- చంద్రబాబు స్క్రిప్టునే పవన్‌ యథాతథంగా చదువుతున్నారు
- దమ్ముంటే యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ బిల్లుపై కేంద్రాన్ని నిలదీయ్‌

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు తప్పు అని ఒప్పుకుంటూ జనసేన అధినేత పవన్‌ కళ్యాణ్‌ బహిరంగ క్షమాపణ చెప్పాలని పలువురు మేధావులు డిమాండ్‌ చేశారు. ఆంధ్రప్రదేశ్‌ ఇంటెలెక్చువల్స్‌ సిటిజన్స్‌ ఫోరం ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం 'మానవ అక్రమ రవాణా–గ్రామ వలంటరీ వ్యవస్థ'పై రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ఏ వారాహిపై నుంచి పవన్‌ నిందలు వేశారో అదే వారాహిపై నుంచి క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్‌ స్టేషన్లలో అతనిపై ప్రైవేటు కేసులు పెట్టాలని, అలాగే పరువు నష్టం దావా వేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పడినపుడు..
మిగతా 10వ పేజీలో ▸

అలహాబాద్‌కు జస్టిస్‌ రమేశ్‌ బదిలీ

కర్ణాటక హైకోర్టుకు జస్టిస్‌ కన్నెగంటి లలిత.. కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం


జస్టిస్‌ డి. రమేశ్‌ జస్టిస్‌ కన్నెగంటి లలిత

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ డి.రమేశ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ కన్నెగంటి లలిత బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. జస్టిస్‌ రమేశ్‌ను అలహాబాద్‌ హైకోర్టుకు, జస్టిస్‌ లలితను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలంటూ గతేడాది నవంబరు 24న సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును రాష్ట్రపతి ముర్ము గురువారం ఆమోదించారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్‌ ట్వీట్‌ చేయగా.. న్యాయ శాఖ నోటిఫికేషన్‌ విడుదల చేసింది.

పారని బాబు, నారాయణ పాచిక

- అమరావతి అసైన్డ్‌ భూముల కేసులో సుదీర్ఘ వాయిదాకు మరోసారి యత్నం
- స్టే పొంది పలుమార్లు వాయిదాలు తీసుకున్న బాబు బృందం
- ఫిర్యాదుదారుకి నోటీసులు అందలేదంటూ తాజాగా వాదన
- ఆళ్లకు గతంలోనే నోటీసులు ఇచ్చినట్లు గుర్తింపు
- అయినా సుదీర్ఘ వాయిదాకు బాబు న్యాయవాదుల వినతి
- తీవ్ర అభ్యంతరం తెలిపిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి

5లో



- ఇప్పటికే ఎన్నోసార్లు వాయిదాలు కోరారని వెల్లడి.. ఎత్తుగడ ఫలించక పోవడంతో స్వల్ప వాయిదాకు బాబు న్యాయవాదుల అభ్యర్థన
- తదుపరి విచారణ వచ్చే గురువారానికి వాయిదా



అవినీతిపరులతోనే చంద్రబాబు స్నేహం

- ఏపీలోనూ బాబు సింగపూర్‌ సిత్రాలు చూపించారు
- వలంటీర్లపై పవన్‌ అక్కసు
- వీధిలో అందరికీ తెలిసినవారే.. 50 ఇళ్లకు ఓ వలంటీర్‌గా ఉంటారు
- విద్యా సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్‌ నంబర్‌–1
- పరీక్షల నుంచి టీచర్ల బదిలీ వరకు అన్నీ సమర్థంగా నిర్వహించాం
- మంత్రి బొత్స సత్యనారాయణ

5లో



నాలుగు నెలల్లో 3,500 కి.మీ. రహదారులు

- 437 రోడ్ల పనులకు రూ.1,122 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఆగస్టుకి టెండర్ల ప్రక్రియ.. డిసెంబర్‌కు పనులు పూర్తి
- ఇప్పటికే 2 దశల్లో రోడ్ల పనులు
- రూ.4,492.99 కోట్లతో 12,894 కి.మీ. నిర్మాణం
- తాజాగా మూడో దశలో రహదారుల పునరుద్ధరణ

2లో

ఇదండీ సంగతి




మన సారే! వరద ప్రాంతాల సందర్శనకు వెళ్తున్నారు!!

'అసైన్డ్‌' రైతుల జీవితాల్లో వెలుగు

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా అసైన్డ్‌ భూములపై సర్వ హక్కులు

- కేటాయించి 20 ఏళ్లు పూర్తయితే యాజమాన్య హక్కు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం
- 15,21,160 మంది రైతులకు 27,41,698 ఎకరాల ద్వారా ప్రయోజనం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద రైతులకు భారీ లబ్ధి
- ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం తీసుకోలేని సాహసోపేత నిర్ణయం.. 70 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములపైనా ఇన్నాళ్లూ హక్కులు లేని వైనం
- మంత్రి ధర్మాన నేతృత్వంలో ప్రజాప్రతినిధుల కమిటీ ఏర్పాటు..
- విస్తృత అధ్యయనం తర్వాత నివేదిక.. కేబినెట్‌ ఆమోదం.. అసైన్డ్‌ భూముల చట్టానికి సవరణ చేయనున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అసైన్డ్‌ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కేటాయించిన 20 సంవత్సరాల తర్వాత అసైన్డ్‌ భూముల యజమానులకు సర్వ హక్కులు ఇవ్వడం భూముల వ్యవహారాల్లోనే మేలి మలుపు. దీనివల్ల 15 లక్షల మందికిపైగా రైతులకు ప్రయోజనం చేకూరడంతోపాటు రాష్ట్రంలో అసైన్డ్‌ భూముల వివాదాలకు తెరపడనుంది. సీఎం వైఎస్‌ జగన్‌ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో లక్షలాది మంది రైతుల బతుకు చిత్రాన్ని మార్చే అత్యంత కీలకమైన ఈ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేశారు. భూమి లేని నిరుపేదలు, ఆర్మీలో పని చేసిన వారు, స్వాతంత్య్ర సమర యోధులకు వ్యవసాయ భూములు ఇస్తారు (అసైన్‌ చేస్తారు). తమకు ఇచ్చిన భూములను స్వాతంత్య్ర సమర యోధులు, ఆర్మీలో పని చేసిన వారు (ఎక్స్‌ సర్వీస్‌మెన్‌)..
మిగతా 5వ పేజీలో ▸

‘కియా’కు సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: కియా ఇండియా నాలుగేళ్లలోనే 10 లక్షల కార్లను ఉత్పత్తి చేయడంపై సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. స్వల్పకాలంలోనే మిలియన్ కార్లను ఉత్పత్తి చేయడం ద్వారా కియా ఇండియా చరిత్ర సృష్టించిందని.. ఇందుకు కియా ఇండియాకు హృదయపూర్వక అభినందనలంటూ ఆయన గురువారం ట్వీట్ చేశారు. ఏపీ ఆటోమొబైల్ రంగం పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానమని ఈ మైలురాయి చాటి చెప్పిందని పేర్కొన్నారు. అలాగే పుష్కల వనరులున్న రాష్ట్రమని మరోసారి అందరికీ తెలియజేసిందన్నారు. భవిష్యత్‌లో కియా ఇండియా మరిన్ని విజయాలు సాధించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

విజయనగరం జెడ్పీ చైర్మన్‌కు పితృవియోగం

- సంతాపం తెలిపిన సీఎం జగన్


మజ్జి నర్సింగరావు

విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తండ్రి మజ్జి నర్సింగరావు (87) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న నర్సింగరావు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు కుమారుడు మజ్జి శ్రీనివాసరావుతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. మజ్జి శ్రీనివాసరావును సీఎం జగన్ ఫోన్‌లో పరామర్శించారు. శ్రీనివాసరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

4 నెలల్లో 3,500 కి.మీ.రోడ్లు

437 రహదారి పనులకు రూ.1,122 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల పునరుద్ధరణను మరింత వేగవంతం చేసింది. కొత్తగా 3,500 కిలోమీటర్ల 437 రోడ్ల పనుల కోసం రూ.1,122 కోట్లు కేటాయించింది. ఆగస్టుకి టెండర్ల ప్రక్రియ చేపట్టి డిసెంబర్‌కి ఆ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో టెండర్ల ప్రక్రియకు రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖ చర్యలు చేపట్టింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే నాలుగేళ్లలో రెండు దశల్లో రూ.4,492.99 కోట్లు వెచ్చించి 12,894 కి.మీ. రోడ్లు నిర్మించింది. ఇప్పుడు మూడో దశ పనులకు నిధులు కేటాయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజాగా పునరుద్ధరించాల్సిన రోడ్లను శాస్త్రీయంగా ఎంపిక చేశారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి అత్యధిక రద్దీ ఉన్న రోడ్లను ఎంపిక చేశారు. వీరిచ్చిన



నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. జిల్లా కేంద్రాలను అనుసంధానించే రోడ్లు, మండల కేంద్రాలను జిల్లా కేంద్రంతో అనుంధానించే 437 రోడ్లను తగిన నిష్పత్తిలో నిర్ణయించారు. వాటిలో 1,289.80 కి.మీ. మేర 132 రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిని రూ.490.80 కోట్లతో పునరుద్ధరించనున్నారు. కొత్త జిల్లా కేంద్రాలకు మండల కేంద్రాలతో అనుసంధానించే రోడ్లకు ప్రాధాన్యమిచ్చారు. అందుకే జిల్లా ప్రధాన రహదారుల కేటగిరీలోని 2,210.20 కి.మీ. మేర 305 రోడ్లను రూ.631.20 కోట్లతో పునరుద్ధరించనున్నారు.

ప్రాధాన్యక్రమంలో బిల్లుల చెల్లింపు

రోడ్ల పునరుద్ధరణ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు కోసం ఆర్ అండ్ బి అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇటీవల రూ.500 కోట్ల బిల్లులను చెల్లించారు. మిగిలిన బిల్లుల చెల్లింపును వేగవంతం చేశారు. ఇక మూడో దశ కింద చేపట్టనున్న రోడ్ల పనుల బిల్లుల చెల్లింపునకు కూడా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తున్నారు. పనులు పూర్తి చేసి బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే ప్రాధాన్యక్రమంలో చెల్లించే విధానాన్ని రూపొందించారు. దీనిపై కాంట్రాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

మరిన్ని పెట్టుబడుల కోసం విదేశాలకు..

- ఆర్థిక మంత్రి బుగ్గన నేతృత్వంలో 10 రోజుల పర్యటనకు అధికారులు
- ఈనెల 15 నుంచి దక్షిణ కొరియా, వియత్నాంల సందర్శన

సాక్షి, అమరావతి: మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ఉద్దేశంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నేతృత్వంలో ఆరుగురు అధికారులతో కూడిన బృందం ఈనెల 15 నుంచి 25 వరకు దక్షిణ కొరియా, వియత్నాం దేశాల్లో పర్యటించనుంది. అక్కడ ప్రముఖ సంస్థలను సందర్శించి.. ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను వివరించనుంది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి వినోద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటారు. మంత్రి బుగ్గన ఈ నెల 10న ఢిల్లీలో దక్షిణ కొరియా, వియత్నాం రాయబారులతో సమావేశమై పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. దీనికి కొనసాగింపుగా ఏపీ బృందం కొరియాలోని కియా పరిశ్రమను సందర్శించి ఏపీలోని యూనిట్‌ను మరింతగా విస్తరించడానికి గల అవకాశాలను వివరిస్తారు. శామ్‌సంగ్, దేసాంగ్ కార్పొరేషన్‌లతో పాటు కొరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మారిటైమ్ అండ్ ఫిషరీస్ టెక్నాలజీలను ఈ బృందం సందర్శించనుంది. విశాఖలో జరిగిన జీఐఎస్‌లో వియత్నాం ప్రతినిధులతో సమావేశమై పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. దీనికి కొనసాగింపుగా తాజా పర్యటనలో ఆ దేశ పారిశ్రామికవేత్తలతో సమావేశమవ్వనున్నారు. వియత్నాంలోని సౌత్ ఎకనామిక్ జోన్‌ను సందర్శించనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ..పరిశ్రమలు, టెక్స్‌టైల్స్, ఆక్వా రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు అక్కడ పాటిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను పరిశీలించనున్నట్లు ‘సాక్షి’కి తెలిపారు.


సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అహ్మద్ అలీఖాన్ తదితరులు

వైఎస్సార్‌సీపీలోకి కాంగ్రెస్ నేతలు

- కర్నూలు జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, పలువురు నేతల చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో కర్నూలు జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, ఇతర నేతలు పోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తకియా సాహెబ్, వినయ్ కుమార్‌లకు గురువారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి (మైనార్టీ సంక్షేమం) అంజాద్‌బాషా, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, కర్నూలు ఎమ్మెల్యే అబ్దుల్ హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింలకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. అహ్మద్ అలీ ఖాన్ కాంగ్రెస్ పార్టీ తరఫున 2014లో ఎమ్మెల్యేగా, 2019లో కర్నూలు ఎంపీగా పోటీ చేశారని చెప్పారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

కాంగ్రెస్ పార్టీలో పలు పదవులు నిర్వహించాను. దేశ వ్యాప్తంగా పర్యటించాను. ప్రస్తుతం ఏపీలో పారదర్శక పాలన సాగుతోంది. పాఠశాలలు చాలా అభివృద్ధి చెందుతున్నాయి. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు నచ్చే నేను వైఎస్సార్‌సీపీలో చేరాను. నేను ఏ డిమాండ్ పెట్టలేదు. పార్టీ అధిష్టానం ఏం చెబితే అది చేస్తాను.
– అహ్మద్ అలీఖాన్

అలీఖాన్ సేవలను వైఎస్సార్‌సీపీ వినియోగించుకుంటుందన్నారు. గతంలో మైనార్టీలంటే వక్ఫ్ బోర్డు పదవులే దక్కేవని, ఇప్పుడు పలు పదవుల ద్వారా మేలు జరుగుతోందని తెలిపారు. అందరం కలిసి జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కర్నూలు ఎంపీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. అహ్మద్ అలీఖాన్ వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అహ్మద్ అలీఖాన్ సేవలను రాష్ట్ర స్థాయిలో వినియోగించుకుంటామన్నారు. సీఎం జగన్‌పై రాజకీయంగా బురద జల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొడతామని చెప్పారు.

షుగర్ లెస్.. జబ్బులు ప్లస్..

డైట్ కోక్...రుచిగా ఉంటుంది కానీ చక్కెర ఉండదు కాబట్టి పరవాలేదు..ఆ కేక్ షుగర్ ఫ్రీ.. ఎలాంటి సంశయం లేకుండా తినొచ్చు. షుగర్ లెస్ బిస్కెట్స్, షుగర్ లెస్ స్వీట్స్.. వీటితో కూడా ఎలాంటి ఇబ్బందీ లేదు.. అని అనుకుంటున్నారా? అయితే మీరు తప్పులో కాలేసినట్లే. అలాగే టీ, కాఫీల్లో చక్కెరకు బదులుగా మార్కెట్లో లభించే స్వీట్‌నర్స్‌ని కలుపుతున్నారా? కొంచెం ఆలోచించాల్సిందే. ఎందుకంటే చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడే స్వీట్‌నర్స్ రకరకాల అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా ఇటీవల దీనిని ధ్రువీకరించింది.

– సాక్షి, హైదరాబాద్

నేటి కృత్రిమ తీపి.. రేపటికి చేదంటున్న అధ్యయనాలు

- మార్కెట్లో విరివిగా అందుబాటులో ఎరేటెడ్ డ్రింక్స్, కృత్రిమ తీపితో కూడిన ఆహార పదార్థాలు
- చక్కెర రహితమనే ఉద్దేశంతో వాటివైపు మొగ్గు
- కానీ స్వీట్‌నర్లు రకరకాల అనారోగ్య సమస్యలకు దారితీయొచ్చంటున్న వైద్యులు
- ఎక్కువగా వాడితే డేంజరేనంటున్న డబ్ల్యూహెచ్‌ఓ



పెరుగుతున్న మార్కెట్..

మార్కెట్‌లో కృత్రిమ తీపితో కూడిన ఉత్పత్తులు పెరుగుతున్నాయి. చాలామంది తీపి పదార్థాలను ఇష్టపడతారు. రకరకాల స్వీట్లు, బిస్కెట్లు, కేక్‌లు లాగించేస్తుంటారు. తియ్యగా ఉండే శీతల పానీయాలను తాగుతుంటారు. పండ్లు, ధాన్యాలు, పాల ఉత్పత్తులు తదితరాల్లోని సహజమైన తీపి సురక్షితమైనదే.. కానీ ఎక్కువగా శుద్ధి చేసిన చక్కెర తీపి ఊబకాయం సహా అనేక రకాల వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతోంది. ఈ మేరకు గత కొంత కాలంగా పెరిగిన అవగాహనను ఆసరాగా చేసుకుని కృత్రిమ స్వీట్‌నర్ల వాడకం విస్తృతంగా పెరిగింది. మరోవైపు మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు ఉన్నవారు లేదా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులు.. అందుబాటులో ఉన్న తక్కువ కేలరీలున్న ప్రాసెస్డ్ చక్కెర రహిత స్వీట్‌నర్‌లతో కూడిన ఆహారాన్ని, పానీయాలను వినియోగిస్తున్నారు. తీపి పదార్థాలకు దూరంగా ఉండటానికి బదులు, షుగర్ లెస్ (చక్కెర రహితం) అనే ఉద్దేశంతో కృత్రిమ స్వీట్‌నర్లు ఉపయోగించి తయారు చేసిన ఎరేటెడ్ పానీయాలు, మిఠాయిలు, బిస్కెట్లు, అల్పాహారం, తృణధాన్యాల ఉత్పత్తులు విరివిగా తీసుకుంటున్నారు.

అడుగడుగునా అవే..

ఇటీవలి కాలంలో కృత్రిమ స్వీట్‌నర్లతో కూడిన సోడాలు, శీతల పానీయాలు, మిఠాయిలు, బిస్కెట్లు, చివరకు తృణధాన్యాల ఉత్పత్తులు మార్కెట్లో ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. తక్కువ పరిమాణంలో వినియోగిస్తే పరవాలేదు. కానీ అధిక పరిమాణంలో తీసుకున్నా, లేదా క్రమ పద్ధతిలో తీసుకోకపోయినా ఆరోగ్యానికి చాలా హానికరమని, జీవక్రియ సామర్థ్యాన్ని తగ్గించి నీరసంగా, అలసిపోయేలా చేస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఎలాంటి పోషక విలువలు లేని ఈ కృత్రిమ తీపి పదార్థాలకు చిన్నారులు చాలా తేలికగా అలవాటవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డబ్ల్యూహెచ్‌ఓ కూడా అదే చెప్పింది..

బరువును తగ్గించడానికి లేదా శరీరంలో చక్కెర స్థాయిలు పెరగకుండా కృత్రిమ స్వీట్‌నర్లను ఉపయోగించడం సరైంది కాదని డబ్ల్యూహెచ్‌ఓ సైతం ఇటీవల స్పష్టం చేసింది. చక్కెర రహిత స్వీట్‌నర్ల వినియోగం వల్ల పెద్దలు లేదా పిల్లల్లో శరీర కొవ్వు తగ్గడం వంటి ప్రయోజనాలేవీ ఉండవని పేర్కొంది. వీటి విపరీత వాడకం వల్ల టైప్ 2 మధుమేహం, గుండె సంబంధ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు పెద్ద వయసు వారిలో మరణాలు సంభవించే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించింది. చక్కెరకు ప్రత్యామ్నాయంగా కృత్రిమ స్వీట్‌నర్‌లను ఉపయోగించడం వల్ల ఎదురయ్యే దీర్ఘకాలిక ప్రమాదాల గురించి నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం కూడా హెచ్చరించింది. వివిధ బ్రాండ్ల పేరుతో భారత్‌లో, విదేశాల్లో విస్తృతంగా లభించే ఎరిత్రిటాల్ వంటి స్వీట్‌నర్ల వల్ల గుండెపోట్లకు గురయ్యే అవకాశం పెరుగుతుందని తెలిపింది.

ఎక్కువైతే... డేంజర్...

చక్కెర రహిత స్వీట్‌నర్లు బరువు కోల్పోవడానికి సహాయపడే బదులు బరువు పెరగడానికి దోహదపడుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే మానసిక ఆందోళనను నియంత్రించడంలో కీలకమైన మెదడులోని న్యూరో ట్రాన్స్‌మిటర్ స్థాయిలను ఇవి ప్రభావితం చేస్తాయని, సెరోటోనిన్ (మెదడులోని నరాల కణజాలం, యావత్ శరీరం మధ్య సందేశాలను మోసుకెళ్లే రసాయనం) స్థాయిలను తగ్గిస్తాయని కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. కృత్రిమ తీపి పదార్థాలను అధికంగా ఉపయోగించడం వల్ల కాలేయం దెబ్బతినడంతో పాటు పేగుల ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నట్టు కూడా దాఖలాలున్నాయని వెల్లడిస్తున్నాయి.

దూరంగా ఉండటమే మంచిది



ఇప్పుడు మనకు పెద్ద సంఖ్యలో స్వీట్‌నర్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిలో అత్యల్పంగా 3, 4 ఉత్పత్తులకు మాత్రమే ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) ఆమోదం ఉంది. ఇక నేరుగా తీసుకునే స్వీట్‌నర్ పిల్స్, పౌడర్లు కూడా దొరుకుతున్నాయి. అయితే పౌడర్‌లు వాడే వారు ఎక్కువ పరిమాణం తీసుకునే అవకాశం ఉంది. దీనివల్ల జీర్ణకోశ సమస్యలు బాగా వస్తున్నట్టు మాకు వచ్చే కేస్ స్టడీస్ చెబుతున్నాయి. ఇక కృత్రిమ స్వీట్‌నర్స్‌లో కొన్ని రసాయనాలు వాడతారు. అవి కూడా సమస్యలు తెచ్చే అవకాశం ఉంది. వీటిని తీసుకోవాల్సి వస్తే.. ఏ రకమైన స్వీట్‌నర్స్ తీసుకుంటున్నారో గుర్తించడం చాలా ముఖ్యం. కాగా రోజూ తీసుకోవచ్చా? వారానికోసారా? వంటి మార్గదర్శకాలు ఎక్కడా లేకపోవడం ఓ సమస్యగా మారింది. ఏదిఏమైనా వీటిని ఇష్టారాజ్యంగా తరచుగా వాడకుండా ఉండటమే మంచిది. డయాబెటిక్ ఫ్రీ అంటూ ఈ స్వీట్‌నర్లు ఉపయోగించి స్వీట్స్ కూడా తయారు చేస్తున్నారు. అయితే అవి ఎలాంటివో, ఎంత మేర కలుపుతున్నారో మనకు తెలీదు. కాబట్టి వాటికి దూరంగా ఉండడమే మంచిది.

– డా.శివరాజు, ఫిజీషియన్, కిమ్స్ ఆసుపత్రి

ప్రపంచాన్ని గెలిచేలా.. పాఠాలను మారుద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా శాఖ అధికారులు, విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లతో గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రాక్టికల్ అప్లికబులిటీ ఆఫ్ నాలెడ్జ్‌ను తీసుకురావడంతో పాటు మరిన్ని వర్టికల్స్ చదువుకునే అవకాశం ఇవ్వాలన్నారు. సాంకేతిక వైద్య విధానాలు అందుబాటులోకి రావడంతో వైద్య విద్య పాఠ్య ప్రణాళిక, బోధనలో రోబోటిక్స్, ఏఐల ప్రాధాన్యం పెంచాలని చెప్పారు. నాలుగవ పారిశ్రామిక విప్లవంలో ఏపీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తయారు చేయడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేయాలని దిశా నిర్దేశం చేశారు. ఆ వివరాలు సీఎం జగన్ మాటల్లోనే..

ఫ్యాకల్టీల్లో ఆప్షన్లు పెంచాలి

- జర్మనీ వంటి దేశంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ఉంది. పాశ్చాత్య ప్రపంచం అంతా జనాభా అసమతుల్యత (డెమొగ్రఫిక్ ఇన్‌బ్యాలెన్స్)ను ఎదుర్కొంటోంది. కానీ, భారతదేశంలోనైనా.. ఆంధ్రప్రదేశ్‌లో చూసినా సుమారు 70 శాతం మంది పనిచేసే వయస్కులు ఉన్నారు. వీరికి సరైన విజ్ఞానం, నైపుణ్యం అందించేందుకు విద్యా రంగంలో మార్పులకు శ్రీకారం చుట్టాలి.
- ఇప్పటి వరకు మన విద్యార్థులకు కొన్ని సబ్జెక్టులను మాత్రమే నిర్దేశిస్తున్నాం. అదే పాశ్చాత్య దేశాల కరిక్యులమ్‌లో ఒక ఫ్యాకల్టీలో చాలా వర్టికల్స్ కనిపిస్తాయి. అక్కడ బీకాంలోనే అసెట్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మార్కెట్, రిస్క్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ అనాలసిస్ ఇలా ఎన్నో ఉంటాయి. ఇవి మన దగ్గర లేవు.
- మన వాళ్లు మంచి డిగ్రీ కోసం విదేశాలకు వెళ్లాల్సిందే. ఏపీలో చదువుకునే విద్యార్థులకు నచ్చిన వర్టికల్స్ చదువుకునే అవకాశాలు ఇవ్వాలి. తాజాగా డిగ్రీలకు సంబంధించి క్రెడిట్స్ ఇస్తున్నాం. ఇకపై వాటి స్థాయిని పెంచుతూ ప్రతి ఫ్యాకల్టీలో ఎక్కువ ఆప్షన్లలో బోధన సాగించాలి. ఇప్పటికే ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసి, ఉద్యోగాల కల్పన దిశగా అడుగులేశాం. విద్యార్థుల ఉన్నతికి ఇలాంటి ఎన్నో మార్పులు అవసరం.

మెడికల్ కోర్సుల్లో సాంకేతిక విజ్ఞానం పెంపు

- వైద్య విద్య కోర్సుల్లోని బోధన పద్ధతుల్లో గణనీయమైన మార్పులు రావాలి. భవిష్యత్తులో ఐదేళ్ల మెడికల్ కోర్సులో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచాలి. శరీర భాగాలను కోసి ఆపరేషన్ చేసే రోజులు మారిపోయాయి. కంప్యూటర్ల ద్వారా ఏఐను వాడకుని చిన్న చిన్న రంధ్రాలతో ఆపరేషన్ చేస్తున్నారు. అందుకే వైద్య విద్యలో రోబోటిక్స్, ఏఐలను భాగస్వామ్యం చేయాలి.
- హరియాణలోని ఒక మెడికల్ కాలేజీలో ఇలాంటి కోర్సులనే ప్రవేశపెట్టారు. కేవలం మెడిసిన్‌లో చికిత్సకు సంబంధించిన విజ్ఞానం ఇవ్వడమే కాదు, టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడంపై కూడా పాఠ్య ప్రణాళికలో జోడించాలి.

త్వరలో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్

- ఏపీలో ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయం చేసే తీరులో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాం. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే గ్రామ స్థాయిలోనే రైతును చేయి పట్టుకుని సాగు చేయించే వ్యవస్థను తీసుకొచ్చాం.
- ఇంతటితో ఆగిపోకుండా.. ప్రతి ఎకరాలో భూసార పరీక్షలు చేసి పంట సాగయ్యేలా చర్యలు చేట్టాలి. శాటిలైట్ ఇమేజ్ ద్వారా భూమిలోని కాంపోజిషన్‌ను తెలుసుకోవచ్చు. డ్రోన్ల ద్వారా భూమిలోని మినరల్ డిపాజిట్లను ఇంకా దగ్గరగా తెలుసుకునే అవకాశం వస్తోంది. ఆ రిపోర్టుల ద్వారా వ్యవసాయంలో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకురావచ్చు. అప్పుడు పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలో సులభంగా తెలుస్తుంది. ఇటువంటి టెక్నాలజీని మన విద్యార్థులకు నేర్పించాలి.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విద్యా శాఖ అధికారులు, వర్సిటీల వీసీలు

> సెక్యూరిటీ అనాలసిస్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి వర్టికల్ కోర్సులకు బోధన సామర్థ్యం మన దగ్గర అందుబాటులో లేకపోతే.. వర్చువల్ రియాలిటీని.. అగ్‌మెంటెడ్ రియాలిటీతో అనుసంధానించి వర్చువల్ క్లాస్ టీచర్ ద్వారా పాఠాలు చెప్పిద్దాం. - సీఎం జగన్

హైలెవల్ అకడమిక్ బోర్డు

- ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, ఎంఐటీ, కేంబ్రిడ్జ్ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోని పాఠ్యపుస్తకాలు, బోధనా పద్ధతులు, ప్రశ్నపత్రాల సరళి మన కంటే ఎంతో భిన్నంగా ఉంటుంది. అక్కడ టెక్స్ట్‌బుక్స్ విద్యార్థులకు ఇచ్చి సమాధానాలు రాయిస్తా రు. తద్వారా ప్రాక్టికల్ అప్లికబిలిటీని పరీక్షిస్తా రు. అందుకే మనదగ్గర కూడా ప్రశ్నపత్రాల రూపకల్పన, బోధనా పద్ధతులు మారాలి. ఒక్కో వర్సిటీ ఒక్కో రకంగా కరిక్యులమ్ తయారు చేయడం కాకుండా అందరూ అనుసరించే లా ఒక నిర్దిష్టమైన కరిక్యులమ్ రూపొందించాలి.
- అందుకే పాఠశాల విద్య, ఉన్నత విద్య స్థాయిలో వేర్వేరుగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు మనం విజన్ కోసం ఒక హైలెవల్ అకడమిక్ బోర్డు అవసరం. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులతో ఈ బోర్డును ఏర్పాటు చేద్దాం. తద్వారా పాశ్చాత్య దేశాల విద్యా విధానంలోని అంశాలతో మన కరిక్యులమ్‌ను రీడిజైన్ చేద్దాం. పాఠ్యప్రణాళికను, బోధనను, ప్రశ్నపత్రాల తీరును మారుద్దాం.

పాఠశాల స్థాయి నుంచే మార్పులు

- విద్యా వ్యవస్థలో పాఠశాలస్థాయి నుంచే సమూల మార్పులు రావాలి. ఇప్పటికే మనం ఆ దిశగా చర్యలు చేపట్టాం. ఇంగ్లిష్ మీడియం చదువులు, బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు, ఆరో తరగతి నుంచి డిజిటల్ బోధనను తీసుకొచ్చాం. డిసెంబర్ నాటికి 63 వేల క్లాస్ రూమ్స్‌ను ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌తో డిజిటలైజ్ చేస్తున్నాం. ఇప్పటికే 31 వేల తరగతి గదుల్లో ప్యానెల్స్ ఏర్పాటు చేశాం.
- బైజూస్ కంటెంట్‌ను ఇంటిగ్రేట్ చేశాం. ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చాం. దీనికి తదుపరిగా మరిన్ని మార్పులు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఎమర్జింగ్ టెక్నాలజీల్లో చాలా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. అవసరమైతే ఇంటర్నెట్‌లోని కంటెంట్ ద్వారా టెక్నాలజీ వాడకంపై శిక్షణ ఇస్తే మనకూ తగినంత ఫ్యాకల్టీ సిద్ధమవుతారు.
- విద్యా రంగంలో ఇప్పుడు జరుగుతున్న మార్పులను గమనిస్తే.. మనం ఒక స్థాయిలో ఉంటే.. లక్ష్యం ఇంకో స్థాయిలో ఉంది. ఈ గ్యాప్‌ను పూడ్చాలంటే వైస్ చాన్సలర్లు కూడా ఆలోచించాలి. దీనిపై మరిన్ని సమాలోచనలకు నాలుగైదు యూనివర్సిటీలతో వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేయాలి. మెడికల్, ఇంజినీరింగ్‌తో పాటు ఇతర ఫ్యాకల్టీలు కూడా గ్రూపులుగా ఏర్పాటు చేసుకుని అత్యుత్తమ పాఠ్య ప్రణాళిక, అత్యుత్తమ బోధనా పద్ధతులను ఖరారు చేయాలి.
- మంత్రి బొత్స, సీఎస్ జవహర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐలో మనమే లీడర్లుగా ఉండాలి

- ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులను అనేక రంగాల్లో లీడర్లుగా చూడాలనుకుంటున్నాం. అందుకు తగ్గట్టుగా మనం చదువులు అందిస్తున్నామో లేదో ఆలోచించాలి. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విప్లవం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో మనం వెనుకబడితే కేవలం అనుసరించే వాళ్లుగానే మిగిలిపోతాం. ఏఐ అభివృద్ధి చెందేకొద్దీ.. దానిని వినియోగించుకుని, సామర్థ్యాన్ని పెంచుకునే వర్గం ఒకటైతే.. ఏఐని క్రియేట్ చేసే వర్గం మరొకటి తయారవుతుంది.
- టెక్నాలజీ పరంగా తొలి రివల్యూషన్ 1784లో స్టీమ్‌తో నడిచే రైలు ఇంజన్ ద్వారా చూశాం. ఆ తర్వాత 100 ఏళ్లకు విద్యుత్, 1960–70ల్లో కంప్యూటర్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రూపంలో మరో రెండు విప్లవాలు అత్యంత మార్పును తీసుకొచ్చాయి. ఈ మూడింటిలోనూ మనం వెనుకబడ్డాం. ఏదీ క్రియేట్ చేసే పరిస్థితుల్లో లేం. అందుకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మనం క్రియేటర్లుగా మారాలి. ఈ రంగంలో మనమే లీడర్లుగా ఉండాలి. అందుకోసం ఆ దిశగా అడుగులు వేగంగా వేయాలి.

తెలంగాణ

చంద్రయాన్ మన సత్తాకు నిదర్శనం

సాక్షి, హైదరాబాద్: జాబిలిపై నీటి ఆనవాళ్లను గుర్తించిన చంద్రయాన్, కోవిడ్ టీకాలే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతీయులు సాధించిన సత్తాకు నిదర్శనమని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ స్పష్టం చేశారు. శ్రీహరికోట నుంచి శుక్రవారం నింగికి ఎగరనున్న చంద్రయాన్–3 కూడా పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుందని ఆయన అన్నారు. గురువారం ఇండియా అలయన్స్ 11వ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ, అనేక అంశాల్లో అభివృద్ధి చెందిన దేశాలు కూడా భారతీయ భాగస్వామ్యాన్ని కాంక్షిస్తున్నాయని అన్నారు. వెల్‌కమ్ ట్రస్ట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీలతో కూడిన ఇండియా అలయన్స్ భారతీయ పరిశోధకులు వృత్తిపరంగా ఎదిగేందుకు, మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. బయోమెడికల్ రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యమిస్తున్న ఇండియా అలయన్స్ కారణంగా దేశం అంతర్జాతీయ స్థాయిలో ప్రభావం చూపే స్థితికి చేరిందని, 15 ఏళ్ల ఈ భాగస్వామ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 48 నగరాల్లో 589 మంది పరిశోధకులకు, 137 సంస్థలకు వేర్వేరు పరిశోధనలకు నిధులు లభించాయని వివరించారు. వైద్యులు కూడా పరిశోధనలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్న వాస్తవం కోవిడ్ కాలంలో బయటపడిందని ఈ అంశంలోని లోటుపాట్లను సరిచేసేందుకు ఇండియా అలయన్స్ ఉపయోగపడిందని తెలిపారు. కార్యక్రమంలో వెల్‌కమ్ ట్రస్ట్ తాత్కాలిక సీఈవో పాల్ షేరర్, ఇండియా అలయన్స్ తాత్కాలిక సీఈవో డాక్టర్ దెబాశీష్ మిత్ర, అలయన్స్ ట్రస్టీ డాక్టర్ అల్కా శర్మ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ కార్యదర్శి డాక్టర్ రాజేశ్ గోఖలే తదితరులు పాల్గొన్నారు.

తుపాకీ పేల్చి.. కత్తులతో చిందేసి..


- పెళ్లి విందులో ఆయుధాలతో డ్యాన్స్
- పోలీసుల అదుపులో నిందితులు

మద్నూర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఓ పెళ్లి విందులో కొందరు యువకులు కత్తులు పట్టుకొని.. తుపాకి పేల్చి నృత్యం చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలివి. మద్నూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈనెల తొమ్మిదో తేదీన పెళ్లి విందు నిర్వహించారు. కార్యక్రమంలో కొందరు యువకులు కత్తులు ప్రదర్శిస్తూ, తుపాకి పేలుస్తూ నృత్యం చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో స్థానికులు గురువారం ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. మద్నూర్‌కు చెందిన అబ్బుమియా, అర్బాజ్, పెద్ద టాక్లీ గ్రామానికి చెందిన సోయల్ జమీల్, మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన ఉస్మాన్ ఆయుధాలతో విందులో పాల్గొన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. సోయల్ జమీల్, అబ్బుమియాలను అదుపులోకి తీసుకున్నామని మద్నూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. అర్బాజ్, ఉస్మాన్‌ల కోసం గాలిస్తున్నామని, త్వరలో వారిని కూడా పట్టుకుని పూర్తి విచారణ చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రానికి ఏటా రూ.13 వేల కోట్ల పెట్టుబడులు

- మంత్రులు బుగ్గన, గుడివాడ

పెనుకొండ రూరల్/గోరంట్ల: వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రానికి ఏటా రూ.13 వేల కోట్ల చొప్పున పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని ఎర్రమంచి వద్ద ఏర్పాటైన ‘కియా’ కార్ల పరిశ్రమలో 10 లక్షల కార్లు ఉత్పత్తి చేసిన సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన కియా ఇండియా నాలుగేళ్లలోనే 10 లక్షల కార్లు ఉత్పత్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమ ద్వారా దాదాపుగా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించగా.. అందులో 85 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కాయన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, వాణిజ్య, జౌళి, చేనేత శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో ‘కియా’ ఇండియా 47 నెలల కాలంలోనే 10 లక్షల కార్లను ఉత్పత్తి చేయడం అభినందనీయమన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కారిడార్‌కు నీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు రూ.400 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శంకర నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, కియా ఇండియా ఎండీ, సీఈవో టెజిన్ పార్క్ తదితరులు పాల్గొన్నారు.



The new Seltos is here to take you on an exhilarating drive experience. With an unstoppable attitude, the redesigned Seltos is the new benchmark of badass traits – distinctive design language, connected technology, premium cabin space, and a powerful driving experience. Rediscover the new Seltos that is here to awaken the badass in you.

Technology. Reborn.

Badass 2.0 redefines the segment, yet again

Dual Screen Panoramic Display



26.03 cm (10.25") HD Touchscreen Navigation + Full Digital Cluster with 26.04 cm (10.25") Color LCD MID give you an immersive and futuristic drive experience.

Most Powerful Turbo Petrol Engine



with 160 ps power, enjoy best-in-class superior performance and fuel efficiency.

Intelligent Dual Zone Fully Automatic Air Conditioner



ensures a comfortable drive for both, the driver and the co-driver.

Voice Activated Dual Pane Panoramic Sunroof



gives you a mesmerising view of the world above.

BOSE Premium Sound System with 8 Speakers



lets you enjoy an elevated audio experience.

Kia Connect# Skill with Amazon Alexa



lets you control your Kia from the comfort of your home.

Safety. Reborn.

Badass 2.0 with 17 Autonomous ADAS Level 2 Features* + Robust 15 Standard Safety Features across variants

Smart Cruise Control with Stop and Go lets you set and maintain any cruising speed for an effortless drive.

Lane Keep Assist and Departure Warning proactively supports in keeping the car within its lane.

Front Collision Warning and Avoidance Assist scans the road ahead to detect and warn you of any impending collision.

Blind Spot Collision Warning looks out for hard-to-spot traffic at the rear of the vehicle.

Leading Vehicle Departure Alert detects and alerts when the vehicle in front begins to move.

Safe Exit Warning alerts in case of an approaching object to ensure you safely exit from the car.

K-Code Break the queue like a Badass. Ensure the early delivery of the new Seltos with K-Code!

- Kia Seltos owners can generate the K-Code for priority delivery
- K-Code can be generated via **www.kia.com** or on the **MyKia App** by entering a few details
- One K-Code can be used only once for booking the new Seltos
- K-Code can be used while booking the new Seltos only today till 11:59 PM

Normal bookings also available without K-Code program at kia.com and all Kia Dealerships.

Kia Service

Connected - Adaptive - Responsive - Engage

3 Years Unlimited kms Warranty	Extended Warranty up to 5 Years	My Convenience Plus Comprehensive Maintenance Package	Scratch Care Program^	IoT Based Smart Services##	24x7 | 3 Years Nationwide RSA**

Movement that inspires

Pre-book now Call 1800 108 5000 | Visit www.kia.com/in | Kia Seltos | Look for "Kia India" @

Scan to know more

FOR INFORMATION CONTACT: BENGALURU: ADVAITH KIA, LALBAGH MAIN ROAD, PH: 9611006006, EPITOME KIA, WHITEFIELD: PH: 9606970216, YELAHANKA, PH: 7406343339, JSP KIA, HOSUR ROAD, PH: 9606011244, JSP KIA, BELLANDUR, PH: 9071077717, NAARA KIA, J.P NAGAR, PH: 7406528200, PPS KIA, MYSORE ROAD, PH: 6309990010, TAAPASI KIA, KALYAN NAGAR, PH: 8095537777, VST KIA, PALACE ROAD, PH: 9606988123, VST KIA, YESHWANTHPUR, PH: 9606988124, BELGAUM: MIRACULUM KIA, PH: 08312439111, BELLARY: ATHENA KIA, PH: 6364922832, BIJAPUR: KUMAR KIA, PH: 080 45849192, DAVANGERE: JANSI KIA, PH: 9538018155, GULBARGA: KUMAR KIA, PH: 080 45849191, HASSAN: AADARSH KIA, PH: 9606034050, HOSPET: BHADRA KIA, PH: 7760888885, HUBLI: NAGSHANTI KIA, PH: 9148432469, KUSHALNAGAR: ARM KIA, PH: 9606055314, KOLAR: EPITOME KIA, PH: 8951903224, MANGALORE: ARM KIA, PH: 9606013152, MANDYA: AADARSH KIA, PH: 9606034070, MYSORE: AADARSH KIA, PH: 9606034060, SHIMOGA: JANSI KIA, PH: 9538416666, TUMKUR: PPS KIA, PH: 6303622210, UDUPI: ARM KIA, PH: 9606055296

INNOCEAN-049/23

అనంత కరుణామయుడు (అల్లాహ్‌)! ఆయన, భూమిని సకల జీవరాసుల కొరకు ఉంచాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 14 జూలై 2023

అంతరిక్షంలోకి... ఆశలయానం

అంతరిక్ష శోధనలో పెను ముందంజకు భారత్ సర్వసన్నద్ధమవుతోంది. ప్రపంచాళికి ప్రత్యేక ఆకర్షణున్న జాబిల్లికి సంబంధించి ఇతఃపూర్వం బయటపడని రహస్యాలను అందరితో పంచుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది. శుక్రవారం శ్రీహరికోట నుంచి చంద్రుని వైపు రివ్వున నింగిలోకి ఎగసే ఉపగ్రహ వాహక నౌకతో ముచ్చటగా మూడోసారి మన చందమామ యాత్ర సాగనుంది. గత యాత్రలకు భిన్నంగా, చంద్రుని అధ్యయనంతో పాటు, ఇతరగ్రహాలపై జీవాన్ని కనుగొనడంలోనూ సాయపడుతుందని ఆశిస్తున్న ప్రయోగమిది. మునుపు ఏ దేశమూ చేయనిరీతిలో క్లిష్టమైన చంద్రమండల దక్షిణ ధ్రువం వద్ద చందమామతో చెట్టాపట్టాలకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేస్తున్న శాస్త్ర విజ్ఞాన సాహసమిది. కోట్లాది భారతీయులే కాక, ప్రపంచమంతా ఆసక్తిగా పరికిస్తున్నది అందుకే!

దాదాపు 600 కోట్ల రూపాయల వ్యయమయ్యే ఈ తాజా యాత్రకు ముందు రెండుసార్లు భారత్ చంద్రమండల గవేషణ సాగించింది. 2008 అక్టోబర్ నాటి చంద్రయాన్–1లో భాగంగా ప్రయోగించిన 35 కిలోల 'మూన్ ఇంప్యాక్ట్ ప్రోబ్' (ఎంఐపీ) చంద్రుని కక్ష్యలో ప్రవేశించి, పరిశోధనలు సాగించి చంద్రుని ఉపరితలంపై నీటి జాడను కనుగొంది. ఇక, చంద్రుని ఉపరితలంపై దిగి, అన్వేషణ జరిపేందుకు ఉద్దేశించిన 2019 సెప్టెంబర్ నాటి చంద్రయాన్–2 పాక్షికంగానే విజయవంతమైంది. ఎనిమిది పరికరాలతో కూడిన ల్యూనార్ ఆర్బిటర్‌ను విజయవంతంగా చంద్ర కక్ష్యలోకి పంపగలిగాం కానీ, జాబిల్లిపై దిగే రోవర్ ('ప్రజ్ఞాన్')ను మోసుకుపోతున్న ల్యాండర్ ('విక్రమ్') మాత్రం తుదిక్షణాల్లో కుప్పకూలి, ప్రయోగం పూర్తి సఫలం కాలేదు. మామూలు భాషలో చెప్పాలంటే, మార్గనిర్దేశక సాఫ్ట్‌వేర్‌లో లోపంతో ఆ క్రాష్ ల్యాండింగ్ జరిగిందట. ఇప్పుడు మళ్ళీ చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ జరిగేలా రెండోసారి చేస్తున్న ప్రయత్నమే... ఈ చంద్రయాన్–3.

అంతా సవ్యంగా సాగితే, ప్రయోగించిన దాదాపు నెల తర్వాత చంద్రయాన్–3 చంద్రుని కక్ష్యలోకి చేరుతుంది. దానిలోని ల్యాండర్, రోవర్‌లు ఆగస్ట్ 23న చంద్రునిపై కాలూనతాయి. 'చంద్రయాన్–2'లో తగిలిన దెబ్బల రీత్యా... ఎదురయ్యే ఇబ్బందులు, ఎదుర్కొనే మార్గాలతో 'వైఫల్యం – సురక్షిత పరిష్కార' విధానంలో దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దారు. ఈసారి చంద్రుని దక్షిణ ధ్రువానికి దగ్గరలో 70 డిగ్రీల వద్దే ఉపగ్రహాన్ని దింపనున్నారు. అయితే, గతం నేర్పిన పాఠంతో కచ్చితంగా నిర్ణీత స్థలంలో అని కాక, 4 కి.మీ. × 2.4 కి.మీ.ల వైశాల్యంలో ఎక్కడైనా సురక్షితంగా దిగేలా సూచనలిచ్చారు. అవసరమైతే సుదూరం ప్రయాణించి, ప్రత్యామ్నాయ స్థలంలో దిగేలా ల్యాండర్‌లో మరింత ఇంధనం చేర్చారు. ల్యాండర్ స్వయంగా తీసే చిత్రాలకు తోడు మునుపటి చంద్రయాన్–2 ఆర్బిటర్ తీసిన చిత్రాలను సైతం దానికి అందుబాటులో ఉంచారు. తద్వారా సరైన ప్రాంతానికి చేరినదీ, లేనిదీ నిర్ధరించుకొనేలా ఏర్పాటు చేశారు. అధిక వేగంలోనూ దిగేలా ల్యాండర్ కాళ్ళను ఈసారి దృఢంగా తీర్చిదిద్దారు. అదనపు సౌర ఫలకాల్ని ల్యాండర్‌కు అమర్చారు.

అసలు చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేయడమనేదే సంక్లిష్ట ప్రక్రియ. వైఫల్యాలూ సహజమే. సఫలమైన ఘనత అమెరికా, రష్యా, చైనాలదే. వాటి సరసన నిలవడమే గొప్పయితే, ఇప్పటి దాకా ఎవరూ వెళ్ళని, కనీసం వెలుగైనా తాకని ధ్రువప్రాంతంలో తొలిసారి దిగి, అక్కడి పరిస్థితుల్ని శోధించాలన్న భారత ప్రయత్నం నిస్సందేహంగా అపూర్వమే. చంద్రునిపైకి ఉపగ్రహాన్ని పంపి, అమెరికా, రష్యా, చైనాల సరసన నిలవాలని పలుదేశాలు గతంలో ప్రయత్నించాయి. 2019లో మనమే కాక ఇజ్రాయెల్ చేసిన ప్రయోగమూ విఫలమైంది. 2022లో వ్యోమనౌకతో ల్యాండర్ – రోవర్‌ను పంపాలని ప్రయత్నించిన జపాన్, అలాగే రోవర్‌ను పంపజూసిన యూఏఈ సైతం చతికిలబడ్డాయి.

సఫలమైన దేశాలన్నీ ఉష్ణోగ్రత, ఉపరితలం రీత్యా సురక్షితమూ, సులభమైన చంద్రమండల భూమధ్యరేఖ వద్ద ఉపగ్రహాన్ని దింపాయి. లోయలు, అగ్నిబిలాలు లేకుండా సౌరశక్తికి పుష్కలమైన సూర్యరశ్మి ఉండే ఆ ప్రాంతంలో పరికరాలు దీర్ఘకాలం పనిచేస్తాయి. కానీ, చంద్రయాన్–3 చేరదలిచిన ధ్రువప్రాంతం మైనస్ 230 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయే క్లిష్టమైన అసూర్యంపశ్య. సెంటీమీటర్ల మొదలు వేల కిలోమీటర్ల పరిమాణంలో బిలాలు ఉంటాయి. తాజా ప్రయోగం సఫలమైతే, తొట్టతొలిగా అలాంటి దక్షిణ ధ్రువం వద్ద దిగిన మిషన్‌గా చంద్రయాన్–3 మన దేశానికి ఘనకీర్తి కట్టబెడుతుంది. చంద్రమండల రహస్యాల శోధన, ఛేదనలో మన జెండా రెపరెపలాడుతుంది. వలస పాలన నుంచి బయటపడ్డ అనేక దేశాలతో పోలిస్తే మనం అనూహ్యపురోగతి సాధించినట్టవుతుంది.

జాబిల్లిపై ధ్రువాల వద్ద గడ్డకట్టిన చలిలో చిక్కిన శిలలు, మట్టి కాలగతికి దూరంగా స్తంభించిన ఆదికాలపు సౌరవ్యవస్థ తాలూకు ఆచూకీని పట్టివ్వగలవు. అలా విశ్వరహఃపేటిక తెరుచుకుంటుంది. భూమి నుంచి చంద్రునితో పాటు, చంద్రుడి నుంచి దివినీ, భువినీ చూసేందుకు కొత్త లోచూపు కలుగుతుంది. సోదర గ్రహాన్ని జయించామని మనిషి సంబరపడిన ప్రతిసారీ సృష్టి విసిరే సరికొత్త సవాళ్ళకు సిద్ధమవడానికి ఉత్సాహం పొంగుతుంది. చంద్రునిపై శాశ్వత స్థావరాలు నెలకొల్పడం భౌగోళిక రాజకీయ పోరులో లక్ష్యమైన వేళ ఇది భారత్‌కు అతి పెద్ద సానుకూల అంశం. అనేక ప్రయోగాలతో విశ్వవేదికపై శాస్త్రీయంగా, రాజకీయంగా జాబిల్లికి ఆకర్షణ, ప్రాధాన్యం అధికమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన దేశం ముందు వరుసలో నిలుస్తుంది. ఇన్ని ఉద్విగ్నభరిత కోణాలున్న ఈ అంతరిక్ష యానంలో చివరకు 'అందెను నేడే అందని జాబిల్లి' అని భారత్ విజయగీతికలు ఆలపించాలని ఆకాంక్ష. అస్తు! అందుకై అహరహం శ్రమిస్తున్న మన శాస్త్రవేత్తల సమూహానికి విజయోస్తు!

పాలనను గడప దగ్గరకు తెచ్చే సారథులు

ఆంధ్రప్రదేశ్ దేశానికి అందించిన అద్భుతమైన వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ. ఇప్పటివరకు అభివృద్ధి పథకాలను ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయే కానీ వాటిని ప్రజల దగ్గరకు చేర్చడంలో పూర్తిగా సఫలం కాలేకపోయాయి. దీంతో అనేకసార్లు పథకాలు విఫలమవడమో, నిధులు మురిగిపోవడమో జరిగేది. దీంతో ప్రజలు అసంతృప్తికి గురయ్యేవారు. ఈ లోపాన్ని గ్రహించిన ప్రస్తుత ఏపీ ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ వాలంటీర్లు ఆత్మబంధువులయ్యారు. ప్రభుత్వ పథకాలు ఇంటి గడప దగ్గరకు రావడంలో వీరు ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్య అనుసంధాన కర్తలయ్యారు. ఇవాళ వాలంటీర్లు ప్రభుత్వానికే కాక జనానికీ కళ్లూ చెవులు!

అభిప్రాయం

ఆదర్శం వాస్తవమైన వేళ...


ప్రొ॥ బి. లలితానంద ప్రసాద్

'వృత్తి నైపుణ్యానికి వ్యక్తిత్వ వికాసం' పేరుతో గతంలో అనేక మండలాల్లో అధ్యాపకులకు (ప్రాథమిక, ఉన్నత పాఠశాలల) రిసోర్స్ పర్సన్‌గా వేసవి శిక్షణ ఇచ్చిన అనుభవం ఉండటంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఓ మండల అభివృద్ధి అధికారి... అక్కడి విద్యాశాఖాధికారి సలహా మేర అప్పటి కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్లకు శిక్షణ ఇచ్చే అవకాశం ఈ వ్యాస రచయితకు కల్పించారు. ఆ శిక్షణా తరగతుల్లో దాదాపు వెయ్యి మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

అప్పుడా సందర్భంగా వారితో ప్రసంగ సంభాషణల్లో ప్రస్తావించిన అనేక అంశాలు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వాస్తవరూపం దాల్చటం, అటు లబ్ధిదారులు, ఇటు వాలంటీర్ల నోటిద్వారా వింటూ, చూస్తూ ఉంటే ఎంతో ఆనందం సంతృప్తి కలుగుతోంది. అప్పటి ఆరంభ దశలోని మహోన్నత ఆశయాలు, ఆదర్శాలు ఈ అనతి కాలంలోనే వాలంటీర్ వ్యవస్థ వల్ల ఆచరణ రూపం దాల్చాయి. తమ దైనందిన సమస్యల నుండి వాలంటీర్ల సేవ ద్వారా విముక్తులు అయినవారు వాలంటీర్లను ప్రశంసించడం ఎంతైనా ముదావహం. అందునా కోవిడ్–19 లాంటి విపత్కర సమయాలలో ఆ యా వాలంటీర్ల అనుపమాన సేవలు సమాజానికి ఎంత అవసరం ఉందో వీటి పట్ల అవగాహన ఉన్న అందరికీ తెలియ వచ్చింది.

అప్పటి వారికి ఉద్బోధించిన వాటిలో ముఖ్యమైనవాటిలో కొన్ని... ఈ నూతన వ్యవస్థ ద్వారా వారు తమకు కేటాయించిన యాభై కుటుంబాలలో అంతర్భాగమై, ఆయా కుటుంబ సభ్యుల వయసు/ వృత్తి/ స్వభావం లాంటి వాటితో నిమిత్తం లేకుండా వారితో ఎంతగా మమేకం అవ్వాలనేదీ; అది వారి వృత్తినీ, వ్యక్తిత్వాన్నీ ఎంతగా పరిపూర్ణం చేసేదీ చెప్పాను. ఈ ఆత్మీయతా భావం వారికి పుట్టుకతో ఏర్పడే బంధుత్వాలకన్నా వయసు రీత్యా ఏర్పడే అతి కొద్దిమంది స్నేహితులు కన్నా మించి లభించిన అరుదైన అపురూప అవకాశముగా భావించాల్సిందిగా ప్రస్ఫుటం చేశాను. వారి పట్ల ప్రేమతో చేసే సేవ అన్నిటికన్నా మహోన్నతమైనదిగా వివరించాను. తమ విద్యుక్త ధర్మం సక్రమంగా నెరవేర్చడానికీ, సేవా నిరతిని దృఢ సంకల్పంతో ప్రదర్శించటానికీ, ప్రకటించడానికీ అవసరమైన శారీరక మానసిక ఆరోగ్యం ఎంతటి అత్యవసరమో, అలాగే బాధ్యత విషయంలో భావప్రకటనా సామర్థ్యం, సంబంధిత అంశాల/పథకాల పట్ల విషయ పరిజ్ఞానం, కాల వినియోగం పట్ల చక్కటి ప్రణాళిక –ఆచరణ, అందరితో ఎల్లప్పుడూ సత్సంబంధాలూ, అలాగే ఏ విధంగా ప్రభుత్వ పథకాలన్నీ నిజమైన అర్హులకు చేర్చాల్సినదీ, అందుకు కావాల్సిన ఓర్పు, సహనం, కారుణ్యం లాంటి మానవీయ లక్షణాలు ఎంత ముఖ్యమో వివరించాను.



కుల, మత రాజకీయాలకు అతీతంగా, కోట్లాది మంది తమ గడప దగ్గరే తమకు కావలసినవి తగిన సమయంలో తగిన రీతిలో ఇప్పటిలాగే నిరంతరం పొందాలంటే ఈ వ్యవస్థ ఉండాల్సిందే. అందరూ కోరుకునేది ఇదే.

వ్యవస్థలో లోటుపాట్లు ఉంటే తప్పనిసరిగా సరిదిద్దవలసిందే. అలాకాక మొత్తంగా వాలంటీర్లను కాదనటం అంటే వారి సేవల వల్ల కలిగే ప్రయోజనాలను కాదని అనడమే. ఏమాత్రం వివేకం, విజ్ఞత ఉన్న మనుషులు చేయదగిన పని ఇది కాదు.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్, । 9247499715 ।

అభిప్రాయం

అభివృద్ధికి రాళ్లెత్తే కూలీలు


ప్రొ॥ గుజ్జర్లమూడి కృపాచారి

దేశంలో అనేక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందంటే పరిపాలన పారదర్శకంగా ఉందని అర్థం. ముఖ్యంగా వాలంటీర్ వ్యవస్థ పరిపాలన వికాస పరిణామంలో సరికొత్త ప్రయోగం. దీనివల్ల ప్రభుత్వ పాలనా వ్యవస్థతో ప్రతి కుటుంబం అనుసంధానం అవుతోంది. ఇది కళ్లకు కనిపిస్తున్న బహిరంగ సత్యం. గ్రామ వాలంటీర్ వ్యవస్థ గాంధీజీ 150వ జయంతిని పురస్కరించుకుని 2019 అక్టోబరు 2న ప్రారంభమయింది. రాష్ట్రవ్యాప్తంగా 2.8 లక్షలమంది వాలంటీర్లు ప్రజాసంక్షేమం కోసం, సమసమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్నారు. కరోనా మహమ్మారి విజృంభించి విలయతాండవం చేస్తున్న రోజుల్లో వాలంటీర్లు ప్రాణాలకు సైతం తెగించి జనాన్ని కాపాడిన దేవతామూర్తులు. ఆంధ్రప్రదేశ్‌లోని వాలంటీర్ల వ్యవస్థపై మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు అధ్యయనం చేశాయి. వాలంటీర్లు ప్రభుత్వానికీ, సమాజానికీ సేతువులుగా ఉన్నారని పేర్కొంటూ తమ తమ రాష్ట్రాల్లోనూ ఈ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధంచేస్తున్నాయి. ఇదే వ్యవస్థపై అనేక సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి. స్థూలంగా వాలంటీర్లు ఏం చేస్తున్నారో ఒకసారి పరికిద్దాం:

1. పేద, బడుగు వర్గాల సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి తెలియజేసి తగు సహాయం అందించే ఏర్పాటు. 2. గత కాలంలో ఏ సహాయం అందలేదని నిస్సహాయంగా, నిరుత్సాహంగా ఉన్నవారిని గుర్తించి తగు సహాయం అందించే ఏర్పాటు చేయడానికి కృషిచేయడం. 3. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు, సమర్థవంతంగా, నిక్కచ్చిగా అవసరమైన వారికి చేర్చడం. 4. విద్యార్థి సమాజం నుంచి వృద్ధజన గణం వరకు ప్రభుత్వం అందించే పలు పథకాలు అందుబాటులోకి తెచ్చి ప్రయోజనం కల్పించటం. 5. ప్రజాపాలనలో ప్రజలకు చేరువయ్యే పథకాలు అతి త్వరగా... అంటే మూడు రోజుల్లోనే ప్రజలకు లబ్ధి చేకూర్చడం. 6. ప్రతి వాలంటీర్ కేవలం 50 కుటుంబాలను పర్యవేక్షిస్తున్నందున అతి సూక్ష్మ సమస్య కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకు పోగలగడం. 7. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం తదితర కార్యక్రమాలను పర్యవేక్షించి పరిష్కరించడం. 8. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు, 104 సేవలు అందడంలో సహకరించడం; ప్రమాద సమయాల్లో అగ్నిమాపక సిబ్బందికీ, ఎన్డీఆర్‌ఎఫ్ సహాయ బృందాలకూ సహకరించడం. 9. ఓటరు కార్డు, రేషను కార్డు, ఆధార్, బ్యాంక్ ఖాతా, వివిధ రకాల పింఛను కార్డులు, అర్జీలు సమర్పించడానికి ప్రజలకు సహకరించడం. 10. విపత్కర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు తరలించే సమయంలో ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయటం. 11. నిరాశా, నిస్పృహల్లో ఉన్న బడుగు, బలహీనవర్గాల ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం. ఇటువంటి పనులతో ప్రజలకు వాలంటీర్లు బాగా దగ్గరయ్యారు. వీరిసేవలను ప్రతిఒక్కరూ ప్రత్యక్షంగా అనుభవిస్తున్నవారే. అన్నిటా సగం కోరుకునే మహిళలు, వాలంటీర్ వ్యవస్థలో సగానికి పైగానే ఉన్నారు. సమ సమాజ పురోభివృద్ధికి రాళ్లెత్తుతున్న వాలంటీర్లు మన తోబుట్టువుల్లాంటివారు. వారిని గౌరవించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడమే.

వ్యాసకర్త విశ్రాంతా చార్యులు
మొబైల్: 9848123655

'చిలకల ఆంజనేయదాసు' గుర్తుకొస్తున్నాడు!

అభిప్రాయం


సామాన్య



'సోదర సోదరీమణులారా, బంధు మిత్రులారా, ఆర్యులారా, నా భార్యలారా, నేను చిలకల దాసుని, సూర్యబింబానికి చినబాబు కొడుకుని, చంద్రబింబానికి చిట్టి మేనల్లుణ్ణి! హిందీ హీరోలకి తెలుగు తమ్ముణ్ణి! నేను కట్నం పుచ్చుకోకుండా పెళ్లి చేసుకోబోతున్నాను! పిల్ల ఎలాగా ఉంటుందంటే: గాజు బొమ్మ, గులాబీ పువ్వు, గంధపుగిన్నె –అదీ పిల్ల! ... ఓ బతికి చెడ్డ ఆడపిల్లని కాణీ కట్నం లేకుండా నా భార్యగా స్వీకరించి బాగు చేస్తున్నాను. కొట్టండి జయ్ కొట్టండి చిలకల ఆంజనేయదాసు గారికి చీర్స్ చెప్పండి!' రావిశాస్త్రి గారి, 'వియత్నాం విమల వృత్తాంతం' లో చిలకల దాసు పై విధంగా తనకి తాను చెప్పుకొని గొప్పలు పడిపోతాడు. నాకు ఎందుకో పవన్ కల్యాణ్ గ్రామ వాలంటీర్ల మీద చేసిన ఇటీవలి వ్యాఖ్యలు విన్న తర్వాత చిలకల దాసు చాలా జ్ఞాపకం వస్తున్నారు. ఈ చిలకలదాసు గురించి రావిశాస్త్రి ఇంకా ఏమంటాడంటే 'కడసారి కొడుకు కాబట్టి అతనికి తన తండ్రి తాలూకు పేదరికపు తొలిరోజుల సంగతి తెలియదు. తన తండ్రి పడ్డ కష్టాల గురించి కాని, వాటిలోంచి బయటపడాలనే తన తండ్రి పట్టుదల గురించికాని, అతని దీక్షా ధైర్యాల గురించి కాని అతనికి తెలియదు. అలాగే అతనికి తన అన్న పితృభక్తి గురించి కూడా తెలియదు. అతనికి జీవితం సరిగా తెలియదు; అతను తెలుగు సినిమాల మీద పెరిగేడు.'

పేదరిక నిర్మూలనకు, ప్రజల జీవన ప్రమాణాలలో పెరుగుదలకు ప్రభుత్వాలు చాల సంవత్సరాలుగా ప్రజా ధనాన్ని వెచ్చిస్తున్నప్పటికీ ప్రజాసేవలు ప్రజలకు చేరువ కాలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొని వచ్చిన వాలంటీర్ల వ్యవస్థ ప్రజా సేవలను పంపిణీని మెరుగుపరిచే ఒక సృజనాత్మక ప్రయత్నం. వరల్డ్ బ్యాంకునుంచి యునైటెడ్ నేషన్స్ వరకు అన్ని సంస్థలూ, మేధావులూ ఏకగ్రీవంగా చెప్పే విషయం ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగు పరచాలంటే ముందుగా 'ఇనిస్టిట్యూషనల్ కెపాసిటీ'ని పెంచాలని. ఈ గ్రామ వాలంటీర్ల వ్యవస్థ మన 'ఇనిస్టిట్యూషనల్ కెపాసిటీ'ని పెంచడానికి చేసిన ఒక గొప్ప ప్రయత్నం. అంతే కాకుండా ఇంత మంది యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. వీరిని 'ట్రాఫికింగ్' వంటి దుర్మార్గమైన పనులతో ముడిపెట్టడానికి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అమానుషమైనవి.

'ఆ వేళ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటయింది. ఆ రోజున రెండెడ్ల బండి ఒకటి బాగా ముస్తాబయి బాజాలతో సహా బయల్దేరి ఊరంతటా కరపత్రాలు వెదజల్లింది. కోహినూర్ థియేటర్ కి మియాంగాడు ఆ సాయంత్రం వస్తున్నట్టూ (పట్టణ పౌరులు మాస్టర్ విఠల్‌కి పెట్టుకొన్న ముద్దుపేరు –'మియాంగాడు'). 'వస్తున్నాడు మీ మియాం !!!'. మదన కళలో మీ ప్రేమాభిమానాలని చూరగొన్న మీ ముద్దుల హీరో మాస్టర్ విఠల్ –ఈ రోజున మళ్ళీ వస్తున్నాడు. రండి త్వరపడండి!! వచ్చేస్తున్నాడు మీ మియాం! మియాం! మియాం!! మియాం!!!' 'రావి శాస్త్రి 'ఆరు చిత్రాలు'లో పై విధంగా ఉంటుంది ఒక పాత్ర. పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రంలో మెజారిటీ ప్రజలకి 'మియాంగాడు' అయినప్పటికీ ఆయన మీటింగులకి వచ్చే అభం శుభం తెలియని పసిపిల్లల గురించి కలవరంతో చెప్పాల్సి వచ్చింది. తనకి అర్థం చేసుకొనే స్థాయి లేనటువంటి ట్రాఫికింగ్ వంటి సంక్లిష్ట సమస్యల గురించి అసత్య ఆరోపణలు చేసి తెలుగు సినిమాల మీదే పెరుగుతున్న పసిబిడ్డల మనసు కలుషితం చేస్తే ఎలా?

వ్యాసకర్త రచయిత్రి, అనువాదకురాలు

సారాంశం
సరికొండ చలపతి

రేటు చూస్తే.. రైతుకే నో'టమాట' రాదు!

రండి..అట్లా మార్కెట్‌కు వెళ్లొద్దాం..
ఆసక్తికర సన్నివేశాలు కనిపిస్తాయి..

ఓ చోట పుచ్చకాయలు అమ్ముతున్నారు. అవి అమ్మే పిల్లాడికి నిండా 15 ఏళ్లు కూడా ఉండవు. '' కాస్త మంచి కాయ ఇవ్వుబాబూ.. '' అని కస్టమర్ అడిగితే ఓ రెండు మూడు జాగ్రత్తగా కొట్టి చూసి నాలుగో కాయ కస్టమర్‌కు ఇస్తున్నాడు. వాళ్లూ మంచి పుచ్చకాయ ఇచ్చాడన్న ఆనందంతో తీసుకెళుతున్నారు. ఇదంతా చాలా సేపటి నుంచి గమనిస్తున్న అతని స్నేహితుడు.. '' అరేయ్ .. మంచి పుచ్చకాయ ఎలారా కనిపెట్టడం ..'' అని ఆసక్తిగా అడిగాడు.

'' ఏమో నాకేం తెలుసు.. మా నాన్న మూడు కాయలు కొట్టి చూసి నాలుగో కాయను కస్టమర్‌కు ఇమ్మన్నాడు.. నేను అదే చేస్తున్నాను అంతే..'' అన్నాడు **– ఇదీ మార్కెట్ టెక్నిక్..**

...

...ఒక పెద్దావిడ చిన్న కూరగాయల దుకాణం నడుపుతోంది. ఏదో బతుకుదెరువుకు ఉపయోగపడుతోంది. కొద్దిరోజులకు ఆ షాప్ ఎదురుగా పెద్ద మార్ట్ వచ్చింది. దానిలో కూరగాయలు కూడా అమ్ముతున్నారు. దానికి దగ్గర్లోనే మరికొన్ని కూరగాయల షాప్‌లు ఆ దెబ్బకు మూతబడ్డాయి. ఆ మార్ట్‌లో కూరగాయల ధరలు కాస్త తగ్గించి.. వాటి రేట్లు కూడా డిస్‌ప్లే చేస్తున్నారు. ఓ రోజు టమాటా కేజీ 100 రూపాయలే అని పెట్టారు, అది చూసి మన పెద్దావిడ టమాటా 95 రూపాయలే.. అని బోర్డు పెట్టింది. దానితో మార్టు వాళ్లు 90 రూపాయలు చేశారు. అలా వారి మధ్య ప్రైస్ వార్ మొదలయింది. తెల్లారి ఈ పెద్దావిడ కేజీ 85 రూపాయలే.. అని బోర్డుపెట్టింది. దానితో మార్ట్ వాళ్లూ తగ్గించారు. దానితో మరింత తగ్గించడానికి మన కూరలమ్మ పూనుకుంటూంటే.. పక్క షాపతను..''ఎందుకమ్మా పెద్ద వారితో మనకుపోటీ.. మనం తట్టుకోగలమా..అంత తక్కువ రేటుకు అమ్మి పొట్టపోసుకోగలమా..' అని వారించాడు. ఆమె నవ్వి '' అసలు తక్కువ అమ్మి నష్టపోవడానికి నా దగ్గర టమాటాలు ఉంటే కదా...' అని ప్రైస్ బోర్డులో టమాటా రేటు పెట్టే పనిలో పడింది **– ఇదీ మార్కెట్ టెక్నికే...**

...

ఇది సోషల్ మీడియా లో కనిపించిన మార్కెట్ సన్నివేశం.. **కాసింత ఎమోషనల్ ..**

ఓ యువకుడు ఎప్పుడూ ఒక ముసలామె దగ్గర పళ్లు కొంటుంటాడు.

ఆ రోజు కూడా కొన్నాడు. ఆమెకు డబ్బులు ఇచ్చేశాడు. సంచి నుంచి ఒక పండు తీసి ఒలిచి ఒక తొన తిన్నాడు. అబ్బా! ఎంత పుల్లగా ఉందో ! ఈ పండు వద్దు . నువ్వే తిను 'అంటూ ఒలిచిన పండును ఆ ముసలామెకు ఇచ్చేశాడు. ఆమె మిగిలిన తొనలలో నుంచి ఓ తొన తీసి తిన్నది. 'అదేమిటి బాబూ, ఇంత తియ్యగా ఉంటేనూ..' అనగానే, ' నాకు వద్దు నువ్వే తిను 'అంటూ వచ్చేశాడు. అలా వస్తున్న ఆ యువకుడిని భార్య ఇలా అడిగింది..' అదేమిటండీ ! రోజూ ఆమె దగ్గరే కొంటారు. ఆమె తియ్యటివే ఇస్తోంది. అయినా రోజూ పుల్లగా ఉంది అని ఒక పండు వెనక్కి ఇచ్చేస్తారు. అదేం విడ్డూరం?' 'ఆమె అన్ని పళ్లను అమ్ముతుంది. కానీ ఒక్కపండూ ఎప్పుడూ తినదు. అందుకే మా అమ్మకే పెడుతున్నా అనుకుంటూ రోజూ ఏదో ఒక వంక పెట్టి ఒక పండు ఆమె తినేలా చేస్తున్నా ' అన్నాడా యువకుడు. భార్య అతన్ని అభినందనగా చూసింది.

–ఇక పళ్లమ్ముతున్న ఆమె దగ్గర సీన్ చూడండి.. అక్కడ పక్కనే పళ్లమ్మే ఓ యువతి పెద్దావిడను ఇలా అడిగింది..' ఏమిటమ్మా? రోజూ ఆయనకు ఎక్కువ పళ్లు తూస్తావూ? ఆయనేమో నీకు అందులోంచి ఒకటి తీసి ఒలిచి ఇస్తాడూ ! ఎందుకు అలా ఎక్కువ తూస్తావూ ?'.. అని ఆశ్చర్యపడింది.

''అతను నా మీద ప్రేమతో నేను పళ్లు తినాలి అని అలా చేస్తున్నాడు. ఆ విషయం నాకు తెలియదు అనుకుంటున్నాడు. అతడికి నా మీద ఉన్న ప్రేమ వలన ఆ తక్కెడ అలా ఎక్కువ తూగుతుంది, అంతే కానీ నేను తూచడం లేదు''
అంది ఆ పెద్దావిడ.

.. ఇక్కడ టెక్నిక్ ఏమీ లేదు.. పళ్లతో పాటు తాజాగా ఉంది మానవ సంబంధాలే.

...

ఇలా అన్ని మార్కెట్లలో కాసిని మానవ సంబంధాలు.. తమ పంటను అమ్ముకునే టెక్నిక్ తెలిసిన రైతులు ఉంటే అంతా బాగానే ఉండేది. రైతు అమాయకత్వాన్ని, మంచితనాన్ని అర్థం చేసుకున్న మార్కెట్ ఎప్పుడూ రైతును దగా చేస్తూనే ఉంటుంది.

శ్రమ విలువ, ఆకలి విలువ తెలిసిన రైతు గుండెల్లో కాసింత తడి ఉంటుందేమో కానీ, షాపింగ్ మాల్స్ ఎంత రేటు పెడితే అంతకు నోరు మూసుకుని కొనే కస్టమర్లు నాలుగు రూపాయల కొత్తిమీరను కూడా బేరమాడుతుండడం మనం చూస్తూనే ఉంటాం..



రూపాయి చాక్లెట్ నుంచి కోట్ల విలువైన కార్లదాకా మార్కెట్లో దొరికే ఏ వస్తువైనా తయారీదారు తన అమ్మకపు ధరను నిర్ణయించుకుని మార్కెట్‌కు వస్తాడు. తన వస్తువుకు మార్కెట్ ధరను ఏమాత్రం నిర్ణయించలేని తయారీదారుడు.. ఈ భూమ్మీద ఒక్క వ్యవసాయదారుడే. ఏ పంట రేటూ ఆయన అధీనంలో ఉండదు.. వ్యవసాయాధారిత భారతంలో ఇది అందరికీ తెలిసిన సత్యం. **ఎప్పుడూ మార్కెట్ అతన్ని దగా చేస్తూనే ఉంటుంది**

ఈ మధ్య కేజీ ధర 150–200 రూపాయల దాకా పెరిగిన టమాటా పంట ఒక్క రైతు ఇంటికైనా అంత డబ్బు తీసుకెళ్లిందా..? టమాటాకు అంత ధర రైతు నిర్ణయించగలుగుతాడా..? పోనీ అందులో సగం.. అనుమానమే...!. ధరను మార్కెట్, దళారులే నిర్ణయిస్తారు. వర్షం వచ్చినా రాకపోయినా, చలి పెరిగినా, ఉష్ణోగ్రతలు పెరిగినా, పంటలు బాగా పండినా, పండకపోయినా, వాతావరణం మారినా, రుతుపవనాలు మారినా.. కూరలు, పళ్లధరలు మారుతూనే ఉంటాయి... ఆ ధరలను దళారులు హెచ్చుతగ్గులకు గురి చేస్తూనే ఉంటారు. పెరిగిన దానిలో ఎంత వాటా రైతుకు చేరుతుందో, ధర తగ్గితే ఎవరు నష్టపోతున్నారో అందరికీ తెలిసిందే.

కౌలు ధర, విత్తనాలు, ఎరువులు.. కూలీధరలు, యంత్రాల ఖర్చు, అప్పులు ఇలా రకరకాల ఒత్తిళ్లలో నెలల తరబడి చమటోడ్చి మార్కెట్‌కు తెచ్చిన పంటకు తన ధర నిర్ణయించలేని నిస్సహాయ స్థితిలో ఎప్పుడూ రైతు ఉంటూనే ఉంటాడు.

ఈసారి దేశవ్యాప్తంగా అనేక కారణాల వల్ల కూరగాయల రేట్లు ఆకాశాన్నంటాయి. కేరళ, రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్.. ఏ రాష్ట్రమూ ఈ పెరుగుదలకు మినహాయింపు కాదు, నిమ్మకాయలు, అల్లం, పచ్చిమిర్చి, బెండ కాయలు.. అన్నీ పెరిగాయి. పెరిగిన తన పంట ధరలు చూసి రైతే ఆశ్చర్యపోయి ఉంటాడు. ఇప్పుడు మార్కెట్లో కనిపించే ఈ రేట్లు నేరుగా రైతుకు చేరితే వ్యవసాయం లాభసాటిగానే ఉండేది. పెరిగినప్పుడు దళారులు నొక్కేస్తారు. కానీ, తగ్గినప్పుడు మాత్రం ఆ బాధ, అప్పులు, నష్టాలు అన్నీ రైతు ఖాతాల్లోకే..

...

■ పెరిగిన ఉల్లి ధర ర్యాలీలు, ధర్నాలు. విపక్షాల గగ్గోలు, ఓకల్ సెక్షన్ల హడావుడి కేంద్రసర్కారులను కంగారు పెట్టగలిగింది. ఏకంగా ఢిల్లీ సర్కారును గద్దె దింపగలిగింది. కానీ, రేటు రాక, అమ్ముకోలేక, కన్నీళ్లతో, అప్పులతో రైతు రోడ్డు మీద పారబోసిన టమాటా, పశువులకు మేతగా వేసిన ఏ ఇతర పంటగానీ సర్కారు పీఠం కదిలించగలిగిందా..?

– ఇదీ రైతు భారతం..

అమ్మవారు

కొందరు వేదవేత్తలు భగవతీ అమ్మవారిని 'ద్రుహిణ గృహిణి' అంటారు. ద్రుహిణుడంటే త్రిమూర్తులలో బ్రహ్మ. 'ద్రుహిణ గృహిణి' సరస్వతి. మరికొందరు ఆమెను హరివల్లభ అయిన 'లక్ష్మి' అంటారు. ఇంకొందరు ఆమెను శివపత్ని 'అంబ' అంటారు.

కానీ, నిజానికి ఆమె ఈ ముగురమ్మలలో ఎవరూ కాదు అంటుంది ఆది శంకరుల 'సౌందర్యలహరి'. ఈ ముగురమ్మలూ ఆమె శక్తి అంశలు. ఆమె వాళ్ళకు అధిష్ఠాత్రిగా ఉన్న మూలపుటమ్మ. ఈ విశ్వాన్నంతా సృష్టి, స్థితి, లయల చక్రంలో భ్రమింపజేసే మహామాయాదేవి ఆమె. ఆదిశంకరులు ఆమెను 'పరబ్రహ్మ మహిషి'గా ప్రస్తావించారు.

పరబ్రహ్మ నిత్యమైన, సత్యమైన, అద్వితీయమైన, అవ్యక్తమైన అఖండ చైతన్యం. అనాద్యంతమైన ఉనికి గల 'సత్' పదార్థం. ఆయన జ్ఞాన స్వరూపుడు, ఆనంద మయుడు. అంతే. మరి, నామం, ఆకారం, లింగం ఇత్యాది లౌకిక లక్షణాలు లేని పదార్థానికి పట్టమహిషి ఎక్కడ?


జ్యోతిర్మయం

కొన్ని పరిస్థితులలో పదార్థం శక్తిగా మారగలదు. శక్తి పదార్థంగా కూడా మారగలదు. (అని భౌతిక శాస్త్రజ్ఞులు కూడా ఒప్పుకొంటారు.) పరబ్రహ్మ కల్పాంత సమయాలలో సృష్టిని ఉపసంహరించి నిష్క్రియుడిగా ఉంటాడు (పదార్థం కనక 'ఉంటుంది' అనాలి!). మళ్ళీ సృష్టి చేయాలన్నప్పుడు ఆ సృష్టిజేసే శక్తి ప్రకటితమౌతుంది. అది ఆయన శక్తి. ఆ పరబ్రహ్మనూ, ఆయనకున్న సృష్టి నిర్మాణశక్తినీ రెండుగా విభజించి చూడలేం. రెండూ ఒకటే. నిప్పునూ దానిలోని వేడినీ విభజించలేం.

నిప్పుకున్న శక్తి ఉష్ణ శక్తి. పరబ్రహ్మకున్న సృజన శక్తి పేరు మహామాయా శక్తి. అదే ఆది పరాశక్తి. ఈ బ్రహ్మాండాలూ, ఈ త్రిమూర్తులూ, వాళ్ళ దేవేరులూ, ఈ దేవీ దేవతలు అన్నీ ఆ శక్తి మహిమాంశలు. కనక 'ద్రుహిణ గృహిణి' వాగ్దేవికయినా, హరివల్లభ లక్ష్మికయినా, సాంబశివుడి దేవేరి అంబకయినా, ఆమూలపుటమ్మే అధిష్ఠాత్రి, ఆధారం. ఈ మూలపుటమ్మా, నామ రూప గుణ లింగాది లక్షణాలేవీ లేని ఆ అవ్యక్త పరబ్రహ్మ అవిభాజ్యులు. పదార్థంగా భావిస్తే పరబ్రహ్మ. శక్తిగా భావించినపుడు మహామాయ, భగవతి, అమ్మవారు, ఆది పరాశక్తి. 'పరబ్రహ్మ మహిషి' అంటే పరబ్రహ్మకున్న మహామాయాశక్తి. సృష్టి నిర్మాణ శక్తి.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.ద్వాదశి రా. 8.09 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: రోహిణి రా. 11.59 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ప. 3.45 నుండి 5.25 వరకు, దుర్ముహూర్తం: ఉ. 8.12 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.24 వరకు, అమృతఘడియలు: రా. 8.42 నుండి 10.20 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.36, సూర్యాస్తమయం: 6.35.

క్లుప్తంగా...

భూ కేటాయింపులపై 'సిక్కి' హర్షం

సాక్షి, అమరావతి: దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి భూ కేటాయింపుల్లో ప్రాధాన్యతను ఇవ్వడంపై ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (సిక్కి) హర్షం వ్యక్తంచేసింది. ఏపీఐఐసీ కార్యాలయంలో గురువారం స్టేట్ లెవెల్ అలాట్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. సిక్కి రాష్ట్ర అధ్యక్షుడు రాజమహేంద్రనాథ్ పాల్గొని ఎస్సీ, ఎస్టీలకు భూ కేటాయింపుల సమస్యలను ఏపీఐఐసీ దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించిన ఏపీఐఐసీ వీసీ, ఎండీ ప్రవీణ్‌కుమార్ తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌ను సిక్కి సభ్యులు సన్మానించారు. సిక్కి ఎన్టీఆర్, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల కో–ఆర్డినేటర్లు ప్రభు వికాస్, అనిల్‌కుమార్, బాబు, సభ్యులు పాల్గొన్నారు.

పవన్ రాజకీయాల్లో ఓ జోకర్: ఎంపీ భరత్



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పిచ్చి మాటలకు ప్రజలు ఆయన్ను జోకర్‌గా చూస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడు పవన్ మాట్లాడే మాటలు ప్రజలకు ఏ విధంగా మంచి చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిగా పనిచేస్తున్నారని.. అలాంటి వారిపై పవన్ అక్కసు కక్కుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు ఎన్ని అరాచకాలు చేశాయో గుర్తులేదా? అసలు ఈ కథంతా ఈనాడు స్క్రిప్ట్.. బాబు ప్రొడక్షన్.. పవన్ యాక్షన్ చేస్తారు. ఆ ముగ్గురూ కూడబలుక్కుని వలంటీర్లపై విషం చిమ్ముతున్నారు. సంక్షేమ పథకాలు అడ్డుకోవడమే వారి లక్ష్యం .ఈనాడు విష కథనాలు ప్రచురిస్తుంటే, ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ నోటివెంట ప్రజల మెదళ్లలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారు. వారెన్ని విషప్రయోగాలు చేసినా ప్రజలు వారి మాటల్ని నమ్మరు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నేడు రాష్ట్రంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందరూ చూస్తున్నారు. వలంటీర్లను మందుబాటిల్ రేట్లతో పోల్చుతున్నారంటే పవన్ ఎంత అహంకారో అందరికీ అర్థమవుతుంది.' అని అన్నారు.

పవన్ నీ గురించి ఏ భార్యకు చెప్పమంటావ్?

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: 'పవన్‌ను కొంచెం పట్టించుకోండమ్మా.. ఆయన్ని ఎవరికైనా చూపించడమ్మా... అని నీ భార్యల్లో ఎవరికి చెప్పమంటావ్? ఒకటో భార్యకు చెప్పాలా? రెండో ఆవిడకు చెప్పాలా? మూడో ఆమెకు చెప్పాలా?' అని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం అడపా శేషు మీడియాతో మాట్లాడారు. వలంటీర్లపై ఉన్మాదంతో కూడిన వ్యాఖ్యలు చేసిన పవన్.. సీఎం జగన్ సతీమణి భారతమ్మపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అర్జెంట్‌గా చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలనే ఫ్రస్ట్రేషన్‌తో పవన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు.

ఉమ్మడి పౌరస్మృతిపై పార్టీల వైఖరి తెలపాలి

సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబీ

అనంతపురం రూరల్: ఉమ్మడి పౌర స్మృతిపై రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు తమ వైఖరి స్పష్టం చేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేరళ రాష్ట్ర మాజీ మంత్రి ఎంఏ బేబీ డిమాండ్ చేశారు. గురువారం వారు అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ఇందులో మహిళలకు వ్యతిరేకంగా ఉన్న ప్రధాన అంశాలను సమీక్షించి అన్నింటిలో సమానత్వాన్ని తెచ్చాకే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పౌరస్మృతిపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నా.. ఏపీలో ప్రధాన రాజకీయ పార్టీలు ఏమాత్రం నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు.

నిమ్మగడ్డ దరఖాస్తుపై నిర్ణయం తీసుకోండి

ఎన్నికల అధికారికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలంటే తగిన పత్రాలతో ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఓటరుగా పేరు నమోదు కోసం రమేష్ సమర్పించే దరఖాస్తుపై చట్ట నిబంధనలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల అధికారిని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ గురువారం తీర్పు వెలువరించారు. దుగ్గిరాలలో ఓటరుగా తన పేరు నమోదు చేసుకోవాలన్న అభ్యర్థనను ఎన్నికల అధికారి తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ నిమ్మగడ్డ రమేష్ 2021లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఏపీలో రోడ్ల నిర్మాణం 'డబుల్ స్పీడ్'

జాతీయ రహదారులకు నిధులు రాబట్టడంలో రాష్ట్ర ఎంపీల పనితీరు భేష్

- తొమ్మిదేళ్లలో రెట్టింపునకు పైగా ఎన్‌హెచ్‌ల నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మూడు మేజర్ పోర్టులు అభివృద్ధి
- కృష్ణపట్నం పోర్టు కనెక్టివిటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి గడ్కరీ



జాతీయ రహదారుల నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, తిరుపతి/తిరుపతి తుడా/తిరుమల: అభివృద్ధి పనులకు నిధులు రాబట్టడంలో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అభివర్ణించారు. గురువారం ఆయన తిరుపతిలో పర్యటించారు. సుమారు రూ. 2,900 కోట్లతో కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటీ ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారుల నిర్మాణానికి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో జరిగిన సభలో డిజిటల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఏపీలో 2014 నాటికి 4,193 కి.మీ జాతీయ రహదారులు ఉంటే.. 2023 నాటికి అది 8,744 కి.మీకు చేరిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో నిరుద్యోగానికి చెక్ పెట్టవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ పోర్ట్ విశాఖపట్నం ఉందని, ప్రస్తుత ఏపీ ప్రభుత్వం మరో 3 పోర్ట్‌ల ఏర్పాటుకు ఆసక్తి కనబరచటం మంచిపరిణామం అని చెప్పారు. పోర్ట్‌లు దేశాభివృద్ధికి తోడ్పడతాయని చెప్పారు. ఈ ఏడాదిలో 91 ప్రాజెక్టుల పరిధిలో 3,240 కి.మీలను రూ. 50 వేల కోట్లతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మరో రూ. 75 వేల కోట్లతో 190 ప్రాజెక్టులు పలు దశల్లో ఉన్నాయని, త్వరలో అవీ కానున్నాయని వివరించారు. ఇక 25 ప్రాజెక్టులు 800 కి.మీ. మేర రూ. 20 వేల కోట్లతో, 45 ప్రాజెక్టులు 1,800 కి.మీ. మేర రూ.50 వేల కోట్లతో ఏర్పాటు కానున్నాయని తెలిపారు. రూ.19 వేల కోట్లతో 430 కి.మీ. మేర పోర్టుల అనుసంధాన పనులు జరుగుతున్నాయని వివరించారు.

పెట్టుబడిదారుల చూపు ఏపీ వైపు

ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 2 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దేశ, విదేశీ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులకు మొగ్గు చూపడానికి రవాణా సౌకర్యం కారణమని గడ్కరీ తెలిపారు. కడప–రేణిగుంట, తిరుపతి–మదనపల్లి, రేణిగుంట–నాయుడుపేట రహదారులు 2025 నాటికి పూర్తి చేయనున్నట్లు వివరించారు. కృష్ణపట్నం పోర్టుకు వేగవంతమైన కనెక్టివిటీ వస్తోందని వివరించారు. తిరుపతి నగరంలో ఇంటర్ మోడల్ సెంట్రల్ బస్ టెర్మినల్ నిర్మాణానికి గతేడాది ఆగస్టులో ఎంవోయూ జరిగిందని ఈ జూలైలో టెండర్ పూర్తి కానుందని తెలిపారు. ఏపీలో 7 గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణాలు చేపట్టామన్నారు. దక్షిణ భారతంలోని రాజధాని నగరాలను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి ఈ రహదారులు దోహదం చేస్తాయన్నారు. ఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాలా సౌకర్యాలు ఉన్నాయన్నారు.

సీఎం జగన్ ప్రతిపాదనలతో..

తిరుపతి జిల్లాలో రూ. 17 వేల కోట్లతో జాతీయ రహదారులను అభివృద్ధి చేయడం సంతోషమని స్థానిక పార్లమెంట్ సభ్యుడు మద్దెల గురుమూర్తి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన పనులకు నేడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారని, తిరుపతి బస్ టెర్మినల్, మరి కొన్ని రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మార్చు కోరిన వెంటనే కేంద్ర మంత్రి అంగీకరించడం సంతోషమని తెలిపారు. కేంద్రమంత్రికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్‌అండ్‌బీ కార్యదర్శి ప్రద్యుమ్న ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా గుండె చికిత్సలు అభినందనీయం

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు ఉన్నాయని, ఇక్కడ నిరుపేద చిన్నారులకు ఉచితంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమని నితిన్ గడ్కరీ ప్రశంసించారు. తిరుపతిలోని ఆ ఆస్పత్రిని కేంద్రమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆస్పత్రిలో ఇప్పటివరకు దాదాపు 1,600 గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారని, ఇది భగవంతుని సేవ అని అభివర్ణించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేస్తున్న టీటీడీ యాజమాన్యాన్ని, డాక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి, ఆర్‌ఎంఓ డాక్టర్ భరత్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే ముందు తెల్లవారుజామున నితిన్ గడ్కరీ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని గడ్కరీకి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అందజేశారు.

చాయ్ పే చర్చా...!



గురువారం రోజంతా సుదీర్ఘంగా కేసుల విచారణలో మునిగి తేలిన అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, సహచర న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ఆవరణలోని కెఫెటేరియాలో ఇలా వేడి వేడి కాఫీ తాగుతూ సేదదీరారు.

మొక్కలు నాటిన హైకోర్టు న్యాయమూర్తులు



సాక్షి, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తులు గురువారం హైకోర్టు వద్ద మొక్కలు నాటారు. కొత్తగా నిర్మించిన హైకోర్టు అదనపు భవనం వద్ద న్యాయమూర్తులు ఈ మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కలు నాటిన వారిలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి, జస్టిస్ కుంభజడల మన్మథరావు, జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వడ్డిబోయన సుజాత, జస్టిస్ డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్, జస్టిస్ బండారు శ్యాంసుందర్, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్, జస్టిస్ బీవీఎల్‌ఎన్ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు, జస్టిస్ దుప్పల వెంకటరమణ ఉన్నారు.

పారని బాబు, నారాయణ పాచిక

అమరావతి అసైన్డ్ భూముల కేసులో సుదీర్ఘ వాయిదాకు మరోసారి యత్నం

- తీవ్ర అభ్యంతరం తెలిపిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- ఇప్పటికే ఎన్నోసార్లు వాయిదాలు కోరారని వెల్లడి.. ఎత్తుగడ ఫలించక పోవడంతో స్వల్ప వాయిదాకు బాబు న్యాయవాదుల అభ్యర్థన
- తదుపరి విచారణ వచ్చే గురువారానికి వాయిదా



సాక్షి, అమరావతి: అమరావతి భూ కుంభకోణంలో భాగమైన అసైన్డ్ భూముల బదలాయింపు వ్యవహారంపై సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితులైన మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు, ఆయనకు అత్యంత ఆప్తుడు, మాజీ మంత్రి నారాయణ ఏదో జరిగిపోతోందంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వారి వినతి మేరకు హైకోర్టు స్టే ఇచ్చింది. ఆ తర్వాత వారి పిటిషన్లపై విచారణ సాగకుండా వారే శక్తియుక్తులన్నీ ప్రయోగిస్తూ వాయిదాల మీద వాయిదాలు కోరుతున్నారు. స్టే పొడిగింపు ఉత్తర్వులూ పొందుతున్నారు. హైకోర్టులో ఇదో పెద్ద ప్రహసనంగా మారింది. తాజాగా గురువారం ఇదే రీతిలో విచారణను సుదీర్ఘ కాలానికి వాయిదా వేయించేందుకు వారి న్యాయవాదులు ప్రయత్నించి విఫలమయ్యారు. కోర్టులో వారి ఎత్తులను రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో అడ్డుకున్నారు. న్యాయస్థానానికి సైతం వారి ఎత్తుగడలు అర్థమయ్యాయి. దీంతో వచ్చే గురువారానికి మాత్రమే విచారణను వాయిదా వేయించుకోగలిగారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్టే పొంది వాయిదాల మీద వాయిదాలు

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ 2021లో ఈ కేసు నమోదు చేసింది. ఈ కేసు కొట్టేయాలంటూ బాబు, నారాయణ అదే ఏడాది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. ఈ కేసులో దర్యాప్తుతో సహా తదుపరి చర్యలన్నింటినీ నిలిపేస్తూ 2021 మార్చి 19న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి విచారణ వాయిదా పడుతోంది. ఆ తరువాత ఈ వ్యాజ్యాలు ఓ న్యాయమూర్తి వద్ద విచారణకు రాగా, తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు స్టే కొనసాగుతుందంటూ ఉత్తర్వులు పొందారు. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యాలు విచారణకు వచ్చాయి. చంద్రబాబు, నారాయణ తరఫు సీనియర్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు విచారణ గురువారానికి వాయిదా పడింది. గురువారం మరోసారి సుదీర్ఘ వాయిదాకు వారి వ్యూహాన్ని అమల్లో పెట్టారు. బాబు తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నానని, అయితే, ఈ కేసులో ఫిర్యాదుదారు, ప్రతివాది ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టు నోటీసు అందలేదని, అందువల్ల విచారణ జరపడం సరికాదని అన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రికార్డులను పరిశీలించిన కోర్టు అధికారి.. నోటీసు ఇచ్చినట్లు ఎలాంటి డాక్యుమెంట్ లేదన్నారు. ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకొని మరోసారి రికార్డులు చూడాలని కోరారు. మరోసారి రికార్డులను పరిశీలించగా, రామకృష్ణారెడ్డికి 2021లోనే నోటీసులు పంపినట్లు ఉన్న ఉత్తర్వుల కాపీ దొరికింది. దీంతో ఖంగుతిన్న చంద్రబాబు, నారాయణ న్యాయవాదులు విచారణ వాయిదా వేయాలని కోరారు. దీనికి సుధాకర్‌రెడ్డి అడ్డుతగిలారు. నోటీసులు అందలేదన్న సాకుతో వాయిదా వేయించాలని చూశారన్నారు. వాదనలు వినిపించేందుకు సిద్ధమని చెప్పిన దమ్మాలపాటి శ్రీనివాస్ ఎందుకు వాయిదా కోరుతున్నారని, ఇది టూ మచ్ అంటూ తీవ్ర స్వరంతో మాట్లాడారు. ఇప్పటికే విచారణను ఎన్నోసార్లు వాయిదా వేయించారని చెప్పారు. వాళ్లే చాలాసార్లు వాయిదా తీసుకున్నారని దమ్మాలపాటి అనగా, ఎవరు ఎన్నిసార్లు వాయిదాలు తీసుకున్నారో తేల్చేందుకు తాను ఇక్కడ లేనని న్యాయమూర్తి కరాఖండిగా చెప్పారు. సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. బుధవారం మరో కేసు ఉన్నందున విచారణను గురువారానికి కోరతామని దమ్మాలపాటి చెప్పడంతో తాను అంగీకరించినట్లు తెలిపారు. గురువారం కూడా వాయిదా కోరడంలో అర్థం లేదన్నారు. తమ ఎత్తుగడ ఫలించదని బాబు, నారాయణ న్యాయవాదులకు అర్థమవడంతో తాము సుదీర్ఘ వాయిదా కోరడం లేదని దమ్మాలపాటి చెప్పారు. వచ్చే గురువారానికి వాయిదా వేయాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ బుధవారానికి మొగ్గు చూపగా, దమ్మాలపాటి పదే పదే అభ్యర్థించడంతో విచారణను గురువారానికి వాయిదా వేశారు.

'స్థానిక' ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జయకేతనం

2 డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్, 3 వైస్ చైర్‌పర్సన్, 3 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ పదవులు వైఎస్సార్‌సీపీకే..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పట్టణ, స్థానిక సంస్థల్లో గురువారం జరిగిన పలు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జయకేతనం ఎగురవేసింది. ఒక మండలాధ్యక్ష పదవికి, మూడు మండల ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. మచిలీపట్నం నగరపాలక సంస్థలో రెండు డిప్యూటీ మేయర్ పదవులకు ఎన్నికలు జరిగాయి. అధికార వైఎస్సార్‌సీపీకి చెందిన మాడపాటి విజయలక్ష్మి (26వ వార్డు కార్పొరేటర్), సీలం భారతీనాగకుసుమ (మూడోవార్డు) ఈ పదవుల్ని గెల్చుకున్నారు. పెడన మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన కటకం నాగకుమారి (ఏడో వార్డు కౌన్సిలర్) గెలుపొందారు. మాచర్ల మున్సిపాలిటీలో వైస్ చైర్మన్‌గా మాచర్ల ఏసోబు (18వ వార్డు) ఎన్నికయ్యారు. ధర్మవరం మున్సిపాలిటీ వైస్ చైర్మన్లుగా వేముల జయరామిరెడ్డి (రెండో వార్డు), షేక్ షంసద్ బేగం (38వ వార్డు) గెలుపొందారు.

- 13 మండలాల్లో నాలుగు ఎంపీపీ, ఏడు మండల ఉపాధ్యక్ష, మూడు కో–ఆప్షన్ సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిలో రామకుప్పం (చిత్తూరు జిల్లా) మండలాధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, విజయాపురం (చిత్తూరు), రాయదుర్గం (అనంతపురం) మండలాల ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు వాయిదాపడ్డాయి. తొండంగి (కాకినాడ), వత్సవాయి (ఎన్టీఆర్), చేజర్ల (నెల్లూరు) మండలాధ్యక్షులుగా, పెదకడబూరు (కర్నూలు), గాలివీడు (అన్నమయ్య), రాపూరు (నెల్లూరు), పార్వతీపురం (పార్వతీపురం మన్యం) మండల ఉపాధ్యక్షులుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. చిత్తూరు (చిత్తూరు), రాజంపేట (అన్నమయ్య), బి.మఠం (వైఎస్సార్) మండలాల్లో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తయింది.

బాబు స్నేహం అవినీతిపరులతోనే..

- మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు తన జీవిత కాలమంతా అబద్ధాలతోనే గడిపారని, సింగపూర్ మంత్రిని తీసుకొచ్చి అమరావతిని కూడా సింగపూర్‌లా మారుస్తానని చూపించిన చంద్రబాబు గ్రాఫిక్స్ మాయలు అన్నీ ఒక్కొక్కటీ పటాపంచలవుతున్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అమరావతిలోనూ సింగపూర్ సిత్రాలు చూపించి పెద్ద భూ కుంభకోణానికి తెరతీశారని, దీనిపై మున్సిపల్ మంత్రిగా అన్ని ఆధారాలతో సహా తానే స్వయంగా డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతిపరులతో అంటకాగుతూ రాష్ట్ర ప్రజలను వంచించారని, అందుకు నిదర్శనమే సింగపూర్‌లో బాబు పార్టనర్, ఆ దేశ మంత్రి ఈశ్వరన్‌పై విచారణ అని మంత్రి వివరించారు.

వలంటీర్లపై వారిద్దరూ అక్కసు

హైదరాబాద్‌లో ఉండేవారికి ఆంధ్రప్రదేశ్‌లో విషయాలు ఏం తెలుస్తాయని, పవన్‌కు గాలికబుర్లు, చంద్రబాబుకు అబద్ధాలు సాధారణమేనని బొత్స విమర్శించారు. వలంటీర్లు రాష్ట్ర ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తుంటే ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును జీర్ణించుకోలేక వారిద్దరూ అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. మన వలంటీర్ వ్యవస్థను దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఓ వీధిలో అందరికీ తెలిసిన వారినే వలంటీరుగా నియమించామని, వారు ఆ వీధిలోని 50 ఇళ్ల వరకే పరిమితమన్నారు. ఆ పరిధిలోని వారంతా వారి కుటుంబ సభ్యులో లేక బంధువులో ఉంటారే తప్ప మరొకరు ఉండే అవకాశంలేదన్నారు. ఇలాంటి చోట వలంటీర్లు తప్పు చేసేందుకు ఏం ఆస్కారం ఉంటుందని మంత్రి ప్రశ్నించారు. పవన్ తన స్వార్థ ప్రయోజనాల కోసం వలంటీర్లపై నింద చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో ఏదైనా ఇబ్బందికరమైన అంశముంటే కేంద్ర నిఘా వర్గాలు ప్రభుత్వాలకు చెబుతాయని, పవన్‌కు ప్రత్యేకంగా చెప్పడమేంటని బొత్స ప్రశ్నించారు.

విద్యా సంస్కరణల్లో ఏపీ నెంబర్–1

మన రాష్ట్రంలో విద్యా సంస్కరణలు దేశంలోనే అత్యుత్తమంగా నిలిచాయని.. పరీక్షల నిర్వహణ నుంచి ఉపాధ్యాయుల బదిలీల వరకు అన్నీ పారదర్శకంగా సమర్థంగా నిర్వహించామని బొత్స చెప్పారు. ఆర్జీయూకేటీలో సీట్లు సాధించిన అభ్యర్థుల జాబితాను గురువారం విడుదల చేసిన అనంతరం ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై విలేకరుల ప్రశ్నకు మంత్రి పైవిధంగా స్పందించారు. తెలంగాణలో పరీక్షల నిర్వహణ ఎంత గందరగోళంగా మారిందో, ఎన్ని తప్పులు జరిగాయో తెలిసిందేనని, ఉపాధ్యాయుల బదిలీలు కూడా సమర్థంగా నిర్వహించలేకపోతున్నారన్నారు. ఒక రాష్ట్ర విధానాలను మరో రాష్ట్రంతో ముడిపెట్టొద్దని మంత్రి బొత్స చెప్పారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించడం హర్షణీయం

తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కనకారావు, మధుసూదనరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దళిత రైతులకు మేలు చేసేలా అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు హర్షం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని మాదిగ, రెల్లి కార్పొరేషన్ కార్యాలయాల వద్ద గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 60వేల ఎకరాలు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం విప్లవాత్మక నిర్ణయమన్నారు. కాగా, అసైన్డ్ భూములు కేటాయించిన 20 ఏళ్ల తర్వాత పూర్తి హక్కులు ఆ రైతుకే చెందేలా మంత్రివర్గం నిర్ణయించడంపై జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాదరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో గెలుపు దిశగా కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పురందేశ్వరి



బాధ్యతలు స్వీకరిస్తున్న పురందేశ్వరి

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ గెలుపు లక్ష్యంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు.విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. కార్యకర్తలను కలుపుకొంటూ ముందుకెళ్తా' అని చెప్పారు. పొత్తులపై ఏ నిర్ణయమైనా కేంద్ర పార్టీ తీసుకుంటుందని తెలిపారు. పోలవరం నిర్మాణానికి నిధులను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, ప్రాజెక్టును పూర్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి లేకపోతే ఆ ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించాలన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీలు జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేష్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు సునీల్ దేవధర్, సత్యకుమార్ పాల్గొన్నారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె ప్రసంగించారు.

తెలంగాణ

తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ సీజేగా జస్టిస్ నవీన్‌రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై వెళ్తున్న నేపథ్యంలో తదుపరి సీనియర్ జడ్జి జస్టిస్ నవీన్‌రావును యాక్టింగ్ సీజేగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే శుక్రవారం జస్టిస్ నవీన్‌రావు పదవీ విరమణ ఉండటంతో.. అనంతరం ఆ బాధ్యతలు తదుపరి సీనియర్ జడ్జి అయిన జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ నిర్వహిస్తారని పేర్కొంది.

'అసైన్డ్' రైతుల జీవితాల్లో వెలుగు

▶ మొదటి పేజీ తరువాయి

పదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు. కానీ నిరుపేదలు మాత్రం అమ్ముకునే అవకాశం లేదు. 1954కు ముందు భూములు ఇచ్చిన వారికి పట్టాల్లో ఎక్కడా వాటిని అమ్మకూడదనే షరతు లేదు. 1954 తర్వాత ఇచ్చిన అసైన్డ్ చట్టాల్లో మాత్రం భూములు అమ్మకూడదనే నిబంధన ఉంది. దీంతో ఈ భూములన్నింటినీ నిషేధిత జాబితా 22 (ఏ)లో పెట్టారు. దీనివల్ల వాటి క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1954కు ముందు అసైన్డ్ అయిన భూములను నిషేధిత జాబితా నుంచి తీసివేసే ప్రక్రియ ప్రారంభించింది. 1954 తర్వాత అసైన్డ్ అయిన భూములు మాత్రం నిషేధిత జాబితాలో ఉన్నాయి. 1977లో ఏపీ అగ్రికల్చరల్ ల్యాండ్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్–పీఓటీ) చట్టం వచ్చింది. దీని ప్రకారం భూమి లేని నిరుపేదలకు వ్యవసాయం కోసం ఇచ్చిన భూములు అమ్ముకోకూడదు. ఎలాంటి కష్టం వచ్చినా, అవసరం వచ్చినా, చదువుల కోసమైనా, ఆరోగ్యం కోసమైనా అమ్ముకునే అవకాశం లేదు. ఈ చట్టం రూపొందించడానికి ముందు ఉన్న అసైన్డ్ భూములు కూడా ఈ చట్టం వల్ల నిషేధిత జాబితాలోకి వచ్చేశాయి.

హక్కు లేక.. అమ్ముకోలేక..

తమకు ఇచ్చిన భూమిలో ఏదైనా అవసరం వచ్చి అరెకరం, ఇంకొంత గానీ అమ్ముకోవాలనుకుంటే చట్ట ప్రకారం అమ్ముకోలేని పరిస్థితి ఉండడంతో అసైన్డ్ రైతులు తమ భూములు రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేక కాగితాల మీద రాసి అమ్మకాలు జరిపారు. ఫలితంగా వారికి రావాల్సిన రేటులో కనీసం 25 శాతం కూడా దక్కేది కాదు. తక్కువ రేటుకే తమ భూములను సాదాబైనామాల పద్ధతిలో అమ్ముకునేవారు. ఆ భూమిపై హక్కు లేకపోవడం వల్ల రెవెన్యూ శాఖ ఎప్పుడైనా వారికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉండేది. ఆ భూమి ప్రభుత్వం తీసేసుకుంటుందని, వేరే అవసరాలకు రిజర్వు చేస్తోందనే భయాందోళనలు రైతుల్లో ఉండేవి. మరోవైపు రెవెన్యూ రికార్డులు క్షేత్ర స్థాయి వాస్తవ పరిస్థితిని తెలిపేలా లేవు. రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 19,21,855మందికి 33,29,908 ఎకరాలు అసైన్ చేస్తే ఆ రికార్డులు క్షేత్ర స్థాయికి తగ్గట్టుగా లేవు. 1954 నుంచి అసైన్‌మెంట్లు (కేటాయింపులు) జరుగుతూనే ఉన్నాయి. అంటే 70 ఏళ్ల తర్వాత కూడా అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు లేవు.

ప్రజాప్రతినిధుల కమిటీతో విస్తృత అధ్యయనం

ఈ భూములపై అనేక విజ్ఞప్తులు అందడంతో వీటిపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో 13 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో 2022 ఆగస్టు 30న సీఎం జగన్ ప్రజాప్రతినిధుల కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కర్ణాటక, తమిళనాడులో పర్యటించి అక్కడి విధానాలపై అధ్యయనం చేసింది. అసైన్డ్ భూములకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న చట్టాలు, నియమ నిబంధనలను సైతం క్షుణ్ణంగా పరిశీలించింది. కేరళ రాష్ట్రంలో అసైన్ చేసిన మూడేళ్ల తర్వాత, కర్ణాటకలో 25 ఏళ్ల తర్వాత, తమిళనాడులో పదేళ్ల తర్వాత కొన్ని నిబంధనలతో అమ్ముకునే అవకాశం ఉందన్న విషయాన్ని కమిటీ పరిగణనలోకి తీసుకుంది. కర్ణాటకలో ఐదేళ్ల తర్వాత కలెక్టర్ అనుమతితో అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చు. తమిళనాడులో మిగులు భూముల్లో ఇచ్చిన అసైన్మెంట్ అయితే 25 ఏళ్ల తర్వాత అమ్ముకోవచ్చు. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత మన రాష్ట్రంలో అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత లబ్ధిదారులు, వారు లేకపోతే వారి వారసులు (హక్కుదారులు) వారికి అవసరమైనప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని కమిటీ భావించింది. ఇందుకోసం ఏపీ అసైన్మెంట్ (పీఓటీ)–1977కు సవరణలు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చింది. అంటే అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పూర్తయితే అసైన్‌దారులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు ఇవ్వాలని సిఫారసు చేసింది. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

15.21 లక్షల మంది రైతుల జీవితాల్లో వెలుగు

ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రైతులకు మేలు జరుగుతుంది. సుమారు 15,21,160 మంది భూమి లేని నిరుపేదలకు వారికి సంబంధించిన 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయి. 20 ఏళ్లకు ముందు ఇచ్చిన భూములన్నింటికీ ఇది వర్తిస్తుంది. ఈ భూములన్నీ 1954 తర్వాత అసైన్‌మెంట్ చేసినవే. ఈ 20 ఏళ్లలో 4,00,695 మందికి 5,88,211 ఎకరాల భూమిని అసైన్ చేశారు. ప్రతి సంవత్సరం రెవెన్యూ విభాగం 20 ఏళ్లు పూర్తయిన భూముల జాబితాను తయారు చేసి, వాటిని 22(ఏ) నుంచి తొలగిస్తుంది. గతంలో మాదిరిగా ఒక భూమిని 22(ఏ) నుంచి తొలగించాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. రెవెన్యూ శాఖ తనకు తానే 20 ఏళ్లు దాటిన భూములను జాబితా నుంచి తీసివేస్తుంది. అసైన్డ్ రైతులు ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ ఉండదు. అవినీతి ఉండదు. పారదర్శకంగా ఈ ప్రక్రియ నడుస్తుంది. అదే సమయంలో ఎవరైనా 20 ఏళ్లకు ముందే పేద రైతుల నుంచి భూములు కొనుక్కుని ఉంటే వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. వారికి ఎటువంటి హక్కులు రావు. అలాంటి వారి విషయంలో 1977 పీఓటీ చట్టం అమల్లో ఉంటుంది.

పదేళ్ల తర్వాత ఇళ్ల పట్టాలు అమ్ముకోవచ్చు

వ్యవసాయ భూములే కాకుండా ప్రభుత్వం ఇళ్ల పట్టాలు నిరుపేదలకు అసైన్ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 31 లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మలకు ఇచ్చింది. ఇలా ఇచ్చిన ఇళ్లపై 20 సంవత్సరాల తర్వాత గత చట్టాల ప్రకారం సర్వ హక్కులు లభించేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దాన్ని 10 ఏళ్లకు తగ్గిస్తూ పీఓటీ చట్టంలో సవరణ చేసింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాలు పొందిన వారితోపాటు, మిగిలిన వారికీ ఇది వర్తిస్తుంది.

క్లుప్తంగా...

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు...

నలుగురికి పదేళ్ల జైలు

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పేలుళ్లకు కుట్ర చేసిన కేసులో ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన నలుగురికి ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు బుధవారం పదేళ్ల జైలు శిక్ష విధించింది. వీరిలో డానిశ్ అన్సారీ, అఫ్తాబ్ ఆలం (బిహార్), ఇమ్రాన్ ఖాన్ (మహారాష్ట్ర), ఒబైదుర్ రెహ్మాన్ (హైదరాబాద్) ఉన్నారు. వీరికి 2006 వారణాసి పేలుళ్లకు, 2007 ఫైజాబాద్, లక్నో పేలుళ్లు, 2008 జైపూర్, ఢిల్లీ, అహ్మదాబాద్ వరుస పేలుళ్లు, 2010 బెంగళూరు స్టేడియం పేలుడు, 2013 హైదరాబాద్ జంట పేలుళ్లతో సంబంధాలున్నట్టు ఎన్‌ఐఏ పేర్కొంది. పాకిస్తాన్‌కు చెందిన కుట్రదారులతో కలిసి పథక రచన చేసినట్టు వివరించింది. ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టు ఇప్పటికే యాసిన్ భక్తల్ తదితరులపై అభియోగాలు మోపడం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఎన్‌ఐఏ ఢిల్లీ వీరిని 2013 జనవరి–మార్చి మధ్య అరెస్టు చేసింది.

సాంబార్ ఇవ్వనందుకు రూ.3,500 జరిమానా!

పాట్నా: మసాలా దోసతో పాటు సాంబారు ఇవ్వనందుకు కస్టమర్‌కు రూ.3,500 జరిమానా చెల్లించాలని బిహార్‌లో ఓ హోటల్‌ను వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. రూ.140 పెట్టి కొనుక్కున్న స్పెషల్ మసాలా దోసకు సాంబార్ ఇవ్వలేదంటూ మనీశ్ గుప్తా అనే లాయర్ కమిషన్‌ను ఆశ్రయించాడు! పుట్టిన రోజు సందర్భంగా బక్సర్‌లోని నమక్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. స్పెషల్ దోశ పార్సిల్ చేయించుకుని తీసుకెళ్లాడు. ఇంటికెళ్లి చూస్తే సాంబార్ లేదు. హోటల్‌కు ఇదేమిటని నిలదీస్తే, 'రూ.140కి హోటల్ మొత్తం రాసిస్తారా?' అంటూ ఓనర్ వెటకారం చేయడంతో అతనికి మనీశ్ లీగల్ నోటీసు పంపించాడు. స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు.

కమలా హారిస్ రికార్డు

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన తొలి భారత సంతతి మహిళగా చరిత్ర సృష్టించిన కమలా హారిస్(58) మరో రికార్డు నెలకొల్పారు. భారత సంతతికి చెందిన కల్పనా కోటగల్‌ను అమెరికా సమాన ఉద్యోగ అవకాశాల కమిషన్ సభ్యురాలిగా నియమించే విషయంలో ఆమె టై–బ్రేకింగ్ ఓటు వేశారు. సెనేట్‌లో బుధవారం ఓటింగ్ జరిగింది. కల్పనా కోటగల్‌ను నియమించాలన్న ప్రతిపాదనకు అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన సంఖ్యలో ఓట్లు పోలయ్యాయి. దీంతో ఉపాధ్యక్షురాలిగా కమలా హ్యారిస్ టై–బ్రేకింగ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమెరికా చరిత్రలో ఉపాధ్యక్షుడు ఇలాంటి ఓటు హక్కు వినియోగించుకోవడం 191 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి.

ఆవలి దిక్కున... జాబిలి చిక్కేనా!

ప్రతిష్టాత్మక చంద్రయాన్‌–3 ప్రయోగం నేడే

జాబిల్లిపై ఇప్పటిదాకా ఎవరూ అడుగు పెట్టని దక్షిణ దిశను ముద్దాడాలన్న చిరకాల లక్ష్యాన్ని సాధించేందుకు ఇస్రో మరోసారి సన్నద్ధమవుతోంది. చంద్రయాన్‌–3 మిషన్‌ను నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి మోసుకెళ్లేందుకు ఇస్రో గెలుపు గుర్రం, బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం–3 సిద్ధమవుతోంది. ఈ మిషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేసి నాలుగేళ్ల నాటి చంద్రయాన్‌–2 వైఫల్యం తాలూకు చేదు జ్ఞాపకాలను చెరిపేయాలని ఇస్రో పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నింటి కళ్లూ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ప్రయోగంపైనే నిలిచాయి...

విజయవంతమైతే చంద్రుని దక్షిణ ధ్రువం చేరిన తొలి దేశంగా భారత్
దాంతో ప్రపంచ దేశాలన్నింటి చూపూ భారత్ వైపే

- చంద్రయాన్‌–2 వైఫల్యం నేపథ్యంలో సకల జాగ్రత్తలు తీసుకుంటున్న ఇస్రో
- మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగం
- సిద్ధంగా ఎల్‌వీఎం3 బాహుబలి రాకెట్
- గురువారమే మొదలైన కౌంట్‌డౌన్

– సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. ప్రతిష్టాత్మక చంద్రయాన్‌–3 మిషన్‌ను చంద్రుని దక్షిణ ధ్రువంపైకి పంపేందుకు సర్వం సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) రెండో ప్రయోగవేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌వీఎం3–ఎం4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా ఈ ప్రయోగం జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లనూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇప్పటికే పూర్తి చేసింది. ప్రయోగానికి 25 గంటల పై చిలుకు కౌంట్‌డౌన్ గురువారం మధ్యాహ్నం 1.05కు మొదలైంది. 2019 జూలై 15న చంద్రయాన్‌–2కు ఏర్పాట్లన్నీ చేశాక చివరి గంటలో రాకెట్‌లోని మూడో దశ క్రయోజనిక్ ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని ఆపేయాల్సి రావడం, ఏడు రోజుల్లో దాన్ని సరి చేసి జూలై 22న ప్రయోగం జరపడం తెలిసిందే. ఈసారి ఇప్పటిదాకా ప్రపంచంలో ఏ దేశమూ వెళ్లని చంద్రుడి రెండో వైపుకు ల్యాండర్, రోవర్‌లను పంపనున్నారు. దాంతో అన్ని దేశాల చూపూ భారత్‌వైపే ఉంది! అందుకే ఈసారి గురి తప్పొద్దనే పట్టుదలతో ఇస్రో సకల జాగ్రత్తలూ తీసుకుంటోంది. ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ బుధవారం నుంచీ షార్‌లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలతో సమీక్షిస్తున్నారు.


పెరిగిన కౌంట్‌డౌన్...

ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్‌కు 25.30 గంటల కౌంట్‌డౌన్ సమయం తీసుకున్నారు. ముందుగా 24 గంటలే అనుకున్నా సాంకేతిక సమస్యలతో సమయాన్ని గంటన్నర పాటు పెంచారు. రాకెట్‌కు రెండో దశ ఎల్–110లో ద్రవ ఇంధనం నింపే ప్రక్రియను గురువారం అర్ధరాత్రికే పూర్తి చేశారు. అనంతరం లెవెల్ 1, 2 తనిఖీలు, రాకెట్‌లో హీలియం నింపడం, ఎలక్ట్రికల్ తదితర వ్యవస్థలను సరి చూసుకోవడం వంటివి జరుగుతాయి.



చంద్రుడి గుట్టు విప్పేందుకే...

చంద్రున్ని లోతుగా అధ్యయనం చేసి, అక్కడ దాగున్న అనేకానేక రహస్యాలను వెలికి తీయడమే చంద్రయాన్‌–3 ప్రయోగం ప్రధాన లక్ష్యం...



చంద్రయాన్‌–3 బరువు **3,920** కిలోలు

ఇందులో ప్రొపల్షన్ మాడ్యూల్ 2,145 కిలోలు, ల్యాండర్ 1,749 కిలోలు, రోవర్ 26 కిలోలుంటాయి.

చంద్రయాన్‌–2 వైఫల్యంతో చంద్రుడిపై ఇస్రో పరిశోధనలు ఆగిపోయాయి. చంద్రయాన్‌–2లో 14 పేలోడ్స్ పంపగా చంద్రయాన్‌–3లో 5 ఇస్రో పేలోడ్స్, 1 నాసా పేలోడ్‌ను మాత్రమే పంపుతున్నారు.

చంద్రయాన్‌–3 ప్రపొల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్లలో అత్యాధునిక సాంకేతిక పరికరాలను అమర్చి పంపుతున్నారు.

ఇందుకోసం ఇస్రో శాస్త్రవేత్తలు 2 నెలలుగా అహర్నిశలు శ్రమిస్తున్నారు.

దక్షిణ ధ్రువంపై దిగాలని...



ఇప్పటి దాకా ఎన్నో దేశాలు చంద్రునికి ముందు వైపు, అంటే ఉత్తర ధ్రువంపై పరిశోధనలు చేశాయి. భారత్ మాత్రం చంద్రయాన్‌–1 నుంచి తాజా చంద్రయాన్‌–3 దాకా చంద్రుని వెనుక వైపు, అంటే దక్షిణ ధ్రువాన్ని పరిశోధించేందుకే ప్రయత్నిస్తూ వస్తోంది. అందులో భాగంగా చంద్రయాన్‌–3 ల్యాండర్‌ను సూర్యరశ్మి పడని చంద్రుని దక్షిణ ధ్రువపు చీకటి ప్రాంతంలో దించనున్నారు.

- ప్రొపల్షన్ మాడ్యూల్లో ఒకటి, ల్యాండర్‌లో మూడు, రోవర్‌లో రెండు పేలోడ్ల చొప్పున చంద్రయాన్‌–3లో అమర్చారు.
- 2,145 కిలోల బరువున్న ప్రొపల్షన్ మాడ్యూల్‌లో 1,696 కేజీల అపోజి ఇంధనం నింపారు. దీని సాయంతోనే ల్యాండర్, రోవర్‌లను మాడ్యూల్ చంద్రుడి కక్ష్యలోకి తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- చంద్రుని కక్ష్య నుంచి భూమిని, చంద్రున్ని అధ్యయనం చేయడానికి ప్రొపల్షన్ మాడ్యూల్‌లో ఓ పరికరాన్ని అమర్చారు.
- చంద్రుని ఉపరితలం వాసయోగ్యమో, కాదో తేల్చడంతో పాటు చంద్రునిపై జరిగే మార్పుచేర్పులకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఇది భూమికి చేరవేస్తుంది.
- రోవర్‌లో మూడు పేలోడ్లను పంపుతున్నారు. ఇందులో లాంగ్‌మ్యూయిన్ ప్రోబ్ చంద్రుడి ఉపరితలంపై ప్లాస్మా, అయాన్లు, ఎలక్ట్రాన్ల సాంద్రత కాలంతో పాటు మారుతుందా అనే అంశాన్ని పరిశోధిస్తుంది.
- చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై ఉష్ణ లక్షణాలను కొలవడానికి, చంద్రుడిపై మ్యాప్ తయారు చేయడానికి దోహదపడుతుంది.
- ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ ల్యూనార్ సెస్మిక్ యాక్టివిటీ, రేడియో అనాటమీ ఆఫ్ మూన్ బౌండ్ హైపర్ సెన్సిటివ్ అయానోస్ఫియర్, అట్మాస్ఫియర్ పేలోడ్లు చంద్రుడి లాండింగ్ సైట్ చుట్టూ భూ కంపతను కొలుస్తాయి.
- అల్ఫా పార్టికల్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్ పేలోడ్‌తో చంద్రునిపై ఖనిజ సంపద, శిలాజాలను శోధించడంతో పాటు చంద్రుడిపై రసాయనాలున్నట్టు తేలితే వాటి జాబితా తయారీకి ఉపయోగిస్తారు.
- లేజర్ ప్రేరేపిత బ్రేక్ డౌన్ స్పెక్ట్రోస్కోప్ పేలోడ్ చంద్రుడిపై రాళ్ల వంటివున్నాయా, చంద్రుని ఉపరితలం ఎలా ఉంటుంది, చుట్టూతా ఏముంది వంటివి శోధిస్తుంది.



తిరుపతిలో ఇస్రో చైర్మన్ పూజలు

చంద్రయాన్‌–3 ప్రయోగం నిజంగా సవాలేనని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అంగీకరించారు. చంద్రయాన్‌–3 నమూనాకు ఇస్రో శాస్త్రవేత్తలతో కలిసి తిరుమల శ్రీవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. నమూనాను స్వామి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో కూడా పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రయోగం విజయవంతమవుతుందని ఆయన ధీమా వెలిబుచ్చారు. ''చంద్రయాన్‌–1 ప్రయోగం ద్వారా చంద్రునికి రెండోవైపు నీళ్లున్నాయని కనుగొన్నాం. చంద్రయాన్‌–2 ల్యాండర్, రోవర్ క్రాషై పని చేయకపోయినా వాటిని తీసుకెళ్లిన ఆర్బిటార్ ఇప్పటికీ చంద్రుని కక్ష్యలో తిరుగుతూ అత్యంత విలువైన సమాచారం అందిస్తోంది. చంద్రుడిపై నీళ్లున్నట్టు చంద్రయాన్‌–2 కూడా ధ్రువీకరించింది'' అని గుర్తు చేశారు. చంద్రయాన్‌–3 ముగియగానే సూర్యుడిపై పరిశోధనలకు ఆగస్టులో ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని ప్రకటించారు. తద్వారా మిషన్ సూర్య, చంద్ర దిగ్విజయంగా పూర్తవుతాయన్నారు. ''జూలై 23న సింగపూర్, ఇజ్రాయెల్ ఉపగ్రహాల వాణిజ్య ప్రయోగాలున్నాయి. గగన్‌యాన్ ప్రయోగం ప్రయోగాత్మక పరీక్షల దశలో ఉంది. పక్కాగా పరీక్షలన్నీ చేసి 2024 చివరికల్లా చేపడతాం'' అన్నారు.

ఫ్రాన్స్‌లో మోదీకి రెడ్‌కార్పెట్

నేడు నేషనల్ డే వేడుకల్లో పాల్గొననున్న ప్రధాని

పారిస్: ప్రధాని నరేంద్ర మోదీకి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో రెడ్‌కార్పెట్ స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం ఆయన పారిస్ చేరుకున్నారు. ఫ్రాన్స్ ప్రధానమంత్రి ఎలిజబెత్ బార్నీ ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి పూర్తి అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికారు. శుక్రవారం ఫ్రెంచ్ నేషనల్ డే వేడుకల్లో మోదీ ముఖ్య అతిథిగా మోదీ పాల్గొంటారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సమావేశమవుతారు. ''పారిస్ చేరుకున్నా. భారత్–ఫ్రాన్స్ మధ్య మరింత సంబంధాలు బలపడేందుకు నా పర్యటన దోహదపడుతుందని భావిస్తున్నా'' అంటూ మోదీ ట్వీట్ చేశారు.



ఫ్రాన్స్ ప్రధాని సమక్షంలో సైనిక వందనం స్వీకరిస్తున్న మోదీ



పారిస్‌లో మోదీకి స్వాగతం పలుకుతున్న భారతీయులు

ఫ్రాన్స్‌లోని భారతీయులతో భేటీ కాబోతున్నానని వెల్లడించారు. వారంతా ఆయన బస చేసిన హోటల్ బయట గుమికూడి 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. వారితో మోదీ ముచ్చటించారు. ప్రవాస భారతీయులు తమ నైపుణ్యాలు, కష్టించే తత్వంతో ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారని ప్రశంసించారు.

ఈ పర్యటన నాకెంతో ప్రత్యేకం

భారత్–ఫ్రాన్స్ ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తన పర్యటనతో మరింత ఊపొస్తుందని మోదీ ఆశాభావం వెలిబుచ్చారు. ఫ్రాన్స్ బయల్దేరే ముందు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని తెలిపారు. రక్షణ భాగస్వామ్యంతోపాటు కీలక అంశాలపై ఆయనతో చర్చించబోతున్నానని వివరించారు. రాబోయే పాతికేళ్లలో ఇరు దేశాల బంధాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో చర్చిస్తామన్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై మాక్రాన్‌తో కలిసి పనిచేస్తామన్నారు. ఫ్రాన్స్ పర్యటన తనకెంతో ప్రత్యేకమని ఉద్ఘాటించారు. నేషనల్ డే పరేడ్‌లో 269 మంది జవాన్ల భారత బృందం పాలుపంచుకోనుంది. తర్వాత మోదీ శనివారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని అబూదాబీలో పర్యటిస్తారు.

26 రఫేల్ జెట్లు, 3 స్కార్పిన్ సబ్‌మెరైన్లు



న్యూఢిల్లీ: నావికా దళం కోసం 26 రఫేల్ యుద్ధ విమానాలు, 3 స్కార్పిన్ జలాంతర్గాములను ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసే ప్రతిపాదనలకు రక్షణ శాఖ గురువారం ఆమోద ముద్ర వేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని రక్షణ ఆయుధాల సేకరణ మండలి (డీఏసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుల విలువ రూ.85,000 కోట్ల దాకా ఉంటుందని అంచనా. వీటి రాకతో నావికాదళం మరింత బలోపేతం కానుంది. ప్రధాని మోదీ శుక్రవారం ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీఅలో ద్వైపాక్షిక వ్యూహాత్మక, రక్షణ సంబంధాల బలోపేతంలో భాగంగా రఫేల్, స్కార్పిన్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంటారని సమాచారం. వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి 36 ఫైటర్ జెట్లను భారత్ ఇప్పటికే కొనుగోలు చేసింది.



అనంత్‌నాగ్ జిల్లాలో అమర్‌నాథ్ యాత్రలో ముందుకుసాగుతున్న యాత్రికులు.(ఇన్‌సెట్లో) మంచు శివలింగం

వాగ్నర్ గ్రూప్ చీఫ్ హతం!

లేదంటే జైల్లో అయినా బంధించి ఉండొచ్చు: అమెరికా



వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై తిరుగుబాటు చేసిన కిరాయి సైన్యం 'వాగ్నర్ గ్రూప్' అధినేత యెవ్‌గెనీ ప్రిగోజిన్ ఇప్పుడు ఎక్కడున్నారు? రష్యాలోనే ఉన్నారా? లేక పొరుగు దేశం బెలారస్‌లో తల దాచుకుంటున్నారా? తిరుగుబాటు తర్వాత పుతిన్‌తో ఆయన సమావేశమై తన చర్యలపై వివరణ ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. అందులో నిజమెంత? ఇలాంటి ప్రశ్నలు జనం మదిలో మెదులుతున్నాయి. అయితే, పుతిన్ ఆదేశాలతో రష్యా అధికారులు ప్రిగోజిన్‌ను ఇప్పటికే అంతం చేసి ఉండొచ్చని లేక జైల్లో బంధించి ఉండొచ్చని అమెరికా మాజీ సైనిక ఉన్నతాధికారి జనరల్ రాబర్ట్ అబ్రామ్స్ చెప్పడం ఆసక్తికరంగా మారింది. పుతిన్‌తో ప్రిగోజిన్ భేటీ రష్యా ఆడిన డ్రామా అని ఆయన తేల్చిచెప్పారు. ప్రిగోజిన్‌ను ఇక బహిరంగంగా చూడటం అనుమానమేనన్నారు. వాగ్నర్ గ్రూప్ చీఫ్‌ను రష్యా అధికారులు చంపేసి అయినా ఉండాలి లేదా జైల్లో పెట్టయినా ఉండాలి లేదా ఎక్కడైనా దాచేసి ఉండాలి అని రాబర్ట్ అబ్రామ్స్ వెల్లడించారు. ప్రిగోజిన్ జూన్ 23న తన ప్రైవేట్ సైన్యంతో కలిసి పుతిన్‌పై తిరుగుబాటు చేయడం తెలిసిందే. కొందరు రష్యా సైనికాధికారుల అండతోనే ఆయన ఈ చర్యకు పాల్పడినట్లు వాదనలు వినిపించాయి. తిరుగుబాటు కొన్ని గంటల్లోనే ముగిసింది. ఆ తర్వాత జూన్ 29న ప్రిగోజిన్ తన వాగ్నర్ గ్రూప్ కమాండర్లతో కలిసి పుతిన్‌తో సమావేశమయ్యారని, ఇకపై రష్యా ప్రభుత్వానికి విధేయులుగా ఉంటామన్నట్టు వార్తలొచ్చాయి. ఉక్రెయిన్‌పై యుద్ధంలో ప్రిగోజిన్ సేవల దృష్ట్యా అతడికి పుతిన్ క్షమాభిక్ష ప్రసాదించినట్టు వార్తలొచ్చాయి.

వరదలపై ముందస్తుగా... హెచ్చరికలేవీ?

- దేశంలో 72 శాతం జిల్లాలకు వరద ముప్పు
- వీటిలో 25 శాతం జిల్లాల్లోనే ఫ్లడ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్
- సీఈఈడబ్ల్యూ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం జిల్లాల్లో తీవ్ర వరద ప్రభావానికి గురయ్యే జిల్లాలు ఏకంగా 72 శాతం ఉన్నాయి. కానీ, వరదలపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థ వీటిలో కేవలం 25 శాతం జిల్లాల్లోనే ఉంది. కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్(సీఈఈడబ్ల్యూ) అనే స్వతంత్ర విధాన పరిశోధనా సంస్థ ఒక నివేదికలో ఈ విషయం వెల్లడించింది. ఇక వరదల ముప్పు అధికంగా ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో ముందస్తు హెచ్చరికల వ్యవస్థ అంతంతేనని తేల్చింది. దేశంలో 66 శాతం మంది వరద ప్రభావిత ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. కానీ, వీరిలో సగం మంది.. అంటే 33 శాతం మంది మాత్రమే ముందస్తు హెచ్చరికల వ్యవస్థ పరిధిలో ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. అలాగే దేశవ్యాప్తంగా 25 శాతం జనాభా తుఫాన్ల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండగా, వారందరూ సైక్లోన్ వార్నింగ్ వ్యవస్థ పరిధిలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గోవా, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు సైక్లోన్ హెచ్చరికల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంలో ముందంజలో ఉన్నాయని నివేదిక తెలియజేసింది. తీవ్ర వరద ప్రభావిత రాష్ట్రాలు ఏవంటే.. ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, గోవా, బిహార్.

ముంపులో ఢిల్లీ

యమున విశ్వరూపం..

- 208.62 మీటర్లకు చేరిన నీటిమట్టం
- నీట మునిగిన రోడ్లు, ఇళ్లు
- కేజ్రీవాల్ నివాసాన్నీ చుట్టుముట్టిన వరద
- ఎర్రకోట గోడల వరకూ చేరిన వరద నీరు
- నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం



ఢిల్లీలో ఉధృతంగా ప్రవహిస్తున్న యమునా నది

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రహదారులు నదులయ్యాయి. ఇళ్లు నీట మునిగిపోయాయి. శ్మశాన వాటికలు సైతం జలమయంగా మారాయి. రోడ్లపైకి వచ్చే వీలు లేకుండాపోయింది. మొత్తంగా ఢిల్లీలో జనజీవనం స్తంభించిపోయింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో యమునా నదిలో నీటమట్టం గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఏకంగా 208.62 మీటర్లకు చేరుకుంది. దీంతో నగరంలో మరిన్ని ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద ఉధృత స్థిరంగా కొనసాగుతూనే ఉంది. మరోవైపు ప్రభుత్వ సహాయక చర్యలు ముమ్మరం చేసింది. తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల కారణంగా వజీరాబాద్, చంద్రావాల్, ఓఖ్లాలోని నీటి శుద్ధి ప్లాంట్లను ప్రభుత్వం మూసివేసింది. సాధారణ పరిస్థితులు నెలకొనగానే వీటిని పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. సహాయక చర్యల కోసం 12 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి.

విద్యాసంస్థలు, ఆఫీసులకు సెలవు

వరద తీవ్రత దృష్ట్యా నగరంలో విద్యా సంస్థలు, అత్యవసర కార్యకలాపాలు లేని ప్రభుత్వ కార్యాలయాలకు ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ గురువారం సెలవు ప్రకటించింది. ఆదివారం దాకా సెలవు అమల్లో ఉంటుందని పేర్కొంది. నగరంలోకి భారీ వాహనాల ప్రవేశంపై ఢిల్లీ ప్రభుత్వం నిషేధం విధించింది. అత్యవసర సరుకులు రవాణా చేసే వాహనాలు మినహా ఇతర వాహనాలు రాకూడదని స్పష్టం చేసింది. రోడ్లపై నీరు పొంగిపొర్లుతుండడంతో తూర్పు ఢిల్లీలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు రహదారులను అధికారులు పూర్తిగా మూసివేశారు. మరికొన్ని మార్గాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. వరదల ప్రభావం మెట్రోరైలు వ్యవస్థపైనా పడింది. ముందు జాగ్రత్త చర్యగా యమునా నదిపై ఉన్న పట్టాలపై మెట్రో రైలు వేగాన్ని గంటకు 30 కిలోమీటర్లకు పరిమితం చేశారు. యమునా బ్యాంక్ మెట్రో స్టేషన్‌లోకి ప్రయాణికులను అనుమతించడంలేదు.

పంజాబ్, హరియాణాల్లోనూ...

చండీగఢ్: పంజాబ్, హరియాణాలనూ వర్షాలు, వరద ఇంకా వదల్లేదు. జనజీవనం సాధారణ స్థితికి చేరుకోలేదు. విద్యాసంస్థలకు సెలవులను పంజాబ్ ప్రభుత్వం ఈ నెల 16 దాకా పొడిగించింది. ఢిల్లీలో యమునా నది వరదకు కారణమైన హరియాణాలోని హత్రికుండ్ బ్యారేజీ నుంచి నీటి విడుదలను తగ్గించారు. వర్షాల వల్ల రెండు రాష్ట్రాల్లో ఇప్పటిదాకా 21 మంది మృతిచెందారు.

హిమాచల్‌లో సురక్షిత ప్రాంతాలకు పర్యాటకులు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో వరదలు, కొండ చరియలు విరిగిపడడం వల్ల ఉన్నచోటే చిక్కుకుపోయిన పర్యాటకులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురువారం చందర్తాల్ నుంచి 256 మందిని తరలించారు. గత నాలుగు రోజుల్లో 60 వేల మంది పర్యాటకులను తరలించినట్లు అధికారులు చెప్పారు. కాసోల్, ఖీర్‌గంగలో 10 వేల మంది చిక్కుకుపోయారు. వారు తమ కార్లను వదిలేసి బయటకు రావడానికి ఇష్టపడడం లేదు. హిమాచల్‌లో వరదల కారణంగా చనిపోయిన వారి సంఖ్య 91కు చేరుకుంది. 14 మంది గల్లంతయ్యారు.



పాత ఉస్మాన్‌పూర్‌లో యమునా ప్రవాహంలో కొట్టుకుపోతున్న గేదెను కాపాడుతున్న స్థానికుడు

కేజ్రీవాల్ ఇంటి వద్దకు వరద నీరు

ఢిల్లీలోని కీలక ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. సెక్రెటేరియట్ ఏరియాలో ముఖ్యమంత్రితోపాటు పలువురు మంత్రుల నివాసాలు ఉన్నాయి. ఈ ప్రాంతం మొత్తం జలమయంగా మారింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్దకు వరద నీరు చేరింది. కాశ్మీరీ గేట్ బస్ టెర్మినల్ నీట మునగడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులను నిలిపివేశారు. ప్రఖ్యాత ఎర్రకోట గోడల వరకూ యమునా నది నీరు చేరుకుంది. ఇక్కడ మోకాళ్ల లోతు నీటిలో జనం నడిచి వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. రాజ్‌ఘాట్, పురానా ఖిలా సైతం జలమయమయ్యాయి. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని సుశ్రుత ట్రామా కేర్ సెంటర్ మునిగిపోవడంతో 40 మంది రోగులను మరో ఆసుపత్రికి తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, యూపీ తదితర రాష్ట్రాల్లో మరికొన్ని రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది.



కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ దక్షిణకొరియాలోని సియోల్‌లో పోరుబాట పట్టిన వేలాదిమంది కార్మికులు

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 14 । జూలై । 2023


తమకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో చేనేత కార్మికుల ధర్నా


ఉద్యోగ భద్రత కల్పించాలని ఫ్రీడంపార్క్‌లో వసతి పాఠశాలల ప్రిన్సిపాల్స్, టీచర్ల ఆందోళన

న్యూస్‌రీల్

వీసా ముగిసిన విదేశీయులను పంపించేస్తాం

శివాజీనగర: వీసా ముగిసినా అక్రమంగా నివాసం ఉంటున్న విదేశీయులను తక్షణమే పంపించేస్తామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. గురువారం విధాన పరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో విదేశీయులపై బీజేపీ సభ్యుడు గోపీనాథ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 754 మంది విదేశీయులు వీసా ముగిసినా అక్రమంగా నివాసం ఉంటున్నారని, వారిని తక్షణం పంపించేస్తామన్నారు. విదేశీయులపై అక్రమ కార్యకలాపాల విషయమై రాష్ట్రంలో 502 ఫిర్యాదు నమోదయ్యాయి. ఆఫ్రికా, నైజీరియా నుంచి వచ్చినవారే ఇటువంటి కేసుల్లో అధికంగా ఉన్నారు. వీరిపై పోలీసుల నిఘా ఉందని అన్నారు.

ఉద్యోగం తీసేస్తే ఎలా?


ధర్నా చేస్తున్న కార్మికులు

మండ్య: ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. ఇప్పుడు ఏకంగా పనిలో నుంచి తీసేశారు అని కేఆర్‌ఎస్ డ్యాం వద్దనున్న ప్రసిద్ధ బృందావన్ గార్డెన్స్ కార్మికులు మండ్య కలెక్టరేట్ వద్దకు వచ్చి ధర్నా చేశారు. వారి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాలు కూడా ధర్నాలో పాల్గొన్నాయి. అనేక సంవత్సరాల నుంచి తాము శ్రీరంగ పట్టణం తాలూకాలో కేఆర్‌ఎస్ వద్ద ఉన్న కావేరి నీటిపారుదల శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఆరుమంది కార్మికుల పని చేస్తున్నామని తెలిపారు. ఆరు నెలలనుంచి జీతాలు ఇవ్వకుండా ఇప్పుడు ఉద్యోగం తీసేసినట్లు అధికారులు చెప్పారని, మాకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ఆలయాల్లో హుండీలు ఫుల్

- మహిళలకు ఉచిత ప్రయాణాల ఎఫెక్ట్

మైసూరు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీకి ఓవైపు నష్టం వస్తున్నా, మరోవైపు మహిళలు ఆలయాలను చుట్టేస్తున్నారు. దీంతో ఆలయాలకు ఆదాయం సమకూరుతోంది. హుండీలు నిండిపోతున్నాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన మైసూరు జిల్లా నంజనగూడులో శ్రీకంఠేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం భారీగా పెరిగింది. ఏకంగా రూ. కోటి 75 లక్షలు నగదు రూపంలో వచ్చింది. గత ఏడాదికంటే దాదాపు రూ. 22 లక్షల ఆదాయం పెరిగింది. ఇక కానుక రూపంలో 65 గ్రాముల బంగారు, మూడు కిలోలకు పైగా వెండి, 64 విదేశీనోట్లు కానుకలుగా సమర్పించారని ఆలయ కార్యనిర్వహణ అధికారి జగదీశ్ కుమార్ తెలిపారు.

యదువీర్ నానమ్మ మృతి



మైసూరు: యదు వంశ యువరాజు యదువీర్ కృష్ణదత్త చామరాజు ఒడెయార్ నానమ్మ ఉమా గోపాల్‌రాజ్ అరసు (81) బుధవారం రాత్రి మృతి చెందారు. వయోభారం, అనారోగ్య కారణాలతో ఆమె మైసూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉమా రాజగోపాల్‌కు యదువీర్ తండ్రి స్వరూపానంద అరసుతో పాటు మరో ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈమె చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకా కోటె కుటుంబానికి చెందిన వారు.

టీచర్‌గా మారిన మంత్రి

మైసూరు: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి హెచ్‌సీ మహదేవప్ప గురువారం టీచర్ అవతారం ఎత్తారు. వరకోడు మొరార్జీ దేశాయి వసతి పాఠశాలకు చేరుకుని పదో తరగతి విద్యార్థులు పాఠాలు చెప్పారు. పాఠశాలలో వసతులను, గ్రంథాలయం, లేబోరేటరీని పరిశీలించారు. మరుగుదొడ్లలో పారిశుధ్యం వహించాలని సిబ్బందికి సూచించారు.

ఎమ్మెల్యే మునిరత్న, మరో ముగ్గురిపై కేసు

దొడ్డబళ్లాపురం: అక్రమ మైనింగ్ చేసున్నారన్న ఆరోపణపై బీజేపీ మాజీ మంత్రి, ఆర్‌ఆర్ నగర ఎమ్మెల్యే మునిరత్న సహా నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. బెంగళూరు ఉత్తర తాలూకా హుణసమారనహళ్లి పరిధిలో అక్రమ మైనింగ్ చేయిస్తూ సోమవారం జనావాస ప్రాంతంలో జిలెటిన్ కడ్డీలు ఉపయోగించి పేలుళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులు వచ్చాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు యలహంక తహసీల్దార్ అనిల్ అరోళకర్ పరిశీలించి ప్రైవేటు, ప్రభుత్వ స్థలంలో మైనింగ్ చేస్తున్నారని తెలుసుకుని చిక్కజాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మునిరత్న సహా పలువురిపై కేసు నమోదుచేశారు.

అప్పు యాప్‌ల ఆగడాలు



రుణం తీసుకున్న వెంటనే వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తారు



- రుణం తీసుకుంటే వేధింపులే
- రెట్టింపు వసూలు చేసి, ఆపై బెదిరింపులు
- దూర ప్రాంతాల నుంచి సైబర్ నేరగాళ్ల పంజా
- నిత్యం బాధితుల ఫిర్యాదులు

బనశంకరి: ఇటీవల రోజుల్లో ఆన్‌లైన్ ఆర్థిక వ్యవహారాల యాప్‌ల్లో చిక్కుకుని పరువు తో పాటు ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య హెచ్చుమీరుతోంది. నగరంలో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యతో మరోసారి ఈ మాఫియా ఆగడాలు చర్చనీయాంశమయ్యాయి.

యాప్ లోన్ తీసుకుంటే చాలు..

లోన్ యాప్‌ల వేధింపులపై నిత్యం వందలాది కేసులు సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. వేలాదిమంది తమ ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అందించి ఆన్‌లైన్ యాప్‌లు ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. అంతేగాక తమ మొబైల్‌లోనే నమోదు ప్రక్రియ చేస్తున్నారు. ఈ క్రమంలో వారి ఫోన్లపై యాప్ నిర్వాహకులకు పట్టు ఏర్పడుతుంది. రుణగ్రహీతల ఫోటోలను సేకరించి మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు గురి చేసి అందినంత దోచుకోవడం పరిపాటిగా మారింది. సిలికాన్ సిటీలో 2023లో లోన్‌యాప్‌ల వేధింపులపై 900 కేసులు నమోయ్యాయి.

వందలాది యాప్‌లు

వందలాదిగా నకిలీ లోన్ యాప్‌లు పుట్టుకువస్తున్నాయి. దీని వెనుక సైబర్ వంచకుల కుట్ర ఉంది. వారు ఆటోడ్రైవర్లు, కార్మికులు, స్థానికులకు డబ్బు ఆశచూపించి వారి ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలను తీసుకుని చైన్ లింక్ బిజినెస్, ఆన్‌లైన్ లోన్ యాప్‌లను సృష్టిస్తారు. ఈ యాప్‌లు ద్వారా రుణాలు తీసుకోవడం సమస్యకు ఆహ్వానం పలికినట్లే. అప్పు తీర్చినప్పటికీ ఇంకా చెల్లించాలంటూ పగలూ రాత్రీ వేధింపులకు పాల్పడతారు. దీనిపై అనేకమంది ఫిర్యాదులు చేశారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కానీ చాలామంది మోసగాళ్లు బయటి రాష్ట్రాలు, దేశాల్లో ఉండటంతో కేసులు ముందుకు సాగడం లేదని పోలీసుల వర్గాలు నిస్సహాయత వ్యక్తం చేశాయి.

15 యాప్‌లపై కేసు

తనను వేధించారని ఓ వ్యక్తి ఈజీ మనీ లోన్ యాప్, శాలరీ ప్లీజ్, క్యాష్ మీ, ప్యాకెట్ మీ, గేట్‌రుపీ, ఈజీ క్యాష్, మనీ, రైన్‌బో మనీ, మ్యాజిక్ లోన్, హోమ్ కేస్, డెల్లి క్రెడిట్, శైలి లోన్, గోమనీ, కూల్‌రుపి ట్రీ, నాన్‌రుపిలోన్ యాప్‌లపై బెంగళూరు తూర్పువిభాగం సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. పోలీసులు వంచకుల కోసం గాలిస్తున్నారు.

యాప్‌ల సొమ్ము రూ. 87 కోట్లు సీజ్

బయటి రాష్ట్రాలు, దేశాల్లో కూర్చుని నకిలీ ముఠాలను సృష్టించే వంచకుల ఆచూకీ లభించడం లేదు. లోన్‌యాప్ బ్యాంక్ అకౌంట్ల నుంచి ఇప్పటివరకు రూ.87 కోట్లు సీజ్ చేశామని సీసీబీ జాయింట్ పోలీస్ కమిషనర్ డా.శరణప్ప తెలిపారు.



అవసరంలో ఆదుకోకపోగా మరిన్ని ఇబ్బందులు

వ్యాపారికి నరకం చూపారు

ఒకే కేసులో 15 లోన్‌యాప్‌లపై బెంగళూరు తూర్పు సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. 43 ఏళ్ల వ్యాపారి ఒకరు వివిధ 15 ఆన్‌లైన్ యాప్‌లు ద్వారా మే 2వ తేదీన రూ.1.50 లక్ష రుణం తీసుకున్నాడు. వడ్డీతో కలిపి యుపీఐ ద్వారా రూ.2.60 లక్షలు చెల్లించాడు. కానీ వంచకులు వ్యాపారవేత్త ఆధార్, పాన్‌కార్డు సమాచారం, ఫోన్లోని వ్యక్తిగత సమాచారం కాజేశారు. ఫోటోలను అభ్యంతకరంగా మార్ఫింగ్ చేసి వ్యాపారికి పంపించారు. 8 మొబైల్ నంబర్ల నుంచి వ్యాపారి కుటుంబసభ్యులు, స్నేహితులకు అశ్లీల వీడియోలను పంపించి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రాష్ట్రంలో 46 వేలమంది రౌడీలు

- అసెంబ్లీలో హోంమంత్రి



శివాజీనగర: రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల్లో కొత్తగా 14,163 మందిని రౌడీషీటర్ల జాబితాలో చేర్చగా, మొత్తం 46,149 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరి సమాచారాన్ని బహిరంగపరచడం సాధ్యపడదని హోం మంత్రి జీ పరమేశ్వర్ గురువారం విధానపరిషత్‌లో తెలిపారు. రౌడీషీట్లను తెరవడం, తొలగించడం అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుంది. రౌడీషీట్‌ను ఓపెన్ చేసేటపుడు కులం, మతం చూడమని, రౌడీ అయితే షీట్ నమోదు చేస్తారని అన్నారు.

ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పిన మంత్రి, గత ఆరేళ్లలో 27,294 మందిని రౌడీషీటర్ల జాబితా నుండి తొలగించినట్లు తెలిపారు. 65 ఏళ్లు పైబడినవారు, మరణించి, అంగవైకల్యం, మానసిక అస్వస్థతకు గురైనవారిపై రౌడీ షీట్లను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. నేరాలకు పాల్పడినట్లయితే పోలీసు నియమావళి ప్రకారం సదరు వ్యక్తిపై రౌడీషీట్‌ను నమోదు చేస్తారని అన్నారు. రాష్ట్రంలో 54 జైళ్లలో సామర్థ్యం సంఖ్యకంటే అధికంగా ఖైదీలు ఉన్నారని మంత్రి తెలిపారు. 54 చెరసాలల్లో 14,237 మంది ఖైదీలను ఉంచవచ్చు, కానీ 16,053 మంది ఉన్నాని పేర్కొన్నారు.

నా ప్రాణాలకు ముప్పుంది

- మహిళా ఎమ్మెల్యే ఆవేదన



శివాజీనగర: ఇష్టానుసారంగా ఇసుకను తవ్వేస్తున్నారు, ఇదేమని ప్రశ్నిస్తే లారీ ఎక్కించి చంపేస్తామని బెదిరిస్తున్నారు.. అని అసెంబ్లీలో ఒక మహిళా ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం విధానసభలో జేడీఎస్ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ ఇసుక మాఫియా సమస్యపై మాట్లాడారు. తన నియోజకవర్గం దేవదుర్గలో అక్రమంగా ఇసుక తరలింపు అధికమైంది. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించా. కొందరు నాపై లారీ ఎక్కిస్తామని ప్రచారం చేస్తున్నారని వాపోయారు. ఇసుక విషయంలో మాజీ ఎమ్మెల్యేల అనుచరులు నాపై దౌర్జనం చేస్తున్నారు, అధికారులు నేనొక ఎమ్మెల్యే అని కూడా పట్టించుకోవడం లేదు. మట్కా దందాను బంద్ చేయడానికి పోలీసులు సహకరించటం లేదు. పోలీసులు నాకు ఒక ఎమ్మెల్యేగా గౌరవం ఇవ్వటం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే పోలీసులను బెదిరిస్తున్నారు, ఆరు నెలల్లో ఇక్కడ ఉప ఎన్నికలు వచ్చేలా చేస్తానని పోలీసులకు చెబుతున్నారు, దీంతో నాకు చాలా భయంగా ఉందని కరెమ్మ ఆవేదన వ్యక్తంచేసింది. తమ సమీప బంధువుపై ఇసుక మాఫియా దాడి చేసిందని, తమకు ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరారు. ఇటీవల ఎవరో ఒకరు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అసెంబ్లీలో నా సీటులోనే కూర్చున్నాడు, మునుముందు ఏమి జరుగుతుందోనని ఆందోళన కలుగుతోందని చెప్పారు. స్పీకర్ ఖాదర్ స్పందిస్తూ మీ భద్రతపై హోం మంత్రితో నేను మాట్లాడతాను, అసెంబ్లీలో మీ సీటులో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కూర్చోవడంపై ఆందోళన అవసరం లేదు అని చెప్పారు.

ప్రతి ఖాతాలోకి రూ.15 లక్షలు వేశారా?

- బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు
- ఆధారాలివ్వాలన్న ప్రతిపక్షం



శివాజీనగర: దేశంలో ప్రజలందరి బ్యాంకు ఖాతాల్లోకి ప్రధాని నరేంద్ర మోదీ రూ.15 లక్షలు వేస్తానని చెప్పారన్న విషయమై విధానసభలో గురువారం కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం సాగింది. మొదట కాంగ్రెస్ ఎమ్మెల్యే కోనరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఐదు గ్యారంటీలను జారీ చేసింది. అయితే ప్రధాని నరేంద్రమోదీ రూ.15 లక్షలు ప్రతి బ్యాంకు ఖాతాలోకి వేస్తామన్నారు, ఇప్పటివరకు నగదు రాలేదని విమర్శించారు. దీనిపై అభ్యంతరం తెలిపిన బసవనగౌడ పాటిల్ యత్నాళ్, కావాలని ఏదో చెప్పకండి, ప్రధాని రూ.15 లక్షలు ఖాతాల్లోకి వేస్తానని చెప్పిన ప్రసంగం కాపీ ఉంటే ఇవ్వండి. ఆయన అలా చెప్పాడని రుజువుచేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని సవాల్ చేశారు.

అరుపులతో గందరగోళం

యత్నాళ్‌కు మద్దతుకు బీజేపీ ఎమ్మెల్యేలు లేచి నిలబడి గట్టిగా మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగి గందరగోళం నెలకొంది. ఈ కోలాహలం మధ్యలోనే మాట్లాడిన మంత్రి రాజణ్ణ, ప్రధాని ఆ విధంగా మాట్లాడినట్లు దేశానికి కాదు, ప్రపంచానికే తెలుసు. బీజేపీ ఎమ్మెల్యేలు ఇలా చేయడం తగదని అన్నారు. గట్టిగా మాట్లాడితే విపక్ష నాయకున్ని చేస్తారని యత్నాళ్ అనుకొన్నారు. అలా జరగదన్నారు. మంత్రి రాజణ్ణ మాటలతో ఆవేశానికి గురైన బీజేపీ సభ్యులు, ఆధారాలు లేకపోతే మాట్లాడరాదని, ప్రధాని ఎక్కడ కూడా ఆ విధంగా చెప్పలేదన్నారు. తమరు ఆధారాలు ఇస్తే తాను నేరుగా ప్రధానిని అడుగుతానని యత్నాళ్ ప్రకటించారు. బీజేపీ సభ్యుడు బీ.వై.విజయేంద్ర మాట్లాడుతూ రూ. 15 లక్షల మాటలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు.

జంట హత్యల వెనుక సుపారి?


పట్టుబడిన జే-నెట్ కంపెనీ యజమాని అరుణ్‌కుమార్

- వ్యాపారం పడిపోవడంతో కక్ష
- ఇంటర్నెట్ కంపెనీ యజమాని అరెస్టు

బనశంకరి: సిలికాన్ సిటీలో ఐటీ కంపెనీ ఎండీ, సీఈఓల హత్య కేసు తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. వ్యాపారంలో కక్షలే ఇందుకు కారణమని తేలింది. ఏరోనిక్స్ బ్రాడ్‌బ్యాండ్ కంపెనీ ఎండీ, సీఈఓ హత్య కేసు దర్యాప్తు తీవ్రతరం చేసిన అమృతహళ్లి పోలీసులు జే-నెట్ కంపెనీ యజమాని, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరుణ్‌కుమార్ ను అరెస్ట్‌చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురు పట్టుబడ్డారు. తన కంపెనీ నష్టాల్లోకి రావడంతో ప్రధాన నిందితుడు ఫెలిక్స్ తో ఎండీ ఫణీంద్ర సుబ్రమణ్య, సీఈఓ విను కుమార్‌ల హత్యకు కుట్ర రూపొందించి సుపారి ఇచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. అమృతహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పంపా లేఔట్‌లో ఏరోనిక్స్ కంపెనీ ఉంది. ఈ కంపెనీ మార్కెట్లో పుంజుకోవడంతో జే-నెట్ కంపెనీ వ్యాపారం పడిపోవడంతో వారిని అంతమొందించాలని పథకం వేశాడు.

నెల నుంచి ప్రణాళిక

అలాగే ఉద్యోగం నుంచి తీసేశాడని ఫణీంద్ర సుబ్రహ్మణ్యపై పగతో ఉన్న ఫెలిక్స్ ఒకనెల నుంచి కంపెనీ వద్దకు అప్పుడప్పుడు ఏదో ఒక కారణంతో వచ్చి వెళుతూ భవనం లోపలకు ఎలా వెళ్లాలి, ఎలా సులభంగా బయటకు రావాలి అనేది ప్లాన్ వేసుకున్నాడు. ఆ ప్రకారం మంగళవారం సాయంత్రం ఫణీంద్రను కలిసి మీ కంపెనీలో చేరతానని కొద్దిసేపు మాట్లాడుతున్నట్లు నటించి ఒక్కసారిగా పెద్ద కత్తితో ఇద్దరు అనుచరులు సంతోష్, వినయ్‌రెడ్డితో కలిసి దాడికి దిగాడు. అడ్డుకోబోయిన వినుకుమార్ పై కూడా దాడిచేసి ఇద్దరిని హత్యచేసి కార్యాలయం వెనుక డోర్ ద్వారా పరారయ్యారు. డ్రాగర్ పట్టుకుని పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ముగ్గురు క్యాబ్ బుక్‌చేసుకుని మెజస్టిక్ కు వెళ్లి అక్కడ నుంచి రైలులో తుమకూరు జిల్లా కుణిగల్ కు చేరుకుని రూమ్‌లో మందు పార్టీ చేసుకున్నారు. ఫెలిక్స్‌కు వెన్నుదన్నుగా ఉన్న అరుణ్‌కుమార్ ను అరెస్ట్ చేయడం ద్వారా దర్యాప్తు తీవ్రంచేశారు.

శ్మశానంలో ఫెలిక్స్ గంజాయి సేవనం

ఫెలిక్స్ శివమొగ్గ జిల్లాకు చెందినవాడు కాగా ఇతని అసలు పేరు శబరీశ్, బెంగళూరు వచ్చాక పేరు మార్చుకుని సోషల్ మీడియాలో వీడియోలు చేస్తూ హల్‌చల్ చేసేవాడు. గతంలో ముంబై, కాశీలో పనిచేశాడు. ఇతడు విచిత్ర స్వభావంతో పాటు విచిత్ర వేషధారణతో ఉండేవాడు. స్మశానంలో ఉంటూ ఇతను గంజాయి సేవించే అలవాటు ఉంది. డబుల్ మర్డర్ కేసులో అరెస్టైన ముగ్గురిని అరెస్ట్‌చేసిన అమృతహళ్లి పోలీసులు కోర్టులో హాజరు పరచగా వారికి 8 రోజుల పాటు కస్టడీకి ఆదేశించింది. ప్రస్తుతం అరెస్టైన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీవ్ర విచారణ చేపడుతున్నారు.

రెడ్డి సముదాయం మరింత ఎదగాలి


వేమన, హేమారెడ్డి మల్లమ్మ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న స్వామీజీ, నాయకులు

- ప్రజాప్రతినిధుల సన్మానోత్సవంలో వక్తల పిలుపు


ప్రజాప్రతినిధులకు సన్మానం

బొమ్మనహళ్లి: రెడ్డి సముదాయం సామాజికంగా, ఆర్థికంగా ఇతర అన్ని రంగాల్లో మరింత బలంగా ఎదగాలని దేవాదాయ, రవాణ శాఖ మంత్రి రామలింగా రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని రవీంద్ర కళాక్షేత్రంలో కర్ణాటక రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సముదాయానికి చెందిన నూతన ఎమ్మెల్యేలు, మంత్రులకు సన్మానోత్సవం జరిగింది. రెడ్డి గురుపీఠం వేమనానంద స్వామి, ఇతర ముఖ్యులు వేమన, హేమారెడ్డి మల్లమ్మ చిత్రపటాలకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పేదలు, ధనికులు ఉన్నారు

మంత్రి రామలింగా రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సముదాయంలో ధనికులు ఉన్నారు. అంత కంటే ఎక్కువ మంది నిరుపేదలుకూడా ఉన్నారని, అందరూ సముదాయం అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. పర్యాటక శాఖ మంత్రి హెచ్.కే. పాటిల్ మాట్లాడుతూ ఎంతో ఘనమైన చరిత్ర కలిగినది రెడ్డి సముదాయం అని, నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు గాలి జనార్దన్ రెడ్డి, ఎస్.ఎన్. సుబ్బారెడి, ఎన్,.హెచ్., కోన రెడ్డి, ప్రకాశ్, నారా భరత్ రెడ్డి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రెడ్డిజన సంఘం అధ్యక్షుడు జయరామ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట శివారెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, నరేంద్రబాబు, ప్రొ. సదాశివరెడ్డి, పెద్దసంఖ్యలో సముదాయ ప్రజలు పాల్గొన్నారు.

అక్కడ సుస్తీ చేస్తే అంతే

- జోలె కట్టి ఎత్తుకుపోవాలి


రోగిని జోలెలో తీసుకెళుతున్న దృశ్యం

యశవంతపుర: రాష్ట్రంలో కొన్ని కొండ ప్రాంతాల్లో జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళ్లాలంటే తిప్పలు తప్పవు. కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లాలి, గర్భిణులు, వృద్ధులైతే జోలె కట్టి ఎత్తుకెళ్లాలి. ఇలాంటి ఘటన చిక్కమగళూరు జిల్లా కళస తాలూకా సంసె గ్రామంలో జరిగింది. ఈచలహొళెకి చెందిన శేషమ్మ అనే మహిళ బుధవారం అనారోగ్యానికి గురైంది. కుటుంబసభ్యులు జోలె కట్టి మూడు కిలోమీటర్ల దూరం మోసుకెళ్లి అక్కడి నుంచి కళసకు ఆటోలో తీసుకెళ్లారు. ఈచలహొళెలో 10 గిరిజన కుటుంబాలున్నాయి. అక్కడ వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. రోడ్డు మార్గం లేకపోవడంతో బయటి ప్రపంచంలో సంబంధాలు ఉండవు. కళకోడి నుంచి ఈచలహొళె గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని ఏళ్ల నుంచి డిమాండ్ ఉన్న ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

వివాహిత దారుణ హత్య

- ప్రియునితో జీవిస్తోందని భర్త కిరాతకం?


ప్రియుడు హరీష్‌తో ఆరతి

దొడ్డబళ్లాపురం: భర్త చేతిలో వివాహిత హత్యకు గురైన సంఘటన దొడ్డ తాలూకా కోళూరు గ్రామంలో చోటుచేసుకుంది. కోళూరు గ్రామంలో అద్దె ఇంట్లో నివసిస్తున్న ఆరతి (27) హత్యకు గురైన మహిళ. మృతురాలు తన భర్తను వదిలి కుమార్తెను(5) తీసుకుని హరీష్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అయితే ఆమె చిరునామా తెలుసుకున్న భర్త, హరీష్ ఇంట్లో లేని సమయంలో వచ్చి హత్య చేసి కుమార్తెను తీసికెళ్లాడు. ఆమెను అత్యంత దారుణంగా కత్తితో పొడిచి హత్య చేయడంతో ఇల్లంతా రక్తంతో నిండిపోయింది. రక్తపు మడుగులో ఉన్న ఆరతిని చూసి ప్రియుడు హరీష్ గ్రామం వదిలి పరారయ్యాడు. దొడ్డ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శశిధర్

రాయచూరు రూరల్: అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జెడ్పీ సీఈఓ శశిధర్ పేర్కొన్నారు. ఆయన గురువారం జెడ్పీ సభాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని సూచించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రధాన న్యాయమూర్తి దయానంద్ ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో ఎస్పీ నిఖిల్, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్, జిల్లా ఆరోగ్య శాఖాధికారి సురేంద్ర బాబు, పశు సంవర్ధక శాఖాధికారి అశోక్, బాలల సంరక్షణాధికారి మన్సూర్‌లున్నారు.

తల్లిని హత్య చేసిన కొడుకు

మైసూరు: మద్యం మత్తులో యువకుడు కన్నతల్లిని హత్య చేసిన సంఘటన కొడగు జిల్లాలోని కోడ్లిపేట దగ్గర కట్టిపుర హాడిలో జరిగింది. తల్లి లలిత (45)ను కుమారుడు రాజశేఖర్ (22) మద్యం మత్తులో హత్య చేశాడు. బుధవారం రాత్రి పీకల దాక మద్యం తాగి వచ్చి తల్లితో గొడవ పడ్డాడు. విచక్షణ కోల్పోయిన అతడు ఇంటిలో ఉన్న ఇనుపరాడ్ తల్లి తలపై దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. శనివారసంతె పోలీసులు పరిశీలించి కిరాతకున్ని అరెస్టు చేశారు.

ముద్రాధారణకు శ్రీకారం



భక్తులకు ముద్రాధారణ చేస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: నగరంలో మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగళ్ ముద్రాధారణకు శ్రీకారం చుట్టారు. గురువారం జవహర్ నగర్‌లోని మంత్రాలయ మఠంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ముద్రాధారణ జరిపారు.

చెక్కుల అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి నాగేంద్ర, మేయర్

సాక్షి,బళ్లారి: ఇటీవల కౌల్‌బజార్, ఆంధ్రాళ్‌కు చెందిన 9 మంది హొసపేటె సమీపంలోని వడ్డళ్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబాలకు మంత్రి నాగేంద్ర గురువారం స్వయంగా బాధిత కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించి మృతుల కుటుంబాలకు పరిహారాన్ని ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. ఈసందర్భంగా మేయర్ త్రివేణి, పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

హాస్టల్ పరిశీలన: నగరంలోని బీడీఏఏ ఫుట్‌బాల్ క్రీడా మైదానాన్ని, క్రీడా వసతి నిలయాన్ని మంత్రి నాగేంద్ర పరిశీలించారు. గురువారం ఆయన ఆకస్మికంగా జిల్లాధికారి పవన్‌కుమార్ తదితరులతో కలిసి ఫుట్‌బాల్ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతి గురించి ఆరా తీశారు. భోజనాలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుతున్నాయా లేదా అని క్రీడాకారులు, విద్యార్థులను వాకబు చేశారు. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈఓ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో అధికారిణికి ఘనంగా సన్మానం



మహబూబీని సన్మానిస్తున్న గ్రామస్తులు

రాయచూరు రూరల్: నగర అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) మహబూబీని జిల్లాలోని దేవదుర్గ తాలూకాలోని ఆమె స్వగ్రామం అరకేరాలో బుధవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. అరకేరా గ్రామస్తురాలైన ఆమె ప్రథమంగా బుద్దిన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా, విజయపురలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. కేఏఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఆమె యాదగిరి, కలబుర్గి, బెంగళూరుల్లో తహసీల్దార్‌గా, రెండేళ్ల పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారిణిగా విధులు నిర్వహించారు. ఆమె మరింత ఉన్నత స్థానాలను అలంకరించి స్వగ్రామానికి, జిల్లాకు మంచి పేరు తేవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

కలుషిత నీరు తాగి 30 మందికి అస్వస్థత

సాక్షి,బళ్లారి: చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా నాగసముద్రంలో కలుషిత నీరు తాగి 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. గురువారం గ్రామంలో జలజీవన్ మిషన్ పైపుల్లో డ్రైనేజీ నీరు కలిసి సరఫరా కావడంతో పలువురు ఆ నీరు తాగి అనారోగ్యం బారిన పడ్డారు. వెంటనే వారికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఊరించి..ఉసూరుమనిపించి..

- అరకొర వర్షాలకే విత్తన సాగుకు శ్రీకారం చుట్టిన రైతన్నలు
- జిల్లాలో ఇప్పటి వరకు 9268 హెక్టార్లలో విత్తన ప్రక్రియ పూర్తి
- మరో 1.66 లక్షల హెక్టార్లలో వర్షం కోసం ఎదురు చూపులు



నాగలి పట్టి పొలాన్ని పదును చేసుకుంటున్న రైతన్నలు



మటమారి వద్ద పొలంలో మొక్కలకు చెంబుతో నీరు పోస్తున్న కూలీలు

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వరుణుడు దోబూచులాడుతుండటంతో సకాలంలో విత్తన సాగు చేయడానికి రైతన్నలకు అనుకూలించడం లేదు. అష్టకష్టాలతో దుక్కి దున్ని విత్తనసాగు చేయడానికి సిద్ధం చేసుకున్న రైతులకు వారం రోజుల నుంచి జిల్లాలో అక్కడక్కడ కురుస్తున్న అరకొర వర్షాలకే విత్తన సాగులో కొందరు రైతులు నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 1.75 లక్షల హెక్టార్లలో ఖరీఫ్‌లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 9,268 హెక్టార్లలో మాత్రమే విత్తనం సాగు చేశారు. జిల్లాలోని సండూరు, సిరుగుప్ప, బళ్లారి, కురుగోడు తాలూకాల్లో మొక్కజొన్న 2800 హెక్టార్లు, కంది 250 హెక్టార్లు, సన్‌ఫ్లవర్ 300 హెక్టార్లు, పత్తి 3000 హెక్టార్లు, సజ్జలు 355 హెక్టార్లు, వర్షాధారిత భూముల్లో సాగు చేసే వరిని 1300 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఇంకా దాదాపు ఒక లక్ష 66 వేల హెక్టార్ల భూములు మొత్తం బీడుగా కనిపిస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలోని వర్షాధారిత సాగు భూములు మొత్తం విత్తన సాగు ప్రక్రియ పూర్తి చేశారు.

వరుణుడి దోబూచులాట

తుంగభద్ర ఆయకట్టు భూముల్లో చురుకుగా వ్యవసాయ పనులు ఒక వైపు, వరి నాట్లు కూడా మరో వైపు జరుగుతుండేవి. అయితే అలాంటి వాతావరణం కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి మేఘాలు ఊరిస్తున్నాయే కాని సరైన వర్షం జిల్లా వ్యాప్తంగా కురవకపోవడంతో విత్తన సాగు చురుకుగా సాగడం లేదు. తుంగభద్ర డ్యాంలోకి కూడా తగినంత ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఆయకట్టు పరిధిలో వరినారు పోసుకున్న రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. వర్షాలు బాగా కురవాలని రైతన్నలు ప్రార్థనలు, పూజలు చేస్తున్నారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విత్తనసాగు చురుకుగా సాగడం లేదన్నారు. వర్షాలు పూర్తి స్థాయిలో కురవక పోవడంతో అక్కడక్కడ మాత్రమే విత్తనసాగు ప్రక్రియ జరుగుతోందన్నారు. ఇంకా ఖరీఫ్ అదును ఉందని, వర్షాలు వస్తాయనే నమ్మకం ఉందని, రైతులు అధైర్యపడకుండా ఉండాలన్నారు.రైతులకు కావాల్సిన రసాయనిక ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు.

కళ్యాణ కర్ణాటకలో కరుణించని వరుణుడు

రాయచూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 45 రోజులు కావస్తున్నా వరుణ దేవుడు కరుణించక పోవడంతో రైతులు బిక్కముఖం వేసుకొని ఆకాశం వైపు వర్షం రాక కోసం ఎదురు చూస్తున్నారు. కళ్యాణ కర్ణాటకలో మేఘమాలా జాడ లేక పోవడంతో రైతులకు కరువు పరిస్థితి ఏర్పడింది. కళ్యాణ కర్ణాటకలోని కొప్పళ, రాయచూరు, యాదగిరి, కలబుర్గి, బీదర్ జిల్లాల్లో ఖరీఫ్‌లో వానలు కురువక పోవడంతో కళ్యాణ కర్ణాటకలో 60 వేల హెక్టార్లలో, రాయచూరు జిల్లాలో 6.4 లక్షల హెక్టార్లలో రైతులు విత్తనం వేయక పొలాలు బీళ్లుగా మారాయి. రైతులు కురిసిన తొలకరి వానలకు ఐదు వేల హెక్టార్లలో మాత్రమే విత్తనం చేశారు. జూన్‌లో చెదురుమదురు వానలు పడగా రైతులు పత్తి, కంది, సూర్యకాంతి, సజ్జ, వేరుశనగ పంటలు వేసుకున్నారు. సరైన వానలు లేక పంటలు వాడుముఖం పట్టడంతో పొలంలో రైతులు నీళ్లను నీటి ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి చెంబులతో మొక్కలకు నీరు పోసి వాటిని కాపాడుకొంటూ కష్టపడుతున్నారు. మొక్కలకు నీరు పోయడానికి కూలీలకు రోజుకు రూ.300 కూలీ చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. ఒక్కొక్క మొక్కకు గ్లాసుడు నీరు పోస్తున్నట్లు వాపోయారు.

విధానసౌధ ఉన్నది అందుకు కాదు: సీటీ రవి

దొడ్డబళ్లాపురం: కెంగల్ హనుమంతయ్య విధానసౌధ కట్టించింది నమాజ్ చేయడానికి కాదని మాజీ మంత్రి సీటీ రవి అన్నారు. దొడ్డ పట్టణంలో బీజేపీ పార్టీ కార్యక్రమంలో హాజరైన ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ బీఎం ఫారూక్ విధాన సౌధలో నమాజ్ చేసుకోవడానికి సర్కారుకు అనుమతి అడగడంపై సీటీ రవి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సిద్రాముల్లాఖాన్ అనుమతి ఇస్తారనే ధైర్యంతోనే ఫారూక్ ఆ విధంగా అడిగారని హేళన చేశారు. నేడు నమాజ్‌కు అనుమతి అడుగుతారని, రేపు ఖబరస్తాన్‌కూ చోటు కావాలంటారు, ఇస్తారా అని దుయ్యబట్టారు. విధానసౌధలో కాంగ్రెస్ ప్రభుత్వం టిప్పు జయంతి ఆచరించడం వల్లే ఫారూక్ ఆ ధైర్యంతో అడిగారన్నారు.

యువ కానిస్టేబుల్ ఆత్మహత్య



మల్లికార్జున రుద్రాపుర(ఫైల్)

హుబ్లీ: ఓ యువ పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హుబ్లీ బెండిగేరిలోని దొడ్డమని కాలనీలో గురువారం వెలుగు చూసింది. మల్లికార్జున రుద్రాపుర(30) మృతుడు. ఈయన బెళగావి జిల్లా సంగొళ్లి గ్రామ నివాసి. నగరంలోని బెండిగేరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించేవాడు. తాను నివాసం ఉన్న ఇంట్లోనే ఉరి వేసుకున్న స్థితిలో మృతదేహం లభించింది. ఘటనకు కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు బెండిగేరి పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాద్ధాంతం వద్దు



ఎం.జ్యోతి

గంగావతి: అంజనాద్రి బెట్ట ప్రాంతాన్ని రాష్ట్ర అసెంబ్లీలో మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు, యలబుర్గా ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి డ్రగ్ హబ్‌గా ప్రకటించడాన్ని రాజకీయం చేయడం తగదని కొప్పళ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.జ్యోతి పేర్కొన్నారు. రాయరెడ్డి అసెంబ్లీలో ఆ ప్రాంతంలో జరుగుతున్న అనైతిక కార్యకలాపాల గురించి ప్రస్తావించారన్నారు. దీనికి రాజకీయ రంగం పులిమి రాద్ధాంతం చేయడం సరికాదని ఆమె అన్నారు. ఎవరైతే అక్కడ ఈ అనైతిక కార్యకలాపాలు, రిసార్ట్‌లు నడుపుతున్నారో వారే రాయరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారన్నారు. దీన్ని ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. పార్టీ భేదభావాలు విడిచి ఈ విషయాన్ని రాజకీయంగా రాద్ధాంతం చేయడాన్ని ఆపాలని ఆమె కోరారు.

కూరగాయల ధరలపై నిరసన



రాయచూరు రూరల్: పేదలు నిత్యం వినియోగించే కూరగాయల ధరలు పెరగడంపై జిల్లా కాంగ్రెస్ మహిళా నేతలు ఆందోళన చేపట్టారు. గురువారం ఉస్మానియా కూరగాయల మార్కెట్ వద్ద రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ప్రేమలత మాట్లాడారు. పెరిగిన నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో రాష్ట్ర సభ్యురాలు శశికళ, పద్దమ్మలున్నారు.

పాత చట్టం అమలు చేస్తే పోరాటం



మాట్లాడుతున్న షణ్ముఖ గురికార

హుబ్లీ: ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్‌లో ప్రతిపాదించిన, ప్రస్తుతం అమల్లో ఉన్న ఏపీఎంసీ చట్టాన్ని ఉపసంహరించి ఆ స్థానంలో పాత చట్టాన్ని తెస్తామన్నారు. అది రైతు వ్యతిరేకమైనందున ఇదే చట్టమే కొనసాగించాలి, ఈ చట్టాన్ని రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని రైతు మోర్చా ఉపాధ్యక్షుడు షణ్ముఖ గురికార తెలిపారు. నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఏపీఎంసీ చట్టాన్ని రద్దు చేయరాదన్నారు. ఒకవేళ ఈ చట్టాన్ని రద్దు చేస్తే బీజేపీ రైతు మోర్చా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతుందన్నారు. అశాస్త్రీయంగా విద్యుత్ ధరలు పెంచడం వల్ల చిన్నపరిశ్రమలకు ఎంతో ఎదురుదెబ్బ తగిలిందన్నారు. కాటన్ పరిశ్రమలు, రైస్ మిల్లుతో పాటు చిన్న పరిశ్రమలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటాయన్నారు. వీటి మనుగడకు విద్యుత్ ధరలు తగ్గించాలని కోరారు. రైతు పిల్లలకు విద్యానిధి పథకం రద్దు చేసి పేద రైతు పిల్లలకు అన్యాయం చేసిందన్నారు. గోవధ, జంతువుల సంరక్షణకు ప్రతి జిల్లాలో గోశాలలను ప్రారంభిస్తే కాంగ్రెస్ సర్కారు వాటిని రద్దు చేసి గోహంతకులకు అనుకూలంగా ఉందని మండిపడ్డారు. భూసిరి, కిసాన్ సన్మాన్, రైతు వ్యవసాయ భూమి విక్రయ చట్టం రద్దు చేయడం, నీటి పారుదల పథకాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. విలేకరుల సమావేశంలో సంఘం నేతలు బసవరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హంపీలో జీ-20 షెర్పా సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న అమితాబ్ కాంత్

హొసపేటె: హంపీలో జీ-20 సదస్సు 3వ షెర్పా సమావేశం గురువారం సాయంత్రం ప్రారంభమైందని భారత జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ తెలిపారు. గురువారం హంపీ ఆరెంజ్ కౌంటీలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే రాజస్థాన్‌లోని ఉదయపూర్, కేరళలోని కుమారకోమ్‌లో జరిగిన షెర్పా సమావేశాలు విజయవంత అయ్యాయన్నారు. జీ-20 దేశాల అధినేతలు, ఆర్థిక మంత్రులు, ఆర్థిక సంస్థల అధిపతులు సమావేశాల్లో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్లోబల్ వార్మింగ్, టెర్రరిజంపై యుద్ధం గురించి కూడా చర్చిస్తామన్నారు. ఆర్థిక శ్రేయస్సు, రక్షణ రంగం, అభివృద్ధి, ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనార్థల నివారణపై, ఈ శతాబ్దపు ఆర్థిక శ్రేయస్సు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలతో సహా పలు అంశాలపై చర్చిస్తామని, ప్రపంచ వ్యాప్తంగా మూలధన పెట్టుబడులను ప్రోత్సహించడం కీలకమైన అంశం అని తెలిపారు. ఈ సందర్భంగా అనీష్‌కుమార్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో పేరుకున్న వ్యర్థాల కుప్ప



పాత డైరెక్టర్ కార్యాలయం పక్కన పేరుకున్న యంత్రాలు, వాహనాలు, వస్తువుల గుట్ట

బళ్లారి రూరల్: పాత ఒక రోత, కొత్త ఒక వింత అన్న సామెత విమ్స్ పాలక మండలికి బాగా వంట పట్టినట్టుంది. లక్షలు ఖరీదు చేసే యంత్రమైనా, చక్రం విరిగిన వీల్‌చెయిరైనా వ్యర్థాల కుప్పలోకి చేరాల్సిందే. ఇలా లఘు వాహనాలు, ఇనుప కుర్చీలు, రోగుల పడకలు, ఈసీజీ యంత్రాలు, స్కానింగ్ మిషన్లు ఒక్కటేమిటి ఏదైనా సరే చిన్న రిపేరీ వస్తే చాలు వ్యర్థాల కుప్పకు చేరిపోతున్నాయి. ఇదెక్కడో కాదు సుమా..రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన బళ్లారి విమ్స్ వైద్య కళాశాల ఆసుపత్రిలోనే. ఆసుపత్రిలో యంత్రాలు ఏవైనా చెడిపోతే మరమ్మతు చర్యలు చేపట్టడం లేదు. వెంటనే చెడిపోయిన వస్తువులు, యంత్రాల స్థానంలో లక్షలు వెచ్చించి కొత్తవి తెప్పించుకుంటున్నారు. ఇందువల్ల లక్షలాది రూపాయలు వృథా అవుతోంది. భరించేది ప్రభుత్వమే కదా అనే ధోరణి సిబ్బంది, అధికారుల్లో పెరిగిపోయింది. వ్యర్థాలన్నీ పాత డైరెక్టర్ కార్యాలయం పక్కన పడవేయడంతో రోబో సినిమాలో వ్యర్థాల గుట్టలా మారింది. వీటిని చూసిన ప్రజలు, రోగులు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యానికి నిదర్శనమని వాపోతున్నారు.

అక్రమ మైనింగ్ నిషేధానికి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించి అక్రమంగా గనుల తవ్వకాలను సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేపీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం గనుల శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాలూకాలోని నరసాపురం, కేబీ హొసహళ్లి, వక్కలేరి ఫిర్కా గుడ్డణపుర గ్రామాల్లో ప్రభుత్వ నియమ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి కొందరు అక్రమంగా గనులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు, రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే అక్రమ గనుల తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు టి.వెంకటేష్, సూర్యనారాయణ, వి.నారాయణ రెడ్డి, టి.కృష్ణేగౌడ తదితరులు ఉన్నారు.

ఎన్నో సమస్యలను పరిష్కరించాం



మాట్లాడుతున్న వెంకటేశప్ప

మాలూరు: తాలూకాలో దళిత నేత తిమ్మయ్య నాయకత్వంలో పలు సమస్యలను పరిష్కరించినట్లు దళిత నాయకుడు కె వెంకటేశప్ప తెలిపారు. గురువారం తాలూకాలోని టేకల్‌లో నిర్వహించిన ఫిర్కా స్థాయి పదాధికారుల ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాలూకాలో దళిత సంఘర్ష సమితి(డీఎస్ఎస్) సంఘం వటవృక్షమై దళితుల సమస్యల పరిష్కారానికి తిమ్మయ్య ఎంతో శ్రమించారన్నారు. తిమ్మయ్య పోరాటంతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో తిమ్మయ్య, సమన్వయ సంచాలకుడు హుణసనకోట బాబు, మనోహర్, కె వెంకటేష్, డాక్టర్ జి హనుమప్ప, పిచ్చళ్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి విశ్వవిద్యాలయాల కృషి



డాక్టరేట్ గ్రహీతలను సత్కరించిన గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, వీసీ సిద్ధూ అలగూరు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించిన మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

- గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్

బళ్లారిటౌన్: దేశ ప్రగతికి విశ్వవిద్యాలయాలు శ్రమించాలని రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ఉత్తమ విద్యను బోధించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమన్నారు. విశ్వవిద్యాలయాలు విద్య, సాహిత్య, సామాజిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విభాగాల్లో 53 పతకాలు సాధించిన 42 మంది విద్యార్థులను గోల్డ్‌మెడల్స్‌ను అందజేసి సత్కరించారు. ఈ ఏడాది వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించిన ముగ్గురికి డాక్టరేట్‌లను అందజేశారు. వీరిలో హిరేహాళ్ ఇబ్రహీం సాబ్, కవితా మిశ్రా స్వయంగా హాజరై స్వీకరించారు. తొలుత వర్సిటీ ఆవరణలో నిర్మించిన వివిధ కట్టడాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్రతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసర్చ్ అధ్యక్షులు జేకే.బజాజ్, వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిద్ధు అలగూరు, మౌల్యమాపన రిజిస్ట్రార్ రమేష్ ఓలేకార్, రిజిస్ట్రార్ ఎస్‌సీ.పాటిల్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

సాక్షి,బళ్లారి: వీఎస్కేయూ స్నాతకోత్సవం తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి కలిశారు. గురువారం ఆయన గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కాసేపు ముచ్చటించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ఇతర నాయకులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

అపరిశుభ్రత పట్టదా?



రోడ్డు పక్కన పేరుకున్న చెత్తకుప్పను పరిశీలిస్తున్న కలెక్టర్ అక్రం పాషా



పార్కులో వాహ్యాళికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అక్రం పాషా

- నగర పర్యటనలో కలెక్టర్ ఆగ్రహం

కోలారు: నగరంలోని 12 వార్డులో గురువారం కలెక్టర్ అక్రం పాషా పర్యటించి శుభ్రత, ఇతర సమస్యలపై వార్డు ప్రజల గోడును ఆలకించారు. వార్డులో చెత్తను తొలగించకపోవడంపై, రోడ్డు పక్కన, డ్రైనేజీల్లో చెత్త కుప్పలుగా పడి ఉండడాన్ని చూసి నగరసభ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలను కూడా సరిగా శుభ్రం చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చారు. చెత్తను తరలించకపోతే, డ్రైనేజీలను శుభ్రం చేయకుంటే దోమలు పెరిగి రోగాలు ప్రబలవా? అని నిలదీశారు,. ఎన్ని రోజులకోసారి చెత్తను తొలగిస్తున్నారు? అని పారిశుధ్య సిబ్బందిని ప్రశ్నించారు. చెత్తను ఎప్పటికప్పుడు తీయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పక్కనే ఉన్న ఉద్యానానికి వాహ్యాళికి వచ్చిన వారితో వార్డులో సమస్యల గురించి తెలుసుకున్నారు. నగరసభ కమిషనర్ శివానంద, రెవెన్యూ శాఖ అధికారి అనిల్, ఇంజినీర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓకు అభినందన



నూతన సీఈఓను అభినందిస్తున్న దృశ్యం

కోలారు: జిల్లా పంచాయతీ నూతన ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ)గా బాధ్యతలను స్వీకరించిన పద్మ బసవంతప్పను జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు గురువారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా సీఈఓ పద్మ బసవంతప్ప మాట్లాడుతూ అందరం కలిసి జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరిస్తానన్నారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాధ్యక్షుడు ఎన్ శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు రవిచంద్ర, మాజీ అధ్యక్షుడు కెఎన్ మంజునాథ్, కేబీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షులుగా శివకుమార్

గంగావతి: రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులుగా శివకుమార్ ఎంపికయ్యారు. క్లబ్ నూతన కార్యదర్శిగా దీపక్‌కుమార్, 11 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని గురువారం ఎంపిక చేశారు. నూతన అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న శివకుమార్ మాట్లాడుతూ తన అధికార అవధిలో నిస్వార్థ సేవకు అంకితమైన రోటరీ క్లబ్ అభివృద్ధికి కృషితో పాటు క్లబ్ విధానాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు.

సరైన చికిత్సతో క్షయ దూరం

కోలారు: సరైన చికిత్స ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ అక్రం పాషా ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. గురువారం తమ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన క్షయ రోగ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండడానికి కార్బోహైడ్రేట్‌లు, న్యూట్రిన్‌లతో కూడిన ఆహార పదార్థాలను, పండ్లు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. మధుమేహం, క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు మరింత ముందు జాగ్రత్త వహించాలన్నారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ డాక్టర్ జగదీష్, సర్జన్ డాక్టర్ విజయకుమార్, ఆర్‌సీహెచ్ అధికారి విజయకుమారి, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సంఘం విఫలం



కోలారు: సమస్యల పరిష్కారంలో జిల్లా ఒక్కలిగుల సంఘం విఫలమైందని ముళబాగిలు ఒక్కలిగుల అభివృద్ధి మండలి ప్రతిష్టాన తాలూకా అధ్యక్షుడు, మీడియా ఇన్‌చార్జి రోహన్‌గౌడ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘం ఒక్కలిగుల సమస్యలపై ఏనాడూ సరిగా స్పందించలేదన్నారు. జిల్లా స్థాయిలో నాడప్రభు కెంపేగౌడ జయంతి విషయంలో నిర్వహణ లోపం వల్ల సంఘం సభ్యులకు సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. రాజకీయ రహితంగా సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. రాష్ట్ర ఒక్కలిగుల అభివృద్ధి మండలి డైరెక్టర్ కుమార్, సంఘం పదాధికారులు సతీష్, మహేష్ కుమార్, లింగరాజ్, మహిళా సంఘం అధ్యక్షురాలు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెస్కాం సిబ్బందిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని విచారించి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

శ్రీనివాసపురం: విద్యుత్ బిల్లు వసూలు కోసం వెళ్లిన బెస్కాం సిబ్బందిపై దాడి చేసిన ఘటన పట్టణంలోని గఫార్‌ఖాన్ మొహల్లాలో గురువారం జరిగింది. ఉదయం విద్యుత్ బిల్ వసూలు కోసం వెళ్లిన సిబ్బంది వేణుగోపాల్‌పై కాలనీకి చెందిన సర్దార్ కుమారుడు సాధిక్ బాషా దాడి చేసి గాయపరిచాడు. విద్యుత్ బిల్లు ఎక్కువ రావడానికి సంబంధించి సర్దార్ సిబ్బంది వేణుగోపాల్‌తో గొడవ పడ్డాడు. ఆ సమయంలో సర్దార్ కుమారుడు సాధిక్ ఇంటి నుంచి బయటకు వచ్చి వేణుగోపాల్‌పై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. మరో సిబ్బంది మోహన్ గాయపడిన వేణుగోపాల్‌ను ఆస్పత్రికి తరలించాడు. ఘటనపై బెస్కాం సిబ్బంది ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

అదుపుతప్పిన కంటైనర్



డివైడర్ దాటి పక్క రోడ్డులోకి వెళ్లిన కంటైనర్

దొడ్డబళ్లాపురం: బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై పెద్ద ప్రమాదం తప్పింది. గురువారం చెన్నపట్టణ తాలూకా సంకలగెరె గేట్ వద్ద ఎక్స్‌ప్రెస్‌వే పై భారీ కంటైనర్ ఒకటి అదుపుతప్పి ప్రయాణిస్తున్న మార్గం నుంచి డివైడర్‌ను ఢీకొట్టుకుని పక్కరోడ్డులో ఎదురుగా దూసుకుపోయింది. అదృష్టవశాత్తు కంటైనర్ ఏ వాహనాన్నీ ఢీకొనలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ భయానక దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీలో రికార్డయ్యాయి.

16న తెలంగాణ బోనాల జాతర



బొమ్మనహళ్లి: కర్ణాటక తెలంగాణ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఆదివారం తెలంగాణ బోనాల జాతర నిర్వహిస్తామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సాక్షితో తెలంగాణ బోనాల జాతర నిర్వహకురాలు రేవతి మాట్లాడుతూ... ఈనెల 16న నగరంలోని కళ్యాణ నగర ఓం శక్తి దేవాలయంలో జాతర నిర్వహిస్తామని, తెలుగు వారితో పాటు కన్నడ ప్రజల కూడా పాల్గొని జాతరను విజయవంతం చేయాలన్నారు. సకాలంలో వర్షాలు పడాలని, సమృద్ధిగా పంటలు పండాలని బోనాలు నిర్వహిస్తామని తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



క్రీడాజ్యోతిని అందిస్తున్న మాజీ క్రీడాకారుడు ఆర్ అశోక్‌కుమార్

గౌరిబిదనూరు: విద్యాశాఖ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని మాజీ క్రీడాకారుడు ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం నగరంలోని నేతాజీ క్రీడా మైదానంలో తొండేబావి హోబళీ స్థాయి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. లక్ష్మీరాజ్యం మహిళా సంఘం అధ్యక్షురాలు కృపా, దైహిక శిక్షకులు రమేశ్, గంగాధరయ్య, హనుమంతరాయప్ప, వైకె ప్రకాశ్, చంద్రగుండయ్య, రవిశంకర్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఇరువర్గాల ఘర్షణ



గొడవలో నిర్మానుష్యంగా జాతర ప్రదేశం

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో జరిగిన ఆలయ జాతరలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. సూళగిరి తాలూకా బేరికె సమీపంలోని సీకలపల్లి గ్రామంలో నెల రోజుల క్రితం గ్రామదేవత గంగమ్మ ఆలయానికి కొత్తగా నిర్మించి కుంభాభిషేకోత్సవం జరిపించారు. బుధవారం గ్రామదేవత జాతరను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సమయంలో రాత్రి గ్రామదేవతల ఊరేగింపు జరపగా ఆదిద్రావిడ ప్రజలు అమ్మవారిని మోసేందుకెళ్లగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. ఇద్దరికి గాయాలయ్యాయి. బేరికె పోలీసులు, సూళగిరి తహసీల్దార్ తదితరులు వచ్చి రాజీ చర్చలు జరిపారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందివ్వాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీరేంద్ర హెగ్డే

మండ్య: గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్యం అందివ్వాలని ధర్మస్థల ధర్మాధికారి డాక్టర్ వీరేంద్ర హెగ్డే అన్నారు. మండ్య నగరంలోని అశోకనగర్‌లో ఉన్న ఆస్పత్రిలో సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీతో రోగాలను కనిపెట్టడానికి యంత్రాలు వచ్చాయని, మంచి ఔషధాలు కూడా ఉన్నాయని, ఇవన్నీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

వెల్‌కమ్ డ్రాగన్

- కరువు సీమలో కొత్త పంట డ్రాగన్ ఫ్రూట్
- పరిచయం చేసిన ఆదర్శ రైతు నారాయణగౌడ
- ఏడాదికే దిగుబడి ప్రారంభం
- ఒకసారి మాత్రమే పెట్టుబడి
- 30 ఏళ్ల వరకు పంట



తోటలో రైతు నారాయణగౌడ



పూత పూసిన మొక్కలు

తుమకూరు: ఒకప్పుడు విదేశాలు, ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ సాగు రెండేళ్లుగా దక్షిణాదికి కూడా విస్తరించిది. ఈక్రమంలో కర్ణాటకలోని కరువు సీమ తుమకూరు జిల్లాలో ఓ రైతు ఈ పంటను సాగు చేసి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచాడు. సాధన చేస్తే అసాధ్యమైనది ఏదీ లేదని నిరూపించాడు. మధుగిరి తాలూకా కొడిగెనహళ్లి హోబళి కాళేనహళ్లి గ్రామానికి చెందిన కేఎస్ నారాయణ గౌడ తనకున్న 9.5 ఎకరాల పొలంలో వివిధ పంటలను సాగు చేసి ఇప్పటికే రైతులు, అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాడు. సంప్రదాయ పంటల స్థానంలో కొత్త పంట సాగు చేయాలని భావించి ఈ ప్రాంత రైతులకు పరిచయం లేని డ్రాగన్ ఫ్రూట్‌ను ఎంచుకున్నాడు. ఆ పంట సాగుపై పూర్తి సమాచారం సేకరించాడు. ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకున్నాడు.

రెండున్నర ఎకరాల్లో సాగు

తనకున్న రెండున్నర ఎకరాల్లో 1,200 గుంతలను తవ్వి 1,200 స్తంభాలను నాటి ఒక్కో స్తంభానికి నాలుగు మొక్కలను నాటాడు. శిరా తాలూకా గోమారనహళ్లి నుంచి 4,800 మొక్కలను తీసుకొచ్చి నాటాడు. పంటసాగుకు రూ. 20 లక్షలు వ్యయం చేశారు. ఏడాది గడిచేసరికి కాపు కాయడం మొదలైంది. తొలి ఏడాది సుమారు 800 కేజీల దిగుబడి లభించింది. కేజీ రూ.150 నుంచి రూ.200 వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రెండేళ్ల తర్వాత ఎకరాకు 4 టన్నుల దిగుబడి లభించే అవకాశం ఉంది.

మార్కెట్ వ్యవస్థ కల్పించాలి..

'కరువు సీమలో తక్కువ నీటితో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో నీటి కొరతను అధిగమించి అధిక లాభాలను తీసుకొచ్చే డ్రాగన్ ఫ్రూట్ లాంటి పంటల సాగుకు ప్రభుత్వం సహకారం అందజేయాలి. సరైన మార్కెట్ వ్యవస్థ కల్పిస్తే అన్నదాతలకు లబ్ధి చేకూరుతుంది.

–రైతు కేఎస్ నారాయణ గౌడ



నీటి అవసరం తక్కువ

ఈ పంటకు పెద్దగా నీటి తడులు అవసరం ఉండదు. చీడపీడలు ఆశించవు. పురుగుల మందులు కూడా పిచికారి అవసరం ఉండదు.

హుండీ కానుకలు లెక్కింపు



మైసూరు: మైసూరు జిల్లా సాలిగ్రామలోని ప్రసిద్ధ శ్రీ కోదండరామ స్వామి ఆలయ హుండీ కానుకలు లెక్కించారు. ఈసారి హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. గురువారం ఉప తహసీల్దార్ కేజే శరత్ కుమార్ ఆధ్వర్యంలో నగదు, ఇతర కానుకలు లెక్కించారు. ఈసారి రూ. 6.55 లక్షల నగదు భక్తులు సమర్పించారు. మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తారు.

లారీల దొంగ అరెస్ట్

బనశంకరి: విలాసవంతమైన జీవనం కోసం లారీలను అపహరిస్తున్న దొంగను గురువారం వీవీ పురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.కోటి 50 లక్షల విలువ చేసే మూడు లారీలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని తమిళనాడుకు చెందిన ముత్తురాజ్‌గా గుర్తించారు. అపహరించిన లారీలకు నకిలీ రికార్డులు సృష్టించి విక్రయించేవాడు. అంతేగాక లారీలను స్నేహితుల ద్వారా విక్రయిస్తూ ఓ స్నేహితుడు ఇంజిన్, ఛాసీ నెంబరు ట్యాంపరింగ్ చేసేవాడని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు పీడీఓలు సస్పెండ్

దొడ్డబళ్లాపురం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పీడీఓలను సస్పెండ్ చేసిన ఘటన హాసన్ జిల్లాలో చోటుచేసుకుంది. చెన్నరాయపట్టణ తాలూకా బళెదరె గ్రామ పంచాయతీ పీడీఓ సీఎస్ నవీన్, కెంబాళు, బాగూరు పీడీఓ క్రిష్ణేగౌడ, దిండగూరు పీడీఓ రామస్వామి సస్పెండ్ అయిన అధికారులు. వీరు ముగ్గురూ ప్రజా ప్రయోజనం కోసం కేటాయించిన 18ఏ సైట్‌ను ప్రైవేటు వ్యక్తికి దారాదత్తం చేసారని ఫిర్యాదు అందడంతో సీఈఓ పూర్ణిమ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు.

బాలల కార్మికులకు విముక్తి



బాలలను బాల సదన్‌కు తరలిస్తున్న దృశ్యం

తుమకూరు: శిర నగరంలోని వివిధ గ్యారేజీలపై రెవెన్యూ అధికారులు దాడులు చేసి ఏడుగురు బాల కార్మికులకు విముక్తి కల్పించారు. నగరంలోని వివిధ గ్యారేజీల్లో బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందుకున్న ఎమ్మార్వో నాగమణి నేతృత్వంలోని బృందం హఠాత్తుగా దాడులు చేసి కొంత మంది బాలలను గుర్తించి బాల భవన్‌కు తరలించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో నాగమణి తెలిపారు.

గుడిసె దగ్ధం



తుమకూరు: మంటలు వ్యాపించి గుడిసె దగ్ధమైన ఘటన శిర తాలూకా కె.రంగనహళ్లి గ్రామంలో జరిగింది. దీంతో గుడిసెలో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు, ధాన్యం, బంగారు నగలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. అయితే కుటుంబ సభ్యులు పనులకు వెళ్లిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయా, లేదా ఎవరైనా నిప్పంటించారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

వేణుగోపాల్ హత్యకు, రాజకీయాలకు సంబంధం లేదు

మైసూరు: హిందూ యువ బ్రిగేడ్ కార్యకర్త వేణుగోపాల్ నాయక హత్య కేసు మతాలకు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప తెలిపారు. గురువారం జిల్లాలోని టి నరసీపురలో వేణుగోపాల్ ఇంటికి మంత్రి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ. 4.12 లక్షల చెక్కును మృతుడి భార్య పూర్ణిమకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ హత్యకు రాజకీయాలకు సంబంధం లేదని, విచారణ సాగుతోందని, నిందితులను ఆరు గంటల్లో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. తన భర్త మరణంపై న్యాయ విచారణ జరపాలని మంత్రిని కోరారు.

దేహదానం

మైసూరు: దేహదానంపై చైతన్యం పెరుగుతోంది. మైసూరు నగరంలోని కువెంపు నగరలో నివాసం ఉంటున్న కేంద్ర రక్షణ శాఖ విశ్రాంత ఉద్యోగి మహాదేవప్ప (80) మృతి చెందారు. మహాదేవప్ప చివరి కోరిక మేరకు భార్య దాక్షాయణి, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని నగరంలోని జేఎస్ఎస్ ఆస్పత్రికి దానం చేస్తూ అంగీకార పత్రం ఇచ్చారు. మహాదేవప్ప రచయితగా, సమాజ సేవకుడికి అబ్దుల్ కలాం జాతీయ అవార్డును కూడా అందుకున్నారు.

కుళ్లిన గుడ్లు పంపిణీ చేస్తే కఠిన చర్యలు

- మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

శివాజీనగర: కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో అంగనవాడీలకు సరఫరా చేస్తున్న గుడ్ల సరఫరాపై నిఘా ఉంచామని తెలిపారు. కుళ్లిన గుడ్లు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని వారిని బ్లాక్ లిస్ట్‌లోకి చేరుస్తామన్నారు. ఇదిలా ఉంటే హాసన జిల్లా హావేరి, కొడుగు జిల్లాల పలు అంగనవాడీలకు కుళ్లిన గుడ్లు సరఫరా చేశారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొడుగు జిల్లా కుశాలనగర తాలూకా బసవనత్తూరు గ్రామంలో అంగనవాడీలకు కుళ్లిన గుడ్లు సరఫరా కాగా, ఆ గుడ్లు తింటే ఏమిటి పరిస్థితని స్థానికులు నిలదీస్తున్నారు.

కళాకారులకు పాలికె సాయం

మైసూరు: వివిధ కళాకారులకు గురువారం మైసూరు నగర పాలికె రూ. 10 వేల ఆర్థిక సాయం చేసింది. మేయర్ శివకుమార్ మొత్తం ఏడుగురు కళాకారులకు పురభవన్‌లో చెరో రూ. 10 వేల ప్రోత్సాహ చెక్కులను అందించారు.

బాలిక ఆచూకీ తెలపండి



బాగేపల్లి: నాలుగేళ్ల చిన్నారి పెనుకొండలో తప్పిపోయిందని, బాలిక ఆచూకీ తెలిస్తే పెనుకొండ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పెనుకొండ ఎస్ఐ రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన బాగేపల్లి పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...గతనెల 12న పెనుకొండకు చెందిన షేక్ ఖలీల్ కుమార్తె షఫియా పట్టణంలోని దర్గా సమీపంలో ఆడుకుంటూ కనిపించకుండా పోయిందని, పట్టణంలో పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయిందని, బాలిక ఆచూకీ లభిస్తే వెంటనే పెనుకొండ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

కొడుకు హత్య కేసులో తండ్రి, సోదరుడు అరెస్ట్



అరెస్టయిన నిందితులు బసయ్య, మహాలింగయ్య

యశవంతపుర: మద్యం కోసం వేధిస్తున్న కొడుకును తండ్రి హత్య చేసిన ఘటన బెళగావి జిల్లా రాయభాగ తాలూకా హిడికల్ గ్రామంలో జరిగింది. ఈ ఘటన ఈ నెల 8న జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమయ్య హిరేమఠ (24)ను తండ్రి మహాలింగయ్య, అన్న బసయ్యలు కలిసి హత్య చేశారు. రోజు మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వాలని తండ్రి మహాలింగయ్యను వేధించేవాడు. ఈ నెల 8న రాత్రి తండ్రితో గొడవ పడ్డారు. ఆక్రోశంలో తండ్రి, పెద్ద కుమారుడు బసయ్యలు కలిసి తలపై కర్రతో బాదటంతో అక్కడిక్కడే మృతి చెందారు. అనంతరం పురుగుల మందు తాగి హత్య చేసుకున్నట్లు నాటకం ఆడారు. తలపై గాయాలైన విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో తండ్రి, సోదరుడిని అరెస్ట్ చేశారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

యశవంతపుర: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన కెంగేరి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఆర్ఆర్ నగరకు చెందిన పుత్తురాజ్ (22) మృతి చెందగా వెనుక కుర్చున్న యోగేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న పుత్తురాజ్, యోగేశ్‌లు వరుసకు అన్నదమ్ములు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో భోజనం చేయటానికి బైక్‌లో హోటల్‌కు వెళ్తుండగా శ్రీనివాసపుర క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. పుత్తురాజ్, యోగేశ్‌లిద్దరికి బలమైన గాయాలయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పుత్తురాజ్ మృతి చెందారు. కెంగేరి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు పక్కన చెత్త కుప్పలు



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధి హూడి వార్డులో బిళిశివాలె మెయిన్ రోడ్డులో రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. గత కొన్ని రోజులుగా చెత్త సేకరణ జరగకపోవడంతో చుట్టు పక్కల ప్రజలు చెత్తను తీసుకువచ్చి రోడ్డు పక్కన పడేస్తున్నారు. కుప్పలుగా పేరుకుపోయి భరించలేనంత దుర్వాసన, ఈగలు ఉండటంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా బీబీఎంపీ అధికారులు దృష్టి సారించి చెత్తను తొలగించే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హోంగార్డు దుర్మరణం

మండ్య: చెరకు లోడుతో వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో హోంగార్డు మృతి చెందిన ఘటన తాలూకాలోని మండ్య హోళలు రోడ్డులో ఉన్న హోసహళ్లి గేట్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడిని తాలూకాలోని శివళ్లి గ్రామానికి చెందిన బసవరాజు (45)గా గుర్తించారు. బుధవారం విధులు ముగించుకున్న బసవరాజు బైక్‌లో ఇంటికి వస్తుండగా మండ్య నగరంలో ఉన్న మైషుగర్ చక్కెర ఫ్యాక్టరీ వద్దకు రాగానే చెరకు లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొంది. కిందపడిన బసవరాజ్‌పై ట్రాక్టర్ వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

ఉచిత పథకాలతో రాష్ట్రం దివాలా

గౌరిబిదనూరు: కాంగ్రెస్ పార్టీ ఉచిత పథకాలతో రాష్ట్ర ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి వస్తుందని రాష్ట్ర రైతుమోర్చా ఉపాధ్యక్షుడు లోకేశగౌడ ధ్వజమెత్తారు. గురువారం ఆయన ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య రైతు వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నారని, ఏపీఎంసీ చట్టాన్ని రద్దు చేసి రైతులు తమ పంటలకు తామే ధరలు నిర్ణయించే హక్కు లేకుండా చేశారు. విద్యాసిరి పథకానికి కేటాయించిన రూ. 499 కోట్లను రద్దు చేశారు. భవిష్యత్‌లో పోరాటం చేయకతప్పదన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రవినారాయణరెడ్డి, అధ్యక్షుడు రాజశేఖర్, తాలూకా అధ్యక్షుడు రమేశ్ రావ్ శేల్కే, నగర అధ్యక్షుడు మార్కెట్ మోహన్, మునిలక్ష్మమ్మ, జయణ్ణ, హరీశ్ పాల్గొన్నారు.

16న పీ.సుశీల, ఎల్ఆర్ ఈశ్వరీలకు సన్మానం



మాట్లాడుతున్న డాక్టర్ సీ.సోమశేఖర్, చన్నేగౌడ, దయానంద తదితరులు

శివాజీనగర: దక్షిణాది సినీ పరిశ్రమలో నాలుగు దశాబ్దాలుగా తమ మధుర కంఠంతో సంగీత ప్రియులకు వేలాది పాటలను వినిపించిన సుప్రసిద్ధ గాయకులు పీ.సుశీల, ఎల్.ఆర్.ఈశ్వరీలను నగరంలో సంగీతరత్న విద్యాలయం, చి.ఉదయశంకర్ ప్రతిష్ఠానలు సంయుక్తంగా ఈ నెల 16న ఆదివారం రవీంద్ర కళాక్షేత్రలో సన్మానించనున్నట్లు ప్రతిష్ఠాపన అధ్యక్షుడు డాక్టర్ సీ.సోమశేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... డీ.ఎస్.మ్యాక్స్ సంస్థ ప్రయోజకత్వంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వేలాది మంది సంగీత ప్రియులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించి అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రతిష్ఠాన ఉపాధ్యక్షులు ఎస్.ఏ.చన్నేగౌడ, డీ.ఎక్స్ మ్యాక్స్ దయానంద తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

శిక్షణా కేంద్రం ప్రారంభం



కొత్తగా నిర్మించిన శిక్షణా కేంద్రం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో కొత్తగా నిర్మించిన ఆధునిక కేంద్రాన్ని గురువారం చెన్నై నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. రూ. 34.65 కోట్ల ఖర్చుతో 4.0 పారిశ్రామిక శిక్షణా కేంద్రం ఏర్పాటుకు గత ఏడాది ఫిబ్రవరిలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు పూర్తి చేసుకొన్న ఈ కేంద్రంలో పారిశ్రామిక శిక్షణ అందజేసే యంత్రాలను అమర్చి ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ శరయు, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాశ్, మేయర్ ఎస్.ఏ.సత్య, డెప్యూటీ మేయర్ ఆనందయ్య, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

హోసూరు: హోసూరు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మద్యనిషేధ శాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... పోలీసులు బుధవారం రాత్రి హోసూరు– డెంకణీకోట రోడ్డులోని బి. శెట్టిపల్లి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుంగా ఆ మార్గంలో వచ్చిన వ్యక్తిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితుడిని మాచినాయకనపల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ (32)గా గుర్తించారు. ఇతను ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

వృద్ధుడు ఆత్మహత్య

హోసూరు: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన హోసూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గోవిందరాజ్ (68) రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక బుధవారం రాత్రి మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

దక్షిణపెన్నాలో దూకిన బాలిక

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరు వద్ద ప్రవహిస్తున్న దక్షిణ పెన్నానదిలో దూకిన విద్యార్థిని కోసం గత రెండు రోజులుగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. బాగలూరు జీవానగర్‌కు చెందిన రవి కూతురు తేజశ్విని (16) ముగళపల్లి సమీపంలోని ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం రాత్రి నదిలో దూకింది. విషయం గమనించిన స్థానికులు బాగలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని బాలిక ఆత్మహత్యకు కారణాలను విచారణ చేస్తున్నారు.

తెలుగు భాషా సేవకుడు కన్నుమూత



ఆయన కళ్లను దానం చేస్తున్న కుటుంబసభ్యులు

హోసూరు: హోసూరు ప్రాంతంలో గత 25 ఏళ్లుగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూ ఎన్నో పుస్తకాలను రచించి కవిరచయితగా పేరుపొందిన నంద్యాల నారాయరెడ్డి బుధవారం రాత్రి కన్నుమూశారు. నారాయణరెడ్డి హోసూరు సమీపంలోని నెల్లూరు అగ్రహారంలో నివాసముంటూ ప్రభుత్వ పాఠశాలలో ఆర్గనైజర్‌గా పనిచేశారు. తరువాత రైతు సంఘ నాయకుడిగా, 1988 నుంచి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూ వచ్చారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో జరిగిన పలు తెలుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు పెద్దమనసుతో ఆయన కళ్లను దానం చేశారు. తెలుగు సంఘాల ప్రముఖులు ఎం.ఎస్. రామస్వామిరెడ్డి, ఎం.ఎస్. విజయ్‌కుమార్, డాక్టర్ వసంత్, రఘునాథరెడ్డి, భాషాభిమానులు, తెలుగు రచయితలు, నాయకులు సంతాపం తెలిపారు.

పుష్ప వినోదానికి రెడీ



- ఆగస్టు 4 నుంచి లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో

బనశంకరి: స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆగస్టు 4వ తేదీ నుంచి 15 వరకు ఫల పుష్ప ప్రదర్శన బెంగళూరు లాల్‌బాగ్ పార్క్‌లో అలరించబోతోంది. ఈసారి మాజీ ముఖ్యమంత్రి కెంగల్ హనుమంతయ్య జీవితం ఆధారంగా ఫ్లవర్ షో రూపకల్పన చేయాలని తీర్మానించారు. ఉద్యానవనశాఖ సుమారు రూ.22 కోట్ల వ్యయంతో ఫల పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేస్తుంది. 4వ తేదీన సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ ప్రారంభిస్తారు. కెంగల్ హయాంలో విధానసౌధ నిర్మాణమైంది. అందుకు గుర్తుగా సౌధ నిర్మాణంతో పాటు కెంగల్ అందించిన సేవలను స్మరించేలా ఫల పుష్ప ఆకృతులను ఏర్పాటు చేస్తారు. అంతేగాక మైసూరు రాష్ట్రం పేరు పెట్టి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కన్నడ సంస్కృతి శాఖ జాగృతి కార్యక్రమం నిర్వహిస్తుంది. దేశ విదేశాల నుంచి పలు రకాల పుష్పాలను దిగుమతి చేసుకోనున్నారు. ప్రతి ఏటా జనవరిలో రిపబ్లిక డేకి, అలాగే ఆగస్టులో స్వరాజ్య దినోత్సవాలకు లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో జరపడం ఆనవాయితీ.

ఆ రేట్ కార్డు ఆయన హయాంలో ఉండొచ్చు

శివాజీనగర: మాజీ సీఎం కుమారస్వామి విడుదల చేసిన రేట్‌కార్డుపై మంత్రి చెలువరాయస్వామి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఆయన విధానసౌధలో మాట్లాడుతూ...కుమారస్వామి లిస్ట్ ఆయన హయాంలో ఉండొచ్చని, ఆయన టార్గెట్ ఎవరో అర్థం కావడం లేదన్నారు. తామేమైన ఆయన గురించి మాట్లాడితే ఆయన ఫ్యామిలీని టార్గెట్ చేస్తున్నారని విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.

చంద్రుకు ఆప్ సారథ్యం

శివాజీనగర: ప్రముఖ నటుడు, రాజకీయ నేత ముఖ్యమంత్రి చంద్రును ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కర్ణాటక శాఖ అధ్యక్షునిగా నియమించారు. పార్టీ పెద్దలు ఢిల్లీలో ఈ మేరకు ప్రకటించారు. రాష్ట్ర సంఘటనా కార్యదర్శులుగా బీటీ నాగణ్ణ, అర్జున్ పరప్ప హలగిగౌడర్‌ను నియమించారు. ఇప్పటి వరకు పార్టీ రాష్ట్రాధ్యక్షునిగా ఉన్న పృథ్వీరెడ్డికి జాతీయ జాయింట్ కార్యదర్శి బాధ్యతలు అప్పగించడమైనది.

అనారోగ్యంతో కూలీ ఆత్మహత్య

బాగేపల్లి: అనారోగ్యం వల్ల విరక్తి చెంది చెట్టుకు వెంకటరామప్ప (56) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని గోరంట్ల మండలం వెంకటరామపల్లి గ్రామానికి చెందిన వెంకటరామప్ప బాగేపల్లిలో ఉంటూ కూలి పనులు చేసుకుని జీవించేవాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఆవేదన చెందిన మైనారిటీ విద్యార్థుల హాస్టల్ వద్ద చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. బాగేపల్లి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

సాగర్ కుడి కాలువకు 5 టీఎంసీలు విడుదల చేయండి

• కృష్ణా బోర్డుకు ఏపీ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, అమరావతి: గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువ నుంచి 5 టీఎంసీలు విడుదల చేయాలని కృష్ణా బోర్డును ఏపీ ఇంజనీర్–ఇన్–చీఫ్ సి.నారాయణరెడ్డి కోరారు. ఈ నెల 15 నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే.. తాగునీటి చెరువులను నింపి, వాటి ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు గురువారం నారాయణరెడ్డి లేఖ రాశారు. ప్రస్తుతం సాగర్‌లో 519 అడుగుల్లో 147.46 టీఎంసీలు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. కనీస నీటి మట్టం 510 అడుగులకు ఎగువన సాగర్‌లో 15.79 టీఎంసీల లభ్యత ఉందని తెలిపారు. సాగర్ కుడి కాలువ గేట్ల మట్టం 489 అడుగులని.. ఆ స్థాయిలో 48.81 టీఎంసీల లభ్యత ఉందని లేఖలో పేర్కొన్నారు.

డాక్టర్ సమరానికి రెడ్ క్రాస్ జాతీయ అవార్డు



సాక్షి, అమరావతి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందించే ప్రతిష్టాత్మక రెడ్ క్రాస్ జాతీయ అవార్డుకు డాక్టర్ జి.సమరం ఎంపికైనట్టు ఆ సంస్థ ఏపీ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ నెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌ను డాక్టర్ సమరం అందుకుంటారని పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఆయన ప్రజలకు విశేష సేవలు అందించారని, ముఖ్యంగా కోవిడ్ సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ బ్రాంచ్ చైర్మన్‌గా పనిచేశారని పేర్కొన్నారు.

పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ: మంత్రి సురేష్



సాక్షి, అమరావతి: పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని పురపాలకశాఖ మంత్రి సురేష్ అన్నారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, పెండింగ్ పనులపై ఆరా తీశారు. పనుల వివరాలు నిధుల ఖర్చు, పనులు పూర్తిచేసే కాలవ్యవధిని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి, సుందరీకరణ, నీటిశుద్ధి తదితర పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. విశాఖపట్నంలో వేస్ట్ వాటర్ రీసైక్లింగ్, సరఫరా తదితర పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో రూ.80 కోట్లతో చేపట్టిన కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీలెవెల్ కార్ పార్కింగ్ పనుల్లో ఇప్పటికే 49 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. పులివెందుల మోడల్ టౌన్ పనులపై మంత్రి సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పాలుట్ల గిరిజన గూడెంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, వాటి పరిరక్షణ, గిరిజన గూడేలకు వెలుగులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

26న మెడ్‌టెక్ జోన్‌లో అంతర్జాతీయ సదస్సు

సాక్షి, విశాఖపట్నం: వైద్య పరికరాల తయారీలో భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు అవలంబిస్తోన్న ప్రణాళికలపై చర్చించేందుకు విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ నెల 26న జర్మన్ ఇంజినీరింగ్ ఫెడరేషన్ వీడీఎంఏ, మెడ్‌టెక్ జోన్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. 'భారత వైద్య పరికరాల తయారీ పరిశ్రమలో జర్మన్ టెక్నాలజీ'పై ఈ సదస్సులో చర్చ జరగనుంది. ఈ సదస్సుకు భారత్, జర్మనీతో పాటు పలు దేశాలకు చెందిన వైద్య పరికరాల తయారీ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు అండగా గోద్రేజ్ ఆగ్రోవెట్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆయిల్‌పామ్ రైతులు అధునాతన సాగువిధానాలు అవలంబించడం ద్వారా అత్యధిక దిగుబడులు సాధించే విధంగా తోడ్పాటు అందించడానికి గోద్రేజ్ ఆగ్రోవెట్ ముందుకొచ్చింది. ఏలూరు జిల్లా సీహెచ్ పోతేపల్లిలో 'సమాధాన్' పేరుతో ఆయిల్‌పామ్ రైతులకు వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్‌ను ప్రారంభించింది. పోతేపల్లి పామాయిల్ తయారీ యూనిట్ వద్ద ఏర్పాటు చేసిన సమాధాన్ కేంద్రాన్ని గోద్రేజ్ ఆగ్రోవెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బుర్జిస్ గోద్రేజ్, ఆయిల్‌పామ్ బిజినెస్ సీఈవో సౌగత్ నియోగి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్జిస్ గోద్రేజ్ మాట్లాడుతూ ప్రతి సమాధాన్ కేంద్రం.. రెండువేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుకు మొక్క నాటడం దగ్గర నుంచి దిగుబడి వరకు అన్ని రకాల సహకారాలను అందిస్తుందని చెప్పారు. సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 400 టన్నుల వంటనూనె ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన గోద్రేజ్ ఆగ్రోవెట్ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత నెలలో వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వ ఉద్యోగుల 341 డిమాండ్లు పరిష్కారం

మిగతా డిమాండ్లకూ త్వరలో పరిష్కారం

- కరోనాతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు త్వరలో 1042 ఉద్యోగాలు
- 12వ పీఆర్సీని ప్రభుత్వం ఇప్పటికే నియమించింది
- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వేగవంతం చేస్తాం
- ఉద్యోగుల ఆరోగ్య పథకంపై త్వరలో స్టీరింగ్ కమిటీ సమావేశం
- ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సీఎస్ జవహర్ రెడ్డి
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ చర్యల పట్ల ఉద్యోగ సంఘాల నేతల హర్షం
- మిగతా సమస్యలు త్వరగా పరిష్కరించాలని సీఎస్‌కు విజ్ఞప్తి



ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి సుమారు 461 డిమాండ్లలో 341 డిమాండ్లను పరిష్కరించామని, మిగతా వాటిని కూడా సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎస్ వివరించారు. ఉద్యోగ సంఘాల నేతలు చెప్పిన డిమాండ్లను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. శాఖల స్థాయిలో ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి, చాలా వరకు పరిష్కరించినట్లు చెప్పారు. ఆరేడు నెలలుగా ఉద్యోగ సంఘాలతో తరచూ మంత్రివర్గ ఉప సంఘం, అధికారులు సమావేశమై చర్చిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత వరకు అన్ని డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కరోనాతో చనిపోయిన ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య విధానంలో త్వరలోనే 1042 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఉద్యోగుల వేతన సవరణకు మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో 12వ పీఆర్సీని కూడా నియమించినట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంపై త్వరలో స్టీరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ శాఖల్లో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఆ శాఖల ఉన్నతాధికారులు వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.ప్రవీణ్ కుమార్, అజయ్ జైన్, బి.రాజశేఖర్, ఎం.టి. కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది, ముఖ్య కార్యదర్శులు చిరంజీవి చౌదరి, జయలక్ష్మి, శశిభూషణ్ కుమార్, ప్రవీణ్ ప్రకాశ్, శ్యామల రావు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల నుండి రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రెవెన్యూ సర్వీసెస్ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎస్టీయూ, పీఆర్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఏపీ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు సాయి శ్రీనివాస్, ఎం.కృష్ణయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, జి.హృదయరాజు, సీహెచ్ శ్రావణ్ కుమార్, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ఏపీజీఈఏ జనరల్ సెక్రటరీ జె.ఆస్కార్ రావు, ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ల అధ్యక్షులు సి.గోపాలకృష్ణ, ఎస్.మల్లేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు వేణుమాధవరావు, ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్ సంఘం అధ్యక్షుడు రజనీష్ బాబు, జూనియర్ వెటర్నరీ అధికారులు, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారులు సంఘం అధ్యక్షుడు సేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సమస్యల పరిష్కారం హర్షణీయం: బండి శ్రీనివాసరావు

40 ఏళ్ల చరిత్రలో తొలిసారి చాలా గొప్ప జాయింట్ కౌన్సిల్ సమావేశం జరిగింది. వేగంగా సమస్యల పరిష్కారం హర్షణీయం. 40 రోజుల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్నారు. కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపాం. పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలని కోరాం. పోలీసులు, ఉద్యోగులకు సరెండర్ లీవుల బకాయిలు రూ.800 కోట్లు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో క్లియర్ చేస్తామన్నారు. యూరోపియన్ ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్, ఎంపీడీవోల ప్రమోషన్లలో మినిస్టీరియల్ సిబ్బందికి 34 శాతం కోటాపై సానుకూలంగా స్పందించారు. 2004 కు ముందు ఉద్యోగంలో చేరిన వారికి ఓపీఎస్ అమలు చేయమని కోరాం. మన్మోహన్ సింగ్ ను పీఆర్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించడం హర్షణీయం.

ఓపీఎస్ టు జీపీఎస్ గతంలోకంటే బాగుంది: వెంకట్రామిరెడ్డి

కాంట్రాక్టు ఉద్యోగులందరి క్రమబద్ధీకరణకు ఒకే జీవో ఇస్తామన్నారు. వారు పనిచేసే చోట రెగ్యులర్ చేసేంత వరకు నోటిఫికేషన్‌లు ఇవ్వొద్దని కోరాం. ఓపీఎస్ టు జీపీఎస్ గతంలోకంటే బాగుంది. జీపీఎస్ ఉత్తర్వులు ఇచ్చే ముందు ఉద్యోగ సంఘాలతో చర్చించాలని కోరాం. అందుకు సీఎస్ అంగీకరించారు. జగనన్న లే అవుట్‌లలో ఇచ్చిన స్థలం కాకుండా జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉద్యోగులకు వంద ఎకరాలు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరాం. అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని, జీతాలు పెంచాలని కోరగా సీఎస్ అంగీకరించారు.

గ్రీవెన్స్ డే నిర్వహించడం సంతోషం: బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఇకపై నాలుగు నెలలకు ఒకసారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మొదటిసారిగా గ్రీవెన్స్ డే నిర్వహించడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం హర్షణీయం. 2014 జూన్ 2 నాటికి ఉద్యోగంలో చేరిన కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరించాలి. జీతాలు, పింఛన్లు 1వ తేదీన చెల్లించాలని కోరాం. ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఇవ్వడం సంతోషం. ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్సులు కూడా జీతాలతో కలిపి ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను బలోపేతం చేయాలని, తక్షణమే ట్రస్ట్ అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని కోరాం.

తక్కువ ధరకే నిత్యావసరాల పంపిణీ


• పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్



సాక్షి, అమరావతి: ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పును మార్కెట్ ధరల కంటే తక్కువ రేట్లకు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలలుగా బియ్యం, కందిపప్పు ధరల్లో పెరుగుదల నమోదైందని, ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో టోకు వ్యాపారులు, వాణిజ్య మండలి ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో రెండు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వ్యాపారులు, మిల్లర్లు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తక్కువ రేట్లకు నిత్యావసరాలు విక్రయించేందుకు ముందుకు రావాలని మంత్రి విజ్ఞప్తి చేయగా సానుకూల స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు ధరల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యాపారులు తమ వద్ద ఉన్న సరుకు నిల్వలను భారత ప్రభుత్వ వెబ్ సైట్ http://fcainfoweb.nic.in/pspలో నమోదు చేయాలని సూచించినట్టు తెలిపారు. ధరల జాబితా ప్రదర్శించడంతో పాటు వినియోగదారులకు బిల్లులు ఇవ్వాలన్నారు. కొంత మంది వ్యాపారులు జీఎస్టీ మినహాయింపు కోసం 24, 26 కిలోల పరిమాణంలో వస్తువులను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారని, వినియోగదారుల నుంచి పన్నుతో కలిపి ధరను వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి, సరుకు నిల్వలు లేకపోవడం, స్వేచ్ఛా వాణిజ్యంలో భాగంగా ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి సరుకులను కొనుగోలు చేయడంతో ధరలు పెరిగినట్టు తెలిపారు. ప్రధానంగా ఆఫ్రికా దేశాల్లో ఉత్పత్తి తగ్గిపోవడంతో కందుల దిగుమతులు మందగించాయన్నారు. బీపీటీ, సోనా మసూరి వంటి నాణ్యమైన రకాల బియ్యాన్ని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర వ్యాపారులు కొనుగోలు చేయడం కూడా ఒక ప్రధాన కారణంగా అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ రద్దు కోసమే కుట్ర

- రామోజీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మూకుమ్మడిగా దుష్ప్రచారం
- ఈనాడు స్క్రిప్టు, చంద్రబాబు ప్రొడక్షన్, పవన్ కళ్యాణ్ యాక్షన్
- లంచాలు, అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు
- నాలుగేళ్లలో ప్రజల ఖాతాల్లో నేరుగా రూ.2.25 లక్షల కోట్లు
- అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటవ తేదీన ఠంచన్‌గా పింఛన్
- కోవిడ్, వరద సమయంలో వేగంగా సహాయక చర్యలు
- వెరసి వలంటీర్ల వ్యవస్థ వల్ల సీఎం జగన్‌కు భారీగా పెరిగిన ఇమేజ్

దుష్ప్రచారం అనక ఇంకేమనాలి?

సాధారణంగా వందలో ఒకరి గురించి మాట్లాడాలన్నా.. ఆ ఒక్కడేగా అంటుంటాం. అలాంటిది ఏ పది వేల మంది వలంటీర్లలో ఎక్కడో ఒక వలంటీర్ తప్పిదాలకు పాల్పడితే.. దాని గురించే పదే పదే ప్రచారం చేస్తూ ఈ వ్యవస్థలో పని చేస్తున్న 2.54 లక్షల మంది వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా, అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిగా ఈనాడు, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు పేర్కొనడం ఎంత వరకు సమంజసం? ఇలా పనిగట్టుకుని ప్రచారం చేయడాన్ని దుష్ప్రచారం అనక ఇంకేమనాలి?

సాక్షి, అమరావతి: వలంటీర్లపై నిత్యం తప్పుడు ప్రచారం చేయడం ద్వారా రాష్ట్రంలో పేద ప్రజలందరికీ మేలు చేసే ఈ వలంటీర్ల వ్యవస్థనే రాష్ట్రంలో లేకుండా చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ వ్యతిరేకులందరూ ఒక్కటై కుట్రలు మొదలుపెట్టారు. వలంటీర్ల వ్యవస్థ మీద దుష్ప్రచారానికి రామోజీరావు స్క్రిప్టు, చంద్రబాబు ప్రొడక్షన్, పవన్ కళ్యాణ్ యాక్షన్ సమకూరుస్తున్నారు. ప్రభుత్వం అందజేసే అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఇప్పుడు ఎలాంటి పైరవీలు, లంచాలు, అవినీతి లేకుండా వలంటీర్ల ద్వారా నేరుగా ప్రజలకు అందుతున్నాయి. ఈ ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా దాదాపు 8.06 కోట్ల మంది లబ్ధిదారుల (ఒకే లబ్ధిదారునికి ఐదారు పథకాలు అంది ఉండొచ్చు)కు మొత్తం రూ.2.25 లక్షల కోట్లు నేరుగా ప్రభుత్వం అందజేసింది. ఇళ్ల పట్టాల పంపిణీ.. చిన్నపిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేసే వైఎస్సార్ సంపూర్ణ పోషణ వంటి పథకాల ద్వారా మరో 3.08 కోట్ల మంది లబ్ధిదారులకు ఇంకో రూ.1.91 లక్షల కోట్లు లబ్ధి కలిగించింది. ఇందులో ఎక్కడా అవినీతి ఆరోపణలే లేవు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రత్యేకించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేవలం రెండున్నరేళ్ల వ్యవధిలోనే ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్ల రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల్లో మరింత ఆదరణ పెరిగింది. పాలనపరంగా.. రాష్ట్రంలో, దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇమేజ్ భారీగా పెంచింది. మరో 10 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయడం ద్వారా ప్రభుత్వ ఇమేజీ తగ్గించాలని యత్నాలు మొదలయ్యాయని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రాజకీయంగా ఎదగడమే ఇష్టం లేని 'ఈనాడు'.. ఆయన అధికారంలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ ఆయన్ను టార్గెట్ చేసుకొని ఎన్నో కథనాలు వండివార్చింది. ఇప్పుడు జగన్‌కు పాలనపరంగా భారీ ఇమేజీని తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ పైనా 'ఈనాడు' రకరకాల కథనాలు రాస్తూ వలంటీర్ల వ్యవస్థను ఓ మాఫియాగా చూపుతోంది. ఇందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు తానా తందానా అంటూ వంత పాడుతున్నారు. 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు సమయంలోనే దీన్ని అడ్డుకోవడానికి కొందరు హైకోర్టుకు వెళ్లారు. అప్పట్లో హైకోర్టు ఆ కేసును కొట్టివేయడంతో నాలుగేళ్లగా రాష్ట్రంలో ప్రజలందరూ వలంటీర్ల సేవలు పొందుతున్నారు. అయితే ఇప్పుడు ఎన్నికలకు ముందు మరోసారి కోర్టుకెళ్లడం ద్వారా ఆ వ్యవస్థను రద్దు చేయించాలనే కుట్ర కొనసాగుతూనే ఉందని మరోమారు స్పష్టమైందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

వలంటీర్లు అంటే ఆ ఊరి వాళ్లే..

వలంటీర్లు అంటే వేరే ఎక్కడి వారో కాదు. ఏ ఊరి వాళ్లనే ఆ ఊరిలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం వలంటీర్లుగా నియమించింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల సరాసరి జనాభా సంఖ్య 2,000కు లోపుగానే ఉంటుంది. అలాంటి ఊళ్లోని పురుషులు/మహిళలను 50 ఇళ్లకు ఒకరు చొప్పున వలంటీర్‌గా నియమించారు. ఇలాంటి వారిని పట్టుకుని మోసాలకు పాల్పడుతున్నారంటూ 'ఈనాడు' చేసే తప్పుడు ప్రచారం వినడానికే వింతగా ఉందని అధికార, రాజకీయ వర్గాల వారు ఎద్దేవా చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి ఆ ఊళ్లోనే పెరిగిన వారు, వలంటీర్లు అయ్యాక కొత్తగా ఆ ఊళ్లోని మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, అసభ్య ప్రవర్తన, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను 'ఈనాడు'.. హత్యలు, హత్యాయత్నాలు చేసేవారిగా చిత్రీకరించినా, చంద్రబాబు.. వాళ్లను అవినీతికి పాల్పడే వారుగా పేర్కొన్నా, అమ్మాయిల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహశక్తులంటూ పవన్‌కళ్యాణ్ మాట్లాడినా.. వీరందరి అంతిమ లక్ష్యం ఇంత మంచి వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయించాలన్నదే అని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పట్టణాలలో సైతం ఏ వార్డు పరిధిలోని వాళ్లనే ఆ వార్డు పరధిలో వలంటీర్లగా నియమిస్తున్నామని అధికారులు వివరించారు.

సగానికి పైగా మహిళలు..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు.. పట్టణ ప్రాంతాల్లో ప్రతి 70–100 ఇళ్లకు ఒకరు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2.61 లక్షల మంది వలంటీర్ల క్లస్టర్‌గా వర్గీకరించారు. ప్రస్తుతం 2,54,038 మంది వలంటీర్లు రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్నారు. వీరిలో 56 శాతం మంది మహిళలే. అందులో బీసీలు 12,5032 మంది, ఎస్సీలు 68,622 మంది, ఎస్టీలు 18,295 మంది.. మొత్తం 80 శాతానికి పైగా ఈ వర్గాల వారే ఉన్నారని గ్రామ, వార్డు సచివాలయ శాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి. వలంటీర్లలో దాదాపు లక్ష మంది డిగ్రీ, ఆపైన ఉన్నత విద్య చదువుకున్న వారే. కేవలం పదవ తరగతి చదివిన వారు పది శాతం లోపే ఉన్నారని అధికారులు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో కొంత మేర చదువుకొని, స్థిర ఉద్యోగం వచ్చే దాక ఊళ్లో తమ వాళ్లందరి మధ్య వలంటీరుగా పని చేస్తున్న వారిని ఆ ఊరిలో సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వారిగా పేర్కొనడాన్ని ప్రతి ఒక్కరూ తప్పుపడుతున్నారు.

పింఛన్ పంపిణీ విప్లవాత్మక సంస్కరణ

ప్రతి నెలా ఒకటవ తేదీన ఠంచన్‌గా రాష్ట్రంలోని దాదాపు 64 లక్షల మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇంటికి వలంటీర్లు వెళ్లి పింఛను పంపిణీ చేస్తున్న కార్యక్రమం పాలనా సంస్కరణలోనే అద్భుతంగా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఒకప్పుడు.. రాష్ట్రంలో అవ్వాతాతలు పింఛను డబ్బులు తీసుకోవడానికి నడవలేని స్థితిలో కూడా ప్రతి నెలా తమ ఊళ్లో కచ్చితంగా ఎక్కడ పింఛను డబ్బులు ఇస్తారో కూడా తెలియక అన్ని ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి సమస్య ఏ ఊళ్లోనూ లేదు. ఏ అవ్వాతాతకు చిన్న కష్టం కూడా తెలియకుండా వలంటీరే వారి ఇంటికి వెళ్లి డబ్బులు అందజేస్తున్నారు. కరోనా సమయంలో, వరద సమయంలో బాధితులకు వేగంగా సాయం అందించారనే విషయం ఎవరికి తెలియదు?

వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

సంచులు మోసే ఉద్యోగం అని, ఇంట్లో మగాళ్లు లేనప్పుడు వెళ్లి తలుపులు కొడతారా అని అప్పట్లో చంద్రబాబు విమర్శించారని గుర్తుచేశారు. చంద్రబాబు మాటలను జనం పట్టించుకోకపోవడంతో పవన్‌ను రంగంలోకి దించారన్నారు. నిఘా సంస్థల పేరును వాడుకుని చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పవన్ యథాతథంగా చదువుతున్నారని అన్నారు. అసలు ఏపీ కంటే తెలంగాణలోనే అధికంగా ఇలాంటి కేసులు నమోదవుతున్నాయని, అక్కడ కేసీఆర్‌ను పవన్ ప్రశ్నించగలరా అని నిలదీశారు.

ఈ కార్యక్రమంలో మేధావులు వెల్లడించిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

బిల్లును పాస్ చేయమని కేంద్రాన్ని కోరు



యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వ్యవస్థలను ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసింది. మానవ అక్రమ రవాణాకు పేదరికం ఒక కారణమని గుర్తించి, దాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు చేపడుతోంది. కేంద్రంలో గతంలో మేనకాగాంధీ మంత్రిగా ఉన్నప్పుడు మానవ అక్రమ రవాణాపై ఒక బిల్లు తయారు చేశారు. దాన్ని ఇప్పటికీ పాస్‌చేయలేదు. దీనిపై పవన్ నిలదీయాల్సింది కేంద్ర ప్రభుత్వాన్నిగానీ రాష్ట్రాన్నికాదు. ప్రతి వ్యవస్థలోనూ తప్పులు చేసేవారున్నారు. సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లను లోబరుచుకుని పిల్లలు పుట్టాక వదిలేసే వారున్నారు. అలాగని హీరోలందరూ అలానే ఉన్నారని అంటామా?

–పి.విజయ్‌బాబు, ఏపీ ఇంటెలెక్చువల్స్ సిటిజన్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు.

నిఘా వర్గాలు మీకెందుకు చెప్పాయి?



ఏ రాజ్యాంగ పదవిలో ఉన్నారని పవన్‌కు కేంద్ర నిఘా వర్గాలు సమాచారం చెప్పాయి. నిఘా వర్గాల పేరును అడ్డుపెట్టుకుని కుట్ర పూరితంగా మాట్లాడుతున్నారు. వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు.

– పిల్లా రవి, న్యాయవాది.

పవన్ చేసింది నేరం



సెంట్రల్ ఇంటిలిజెన్స్ బ్యూరోని పవన్ బజారున పెట్టారు. మానవ అక్రమ రవాణా గురించి మాత్రమే ఇంటిలిజెన్స్ బ్యూరో చెవిలో చెప్పిందా లేక దేశ భద్రత రహస్యాలు కూడా చెప్పిందా? ఏపీ ప్రజలకు తెలియజేయమని తనకు నిఘా వర్గాలు చెప్పాయని పవన్ అనడం చాలా పెద్ద నేరం.

–ఎ.ఎస్.ఎస్. రెడ్డి, విశ్రాంత పోలీస్ అధికారి.

చంద్రబాబు ఉచ్చులో పవన్



ఏ వలంటీర్ ఎంత మందిని అక్రమ రవాణా చేశారో ఆధారాలుంటే పవన్ బయటపెట్టాలి. ప్రజల్లో జనసేన చులకనై.. ఆ పార్టీ తన చెప్పు చేతల్లో ఉండాలని చంద్రబాబు పన్నిన ఉచ్చులో కుట్రలో పవన్ ఇరుక్కుంటున్నారు.

–ఎన్వీ రావ్, అంతర్జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు.

డేటా, పేర్లు బయటపెట్టండి



భవిష్యత్ తరాల భవితకు పునాదులు వేస్తున్న ప్రభుత్వం ఇది. పవన్‌కు ఉన్న భావదారిద్ర్యం మరొకరికి ఉండదు. రెండు లక్షల పుస్తకాలు చదివాడంట. కేంద్ర నిఘా సంస్థలు ఎలా పనిచేస్తాయో కూడా తెలియదా. పవన్ దగ్గర ఉన్న డేటా, అది చెప్పిన సంస్థల పేరు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నా.

–శిష్ట్ల ధనలక్ష్మి, న్యాయవాది.

పవన్ మాటలు సమంజసం కాదు



రాష్ట్రంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండటానికి జగన్ నిర్ణయాలు కారణం. గత ప్రభుత్వంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు సమర్పించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఒకటో తేదీనే కోడి కూయకముందే ఇంటికొచ్చి ఇస్తున్నారు. దీంతో పల్లెల్లో భిక్షాటన పూర్తిగా పోయింది. వలంటీర్ల గురించి తప్పుగా మాట్లాడటం పవన్‌కు సమంజసం కాదు.

–డాక్టర్ రామచంద్రారెడ్డి, విద్యావేత్త

అప్పుడు నోరు లేవలేదేం



చదువురాని ఎంతో మందికి వలంటీర్లు సేవలందిస్తున్నారు. కాస్టింగ్ కౌచ్ అభియోగం వచ్చినప్పుడు పవన్ ఎందుకు మాట్లాడలేదు. ఆధార్ డేటాను టీడీపీ హయాంలో సాఫ్ట్‌వేర్ సంస్థకు ఇచ్చినప్పుడు నోరెందుకు మూగబోయింది. 60 శాతం పైగా ఉన్న మహిళా వలంటీర్లు మానసికంగా బాధపడేలా చేశారు.

– చంగవల్లి సాయిరాం, న్యాయవాది.

జగన్ ఓ స్టేట్స్ మేన్



సీఎం వైఎస్ జగన్‌ను ఏకవచనంతో పిలిస్తే ఏమవుతుంది. దాని వల్ల జగన్‌కు ఏమీ నష్టం లేదు. ఆయన సమర్థవంతమైన పాలనతో దేశవ్యాప్తంగా మంచి పేరు సంపాదించుకున్నారు. ఎన్నో జాతీయ అవార్డులను తెచ్చుకుంటున్న స్టేట్స్ మేన్(గొప్ప రాజనీతిజ్ఞుడు) సీఎం జగన్. పవన్ బహిరంగ క్షమాపణ చెబితే ఆయనకే మంచిది. కాదంటే ఇకపై సహించేది లేదు.

– నరహరిశెట్టి నరసింహారావు, న్యాయవాది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 164	నిఫ్టీ ▲ 29
65,559	19,414

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,103	▲ 184
డోజోన్స్	34,392	▲ 44
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,440	▲ 24
డాక్స్	16,141	▲ 118
షాంఘై	3,236	▲ 40
నికాయ్	32,419	▲ 475

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,329	▲ 543
బంగారం (99.5 స్వచ్ఛత)	59,091	▲ 540
వెండి (కిలో)	73,592	▲ 2,815

హెచ్‌సీఎల్ గూటికి అసాప్ గ్రూప్

ఒప్పందం విలువ రూ. 2,300 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ జర్మన్ ఆటోమోటివ్ ఇంజినీరింగ్ సర్వీసుల సంస్థ అసాప్ గ్రూప్‌ను కొనుగోలు చేయనుంది. యూకే అనుబంధ సంస్థ ద్వారా 100 శాతం వాటా కొనుగోలుకి తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు హెచ్‌సీఎల్ పేర్కొంది. ఇందుకు 25.11 కోట్ల యూరోలు(సుమారు రూ. 2,300 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. పూర్తి నగదు ద్వారా చేపట్టనున్న ఈ కొనుగోలు సెప్టెంబర్‌కల్లా పూర్తయ్యే వీలున్నట్లు తెలియజేసింది. వెరసి ఆటోమోటివ్ ఇంజినీరింగ్ సర్వీసుల విభాగంలో ప్రధానంగా ఈమొబిలిటీ, అటానమస్ డ్రైవింగ్, కనెక్టివిటీలో కార్యకలాపాలు విస్తరించనున్నట్లు తెలియజేసింది. యూరప్, జర్మనీ తదితర ప్రపంచ మార్కెట్లలో సేవలు అందించనున్నట్లు పేర్కొంది. 2010లో ఏర్పాటైన అసాప్ గ్రూప్ ఆటోమోటివ్ రంగం లోని ఓఈఎం, టైర్-1 కంపెనీలకు సర్వీసులు సమకూరుస్తోంది. అంతేకాకుండా సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్ ఎలక్ట్రిక్స్, ఎలక్ట్రానిక్స్, సర్వీస్ టెస్టింగ్, వాహన అభివృద్ధి కంపెనీలకూ సేవలు అందిస్తోంది.

జోస్ ఆలుక్కాస్‌కు 'సీజన్ ఆఫ్ లవ్' అవార్డు



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్‌ను ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ (పీజీఐ) ఇండియా ''సీజన్ ఆఫ్ లవ్'' అవార్డు అభించింది. జాతీయ స్థాయిలో అత్యంత ఆమోదనీయమైన సముదాయంగా ఆవిర్భవిస్తున్న స్టోర్ల విభాగంలో సంస్థకు ఈ అవార్డు దక్కింది. ''మేలిరకం ప్లాటినం ఆభరణాలను నిల్వ చేయడమే కాకుండా, అసాధారణమైన షాపింగ్ అనుభవాన్ని అందించినందుకు ఇది తగిన గుర్తింపు'' అని కంపెనీ తెలిపింది.

విప్రో లాభం రూ. 2,870 కోట్లు

- క్యూ1లో 12 శాతం ప్లస్
- ఆదాయంలో 6 శాతం వృద్ధి

బెంగళూరు: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసిక(క్యూ1) ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం వార్షికంగా 12 శాతం ఎగసి రూ. 2,870 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,564 కోట్లు ఆర్జించింది. ఇక ఐటీ సర్వీసుల ఆదాయం 6 శాతం పుంజుకుని రూ. 22,831 కోట్లకు చేరింది. కాగా.. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్(క్యూ2)లో ఐటీ సర్వీసుల ఆదాయం 272.2-280.5 కోట్ల డాలర్ల స్థాయిలో నమోదు కాగలదని అంచనా వేస్తున్నట్లు విప్రో పేర్కొంది. ఇది -2 నుంచి 1 శాతం వృద్ధికి సమానం.

డీల్స్ అప్

క్యూ1లో వార్షికంగా 9 శాతం వృద్ధితో 1.2 బిలియన్ డాలర్ల విలువైన భారీ కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో వెల్లడించింది. గత 8 క్వార్టర్లలోనే అత్యధికంగా మొత్తం 3.7 బిలియన్ డాలర్ల డీల్స్ అందుకున్నట్లు తెలియజేసింది. స్థూల ఆర్థిక



వాతావరణం బలహీనపడటం, వినియోగ వ్యయాలు మందగించడం వంటి అంశాలు ప్రతీ పరిశ్రమనూ దెబ్బతీసినట్లు సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. దీంతో తమ ఆదాయం సైతం ప్రభావితమైనట్లు తెలియజేశారు. గతేడాది క్యూ4(జనవరి-మార్చి)తో పోలిస్తే సమీక్షా కాలంలో నికర లాభం 6.6 శాతం తగ్గినట్లు ప్రస్తావించారు. అయితే మొత్తం ఆదాయం అంచనాలకు అనుగుణంగానే నమోదైనట్లు తెలియజేశారు. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యంత భారీగా 1.5 బిలియన్ డాలర్ల బైబ్యాక్‌ను పూర్తిచేసినట్లు తెలియజేశారు. డిమాండుకు అనుగుణంగా ఫ్రెషర్స్‌ను తీసుకోనున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, సీహెచ్‌ఆర్‌వో సౌరభ్ గోవిల్ తెలియజేశారు. త్రైమాసికవారీగా ప్రమోషన్ల సైకిల్ కొనసాగుతున్నదని, క్యూ1లో 80 శాతం పనితీరు ఆధారిత చెల్లింపులు చేపట్టినట్లు వెల్లడించారు.

ఏఐ ఎఫెక్ట్...

బిజినెస్ మూలాలలో సమూల మార్పులకు ఏఐ కారణమవుతోంది. ఏఐలో ఆవిష్కరణల కోసం బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నాం. తొలి ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ విప్రో ఏఐ360ను ప్రవేశపెట్టాం.

– థియర్రీ డెలాపోర్ట్, సీఈవో, ఎండీ, విప్రో

ఇతర వివరాలిలా..

- క్యూ1లో 8,812 మంది ఉద్యోగులు తగ్గారు.
- మొత్తం సిబ్బంది సంఖ్య 2,49,758కు చేరింది.
- మార్చికల్లా ఉద్యోగుల సంఖ్య 2,58,570గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ఎన్‌ఎస్‌ఈలో 1% బలపడి రూ. 395 వద్ద ముగిసింది.

ఫెడరల్ బ్యాంక్ లాభం జూమ్

క్యూ1లో రూ. 880 కోట్లు

ముంబై: ప్రయివేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1 (ఏప్రిల్-జూన్)లో నికర లాభం వార్షికంగా 39 శాతం జంప్‌చేసి రూ. 880 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 634 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం సైతం 20% బలపడి రూ. 1,919 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం రూ. 453 కోట్ల నుంచి రూ. 732 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 21% రుణ వృద్ధిని సాధించగా.. నికర వడ్డీ మార్జిన్లు 3.15%గా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు 2.37%గా నమోదుకాగా.. మూలధన పెట్టుబడుల కోసం రూ. 4,000 కోట్లు సమీకరించేందుకు వాటాదారులు అనుమతించినట్లు బ్యాంక్ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్‌ఈలో 5.5% పతనమై రూ. 127 వద్ద ముగిసింది.

నేటి నుంచి రిలయన్స్ 'డిజిటల్ ఇండియా సేల్'

హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ ఆకర్షణీయమైన తగ్గింపు, ఆఫర్లతో 'డిజిటల్ ఇండియా సేల్'ని తీసుకొచ్చింది. పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై భారీ డిస్కౌంట్లు ఇస్తున్నట్లు తెలిపింది. క్రెడిట్, డెబిట్ కార్డ్‌లపై రూ.పదివేల వరకు తక్షణ తగ్గింపు ఆఫర్‌ను అందిస్తోంది. ఈ సేల్ ఆఫర్ నేడు (జూలై 14) ప్రారంభమై., జూలై 16 వరకు కొనసాగుతుంది. సులభ వాయిదాల పద్ధతిలో కొనుగోళ్లు చేయవచ్చు. ఆర్డర్ చేసిన ఉత్పత్తులను వేగంగా డెలివరీ చేయడంతో పాటు ఉచిత ఇన్‌స్టాలేషన్ సదుపాయాన్ని పొందవచ్చు. కస్టమర్లు దగ్గరలోని రిలయన్స్ డిజిటల్ స్టోర్లు, మై జియో స్టోర్లను సంప్రదించి లేదా రిలయన్స్ డిజిటల్ పోర్టల్‌లో లాగిన్ కావడం ద్వారా ఉత్పత్తులపై అద్భుతమైన ఆఫర్లు పొందవచ్చని కంపెనీ పేర్కొంది.



హోండా నుంచి డియో 125 స్కూటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా తాజాగా భారత మార్కెట్లో డియో 125 స్కూటర్‌ను ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.83,400 నుంచి ప్రారంభం. డియో స్కూటర్ ఇప్పటి వరకు 110 సీసీ ఇంజన్‌తో అందుబాటులో ఉంది. ఎన్‌హాన్స్‌డ్ స్మార్ట్ పవర్ ఫీచర్‌తో ప్రస్తుతం రెండు వేరియంట్లలో 125 సీసీ ఇంజన్‌తో కొత్త మోడల్‌ను కంపెనీ పరిచయం చేసింది. ఐడ్లింగ్ స్టాప్ సిస్టమ్, ఇంజన్ ఇన్‌హిబిటర్‌తో సైడ్ స్టాండ్ ఇండికేటర్, సీట్, ఫ్యూయల్ లిడ్ తెరవడానికి మల్టీ ఫంక్షన్ స్విచ్, టెలిస్కోపిక్ సస్పెన్షన్, 171 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ వంటి హంగులు జోడించింది.



ఒడిదుడుకులున్నా.. కొత్త రికార్డులు

- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు
- ట్రేడింగ్‌లో 66,000 స్థాయికి సెన్సెక్స్
- 19,550 ఎగువకు నిఫ్టీ
- ఐటీ, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్

ముంబై: అమెరికా ద్రవ్యోల్బణం దిగిరావడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల ర్యాలీ కలిసిరావడంతో దేశీయ స్టాక్ సూచీలు గురువారం ట్రేడింగ్‌లో జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 273 పాయింట్లు పెరిగి 65,667 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 670 పాయింట్లు దూసుకెళ్లి 66,064 వద్ద సరికొత్త స్థాయిని అందుకుంది. చివరికి 164 పాయింట్ల లాభంతో 65,559 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 111 పాయింట్ల లాభంతో 19,495 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ట్రేడింగ్‌లో 183 పాయింట్లు ఎగిసి 19,567 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 29 పాయింట్ల లాభంతో 19,414 వద్ద నిలిచింది. ఐటీ, ఫైనాన్స్, మెటల్ రియల్టీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మరోవైపు బ్యాంకులు, ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ నాలుగోరోజూ లాభపడింది. డాలర్ మారకంలో పది పైసలు బలపడి 82.08 స్థాయి వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు...

- టీసీఎస్, హెచ్‌సీఎల్ కంపెనీల ప్రోత్సాహకర క్యూ1 ఆర్థిక ఫలితాల ప్రకటన ప్రభావం ఐటీ రంగ షేర్లకు కలిసొచ్చింది. టీసీఎస్, కోఫోర్జ్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పర్‌సిస్టెంట్ షేర్లు 3-2% పెరిగాయి. ఎంఫసీస్, ఎల్‌అండ్‌టీమహీంద్రా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ఒకశాతం నుంచి అరశాతం లాభపడ్డాయి.
- హెచ్‌డీఎఫ్‌సీ విలీన ప్రక్రియ తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు స్వల్ప లాభంతో ముగిసింది. బీఎస్‌ఈలో అరశాతం లాభంతో రూ.1,641 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 1.5% పెరిగి రూ.1,657 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ (రూ.18.55 లక్షల కోట్లు), టీసీఎస్ (రూ.12.22 లక్షల కోట్లు) తర్వాత రూ.9.17 లక్షల కోట్లతో మూడో స్థానంలో నిలిచింది.

సెల్‌కాన్ చేతికి టచ్ మొబైల్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న సెల్‌కాన్ గ్రూప్ తాజాగా మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ టచ్ మొబైల్స్‌ను కొనుగోలు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో టచ్ మొబైల్స్‌కు 42 స్టోర్లు ఉన్నాయి. టచ్ బ్రాండ్ కింద దక్షిణాదితోపాటు మహారాష్ట్రలో 200 ఫ్రాంచైజీ స్టోర్లను స్థాపిస్తామని సెల్‌కాన్ సీఎండీ వై.గురు గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. 'కంపెనీ యాజమాన్యంలో మరో 50 ఔట్‌లెట్లు రానున్నాయి. వీటిలో కొన్ని కేంద్రాలను పూర్తిగా మహిళలే నిర్వహిస్తారు. ఆన్‌లైన్ పోటీతో చిన్న రిటైలర్ల మనుగడ కష్టం. గ్రూప్ కంపెనీల ద్వారా తయారీ సంస్థల నుంచి నేరుగా మొబైల్స్, గ్యాడ్జెట్స్ కొనుగోలు చేసి ఫ్రాంచైజీలకు సరఫరా చేస్తాం. తద్వారా ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే వీటిని విక్రయించవచ్చు' అని వివరించారు.

ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు..

మొబైల్స్ సర్వీస్, విక్రయాలలో సమగ్ర శిక్షణను అందించడానికి హైదరాబాద్‌లో ట్రైనింగ్ సెంటర్ స్థాపించాలని కంపెనీ యోచిస్తోంది. ఇందులో



మీడియా సమావేశంలో మురళి, గురు (కుడి)

భాగంగా ఏటా 1,000 మంది వరకు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలన్న ఆలోచన ఉందని సెల్‌కాన్ ఈడీ మురళి రేతినేని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. సెల్‌కాన్ గ్రూప్ 2022-23లో రూ.2,600 కోట్ల టర్నోవర్ ఆర్జించింది. ఇంటెరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ట్యాబ్లెట్ పీసీలు, ఇతర ఉపకరణాల సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు పలు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ రూ.5,000 కోట్లు ఆశిస్తోంది.

జ్యోతి 'స్వర్ణ' చరిత్ర

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ తన తడాఖా చూపించింది. అంచనాలకు అనుగుణంగా రాణించిన ఈ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పసిడి పతకంతో మెరిసింది. ఈ క్రమంలో 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా జ్యోతి గుర్తింపు పొందింది. వచ్చే నెలలో బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్హత పొందింది. జ్యోతితోపాటు పురుషుల 1500 మీటర్ల విభాగంలో అజయ్ కుమార్ సరోజ్... పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్ పసిడి పతకాలు నెగ్గారు.

- ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం
- మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా ఆంధ్రప్రదేశ్ అమ్మాయి
- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా ఘనత
- ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకూ అర్హత
- అజయ్, అబూబాకర్‌లకు కూడా బంగారు పతకాలు

బ్యాంకాక్: గత రెండేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి మీట్‌లలో నిలకడగా రాణిస్తున్న భారత అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని సాధించింది. ప్రతిష్టాత్మక ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన 23 ఏళ్ల జ్యోతి మహిళల 100 మీటర్ల హర్డిల్స్ విభాగంలో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. గురువారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసులో జ్యోతి అందరికంటే వేగంగా 13.09 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా అవతరించింది. అసుక తెరెదా (జపాన్; 13.13 సెకన్లు) రజత పతకం, ఆకి మసుమి (జపాన్; 13.26 సెకన్లు) కాంస్య





పతకం గెలిచారు. వర్షం కారణంగా తడిగా ఉన్న ట్రాక్‌పై జరిగిన ఫైనల్ రేసులో జ్యోతి ఆద్యంతం ఒకే వేగంతో పరిగెత్తి అనుకున్న ఫలితం సాధించింది. 50 ఏళ్ల చరిత్రగల ఆసియా చాంపియన్‌షిప్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. 12.82 సెకన్లతో జ్యోతి పేరిటే జాతీయ రికార్డు ఉంది. గత నెలలో జాతీయ అంతర్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో జ్యోతి 12.92 సెకన్ల సమయం నమోదు చేసి స్వర్ణం గెలిచింది. అయితే ఆసియా చాంపియన్‌షిప్‌లో వర్షం కారణంగా ట్రాక్ తడిగా ఉండటంతో జ్యోతి 13 సెకన్లలోపు పూర్తి చేయలేకపోయింది. స్వర్ణం నెగ్గిన జ్యోతికి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్, రిలయెన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ అభినందనలు తెలిపారు.

- పురుషుల 1500 మీటర్ల ఫైనల్ రేసును అజయ్ కుమార్ సరోజ్ 3ని:41.51 సెకన్లలో ముగించి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ పోటీల్లో అజయ్‌కిది మూడో పతకం. 2017లో స్వర్ణం, 2019లో రజతం గెలిచాడు.
- పురుషుల ట్రిపుల్ జంప్‌లో కేరళ అథ్లెట్ అబ్దుల్లా అబూబాకర్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం నెగ్గిన అబూబాకర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో 16.92 మీటర్ల దూరం దూకి విజేతగా నిలిచాడు.
- పది క్రీడాంశాల సమాహారమైన పురుషుల డెకాథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ కాంస్య పతకాన్ని గెలిచాడు.





కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్నాను. ఈ మెగా ఈవెంట్ కోసం తీవ్రంగా శ్రమించా. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నా. ఆసియా చాంపియన్‌షిప్‌లో నా అత్యుత్తమ సమయాన్ని నమోదు చేస్తానని ఆశించా. అయితే రేసు మొదలయ్యే సమయానికి వర్షం కురవడంతో ఇబ్బంది పడ్డా. ఐదో హర్డిల్‌లో ఆధిక్యం అందుకోగా, ఆరో హర్డిల్‌ను కూడా అలవోకగా అధిగమించాను. అయితే ఏడో హర్డిల్ దాటే సమయంలో కాస్త తడబడటంతో 13 సెకన్లలోపు రేసును ముగించలేకపోయా. జపాన్ అథ్లెట్స్ నుంచి గట్టిపోటీ ఎదురవుతుందని భావించా. పతకాల గురించి ఆలోచించకుండా సాధ్యమైనంత వేగంగా పరిగెత్తాలనే లక్ష్యంతో బరిలోకి దిగా. పలు టోర్నీలలో నేను క్రమం తప్పకుండా 13 సెకన్లలోపు సమయాన్ని నమోదు చేశా. భవిష్యత్‌లో నా సమయాన్ని మరింత మెరుగుపర్చుకొని మరిన్ని పతకాలు సాధిస్తాననే నమ్మకం ఉంది. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించినందుకు ఆనందంగా ఉంది. –జ్యోతి యర్రాజీ

ఢిల్లీకి చెందిన తేజస్విన్ 7,527 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. మహిళల 400 మీటర్ల విభాగంలో ఐశ్వర్య మిశ్రా 53.07 సెకన్లలో గమ్యానికి చేరి కాంస్య పతకాన్ని గెలిచింది.

ఆఖరి టి20లో భారత మహిళలకు షాక్



మిర్పూర్: బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల క్రికెట్ జట్టు క్లీన్‌స్వీప్ ఆశలకు ఆతిథ్య జట్టు గండికొట్టింది. ఆఖరి టి20లో బంగ్లా ఊహించని షాక్ ఇచ్చింది. గురువారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ బృందం నాలుగు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ చేతిలో బోల్తా పడింది. దీంతో సిరీస్‌ను 3-0 గెలవాలనుకున్న భారత్ 2-1తో సరిపెట్టుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 102 పరుగులే చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (1), షఫాలీ వర్మ (11) సహా అందరు మూకుమ్మడిగా విఫలమయ్యారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (40; 3 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (28; 4 ఫోర్లు) ఆదుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లలో రబియా ఖాన్ 3, సుల్తానా 2 వికెట్లు తీశారు. తర్వాత బంగ్లా 18.2 ఓవర్లలో 6 వికెట్లకు 103 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షమీమా సుల్తానా (46 బంతుల్లో 42; 3 ఫోర్లు) గెలిపించే బాధ్యత తీసుకుంది. భారత బౌలర్లలో దేవిక వైద్య, మిన్ను మణి చెరో 2 వికెట్లు తీశారు. ఓవరాల్‌గా మహిళల జట్టుకు బంగ్లా చేతిలో ఇది మూడో ఓటమి. ఈ మూడు మ్యాచ్‌లకూ హర్మన్‌ప్రీత్ కౌరే కెప్టెన్‌గా వ్యవహరించింది. ఈ పర్యటనలో తదుపరి మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్ కూడా ఇదే వేదికపై 16న జరిగే తొలి వన్డేతో మొదలవుతుంది.

ఇక ప్రైజ్‌మనీలో సమానత్వం: ఐసీసీ

దర్బన్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కూడా సమానత్వానికి 'జై' కొట్టింది. పురుషులతో పాటు మహిళలకు ఒకే తరహా టోర్నీ ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు 'సై' అంది. అంటే ఒకవేళ రోహిత్ శర్మ ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ గెలుచుకుంటే ఎంత మొత్తం వస్తోందో... హర్మన్‌ప్రీత్ కౌర్ మెగా ఈవెంట్ గెలిచినా అంతే వస్తుంది. ఇకపై తేడాలుండవ్... పక్షపాతానికి తావే లేదు. ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో కొన్నేళ్ల కిందటి నుంచే సమానత్వాన్ని అమలు చేస్తున్నారు. కొన్నిరోజులుగా ఐసీసీలోనూ దీనిపై చర్చ జరుగుతుండగా, గురువారం అధికారిక ప్రకటన విడుదలైంది. 'ఐసీసీ ప్రపంచకప్‌లలో టోర్నీ ప్రైజ్‌మనీ ఇకపై సమం కాబోతోంది. పురుషుల క్రికెటర్లకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'సిరీస్', జట్లకు పార్టిసిపేషన్ ఫీజులు ఎంతయితే ఇస్తారో... మహిళా క్రికెటర్లకు, జట్లకు అంతే సమంగా చెల్లిస్తారు' అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

యశస్వి, రోహిత్ శర్మ సెంచరీలు

- టీ విరామానికి భారత్ 245/2
- భారీ ఆధిక్యం దిశగా టీమిండియా

రోసీయు (డొమినికా): తొలి రోజు బౌలింగ్, రెండో రోజు బ్యాటింగ్ కరీబియన్స్‌పై గర్జిస్తున్నాయి. దీంతో తొలి టెస్టులో వారి సొంతగడ్డపై భారత జట్టు ప్రతాపం, ఆధిక్యం అంతకంతకూ పెరుగుతోంది. పసలేని విండీస్ బౌలింగ్‌పై భారత ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ శతకాలతో కదంతొక్కారు. ఓవర్‌నైట్ స్కోరు 80/0తో రెండో రోజు ఆట కొనసాగించిన భారత్ టీ విరామానికి 81 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (221 బంతుల్లో 103; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిష్క్రమించగా, వన్‌డౌన్‌లో వచ్చిన శుబ్‌మన్ గిల్ (6) నిరాశపరిచాడు. అరంగేట్రం చేసిన టెస్టులోనే సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్ (244 బంతుల్లో 116 బ్యాటింగ్; 12 ఫోర్లు) క్రీజులో పాతుకుపోయాడు. ఇతనితో పాటు విరాట్ కోహ్లి (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓపెనర్లు తొలి వికెట్‌కు 229 పరుగులు జోడించగా, ప్రస్తుతం భారత్ 95 పరుగుల ఆధిక్యంలో ఉంది. చేతిలో 8 వికెట్లు ఉండటంతో భారీ ఆధిక్యం ఖాయం.



150 ఆలౌట్

తొలిరోజు బుధవారం టీ విరామానికే వెస్టిండీస్ 8 వికెట్లను కోల్పోయింది. మిగతా లాంఛనం ఆఖరి సెషన్ మొదలైన కాసేపటికే పూర్తయి... తొలి ఇన్నింగ్స్‌లో 64.3 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటైంది. అశ్విన్ 5 వికెట్లు, జడేజా 3 వికెట్లు తీశారు.

ఫైనల్లో జబర్, వొండ్రుసోవా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ఆన్స్ జబర్ (ట్యునీషియా), మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ ఆరో ర్యాంకర్ జబర్ 6-7 (5/7), 6-4, 6-3తో ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్)పై నెగ్గగా... వొండ్రుసోవా 6-3, 6-3తో ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్)ను ఓడించింది. ఫైనల్ శనివారం జరుగుతుంది. జబర్‌తో 2 గంటల 19 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా ఏకంగా 45 అనవసర తప్పిదాలు, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసి మూల్యం చెల్లించుకుంది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్)ను బోల్తా కొట్టించిన స్వితోలినా సెమీఫైనల్లో మాత్రం తడబడింది. ఒక్కఏస్ కూడా కొట్టలేకపోయిన స్వితోలినా నెట్ వద్దకు 21 సార్లు దూసుకొచ్చి ఆరుసార్లు పాయింట్లు గెలిచింది.





బోపన్న జోడీ ఓటమి

పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 5-7, 4-6తో టాప్ సీడ్ వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జంట చేతిలో ఓడిపోయింది. సెమీస్‌లో నిష్క్రమించిన బోపన్న జోడీకి లక్షా 50 వేల పౌండ్లు (రూ. కోటీ 61 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

నేడు జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో యానిక్ సినెర్ (ఇటలీ)తో జొకోవిచ్ (సెర్బియా); మెద్వెదెవ్ (రష్యా)తో అల్‌కరాజ్ (స్పెయిన్) తలపడతారు. ఈ మ్యాచ్‌లను సాయంత్రం 6 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు

కౌన్సిల్ బ్లఫ్స్ (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధు... పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు. తొలి రౌండ్‌లో సింధు 21-15, 21-12తో దిశా గుప్తా (అమెరికా)పై నెగ్గింది. హైదరాబాద్ అమ్మాయి గద్దె రుత్విక శివాని 14-21, 11-21తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. లక్ష్య సేన్ 21-8, 21-16తో కాలి కొల్జోనెన్ (ఫిన్‌లాండ్)పై, శంకర్ ముత్తుస్వామి 21-11, 21-16తో ఎన్‌హాట్ నుగుయెన్ (ఐర్లాండ్)పై నెగ్గారు. హైదరాబాద్‌కు చెందిన భమిడిపాటి సాయిప్రణీత్ 15-21, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ లి షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమి పాలయ్యాడు.



క్లుప్తంగా...

'నెక్ట్స్' వాయిదా

సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థులకు నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) నిర్వహణను నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఎన్‌ఎంసీ కార్యదర్శి డాక్టర్ పులకేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆదేశాల మేరకు నెక్ట్స్‌ను వాయిదా వేశామని తెలిపారు. కాగా, 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి నెక్ట్స్‌ను అమలు చేస్తామని ఎన్‌ఎంసీ తొలుత ప్రకటించింది. ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థులకు స్టెప్-1, స్టెప్-2 పేరుతో రెండు విడతలుగా నెక్ట్స్ నిర్వహించాలని నిర్ణయించింది. స్టెప్-1 పరీక్ష మల్టిపుల్ చాయిస్ విధానంలో, స్టెప్-2 పరీక్ష ప్రాక్టికల్స్ విధానంలో చేపడతామని తెలిపింది. ఈ నెల 28న స్టెప్-1 పరీక్షను నిర్వహిస్తామని ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో నెక్ట్స్ నిర్వహణను వాయిదా వేస్తున్నట్లు ఎన్‌ఎంసీ ప్రకటించడం గమనార్హం.

ముగిసిన 'సాగర్ కవచ్'

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సముద్ర తీర ప్రాంతంలో భద్రత కోసం శ్రీకాకుళం నుంచి తడ వరకు సాగర్ కవచ్ పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం గురువారం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భారత నౌకాదళం, ఇండియన్ కోస్ట్‌గార్డ్, స్టేట్ మెరైన్‌పోలీస్, కస్టమ్స్, మత్స్యశాఖ, పోర్టు అథారిటీలు, డీజీఎల్ఎల్‌తోపాటు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు, ఏజెన్సీలు, మారిటైమ్ డొమైన్‌లో భాగస్వాములు ఈ సాగర్‌కవచ్‌లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సరిహద్దు జలాల నుంచి తప్పిపోకుండా మత్స్యకారులు ఎలా తమను తాము రక్షించుకోవాలి, శత్రు దేశాల నౌకలు కనిపిస్తే సమాచారం ఎలా చేరవేయాలి, వాటిపై నిఘా వ్యవస్థని ఎలా పెంచాలనే అంశాలపై మత్స్యకారులకు శిక్షణ ఇచ్చారు. అనుమానాస్పద నౌకలతో వచ్చిన వారి సమాచారం అందించేందుకు పోలీసులకు డయల్-100, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌కు టోల్‌ఫ్రీ నంబర్-1093కు, ఇండియన్ కోస్ట్‌గార్డు హెల్ప్‌లైన్ నంబర్ 1554లకు సమాచారం అందించాలని మత్స్యకారులతోపాటు తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. విశాఖలోని కోస్ట్‌గార్డ్ తూర్పు ప్రధాన కార్యాలయం నుంచి మొత్తం సాగర్ కవచ్‌ను సమన్వయం చేశారు.

షార్‌లో ఘన ఇంధన మోటార్ల తయారీ ప్లాంట్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన ఘన ఇంధన మోటార్ల తయారీ ప్లాంట్‌ను ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రారంభించారు. ఈ విషయాన్ని గురువారం ఇస్రో వెబ్‌సైట్‌లో సంబంధిత అధికారులు పొందుపరిచారు. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎల్వీఎం3, ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలకు అవసరమైన ఘన ఇంధన తయారీని పెంచేందుకు ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. రాకెట్‌లో అత్యంత కీలకంగా వినియోగించే ఘన ఇంధన మోటార్లు తయారీ స్థాయిని అభివృద్ధి చేయడంలో భాగంగా 29 ప్రాథమిక, 16 సహాయక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా ఘన ఇంధనం, కాస్టింగ్, మిక్సింగ్, మ్యాచింగ్ వంటి కీలక విభాగాల సౌకర్యాలను ఆవిష్కరించినట్టయింది.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు అర్హుల జాబితా విడుదల

రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లలో 4,400 సీట్లు

- 38,355 మంది విద్యార్థులు దరఖాస్తు
- 20 నుంచి 25 వరకు కౌన్సెలింగ్
- వచ్చే ఏడాది నుంచి పీహెచ్‌డీ కోర్సులు
- విద్యాశాఖ మంత్రి బొత్స


జాబితాను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

సాక్షి, అమరావతి/నూజివీడు/వేంపల్లి: ట్రిపుల్ ఐటీల్లో అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందిస్తున్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో నూజివీడు, ఆర్కే వ్యాలీ(ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఉన్న 4,400 సీట్లకు ఈ ఏడాది 38,355 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 23,628(83శాతం) మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 14,727(17 శాతం) మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా కౌన్సెలింగ్‌కు ఎంపిక చేశామన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినవారి జాబితాను గురువారం మంత్రి బొత్స విజయవాడలో విడుదల చేశారు. కౌన్సెలింగ్‌కు ఎంపికైన టాప్-20లో ప్రభుత్వ విద్యార్థులే ఉన్నారని వెల్లడించారు. పదో తరగతిలో 600కి 599 మార్కులు వచ్చిన విద్యార్థి సైతం ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడం గర్వకారణమన్నారు. కౌన్సెలింగ్‌కు ఎంపికైన జనరల్ విద్యార్థుల కటాఫ్ మార్కులు 583గా ఉన్నట్టు చెప్పారు. ట్రిపుల్ ఐటీల్లో ఇప్పటికే పీజీ కోర్సులను అందుబాటులోకి తెచ్చామని గుర్తుచేశారు. వచ్చే ఏడాది నుంచి పీహెచ్‌డీ కోర్సులనూ ప్రవేశ పెడుతున్నామని వెల్లడించారు. కాగా, ఈ నెల 20, 21 తేదీల్లో నూజివీడు క్యాంపస్‌లో, 21, 22 తేదీల్లో ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ)లో, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి 24, 25 తేదీల్లో ఆర్కే వ్యాలీలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మొత్తం అర్హుల్లో 3,345 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 695 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులున్నారని చెప్పారు. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్షణ రంగానికి వెన్నెముక విశాఖ

రూ.16 వేల కోట్లకు చేరిన రక్షణరంగ ఎగుమతులు

- మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌తోనే సాధ్యమైంది
- రక్షణరంగ పరికరాల తయారీ పరిశ్రమలు విశాఖలో అభివృద్ధి చెందుతున్నాయి
- ప్రైవేటు సంస్థలు ఇప్పటికే ఏడు మిసైల్స్ తయారు చేశాయి
- సీఐఐ సదస్సులో రక్షణశాఖ సైంటిఫిక్ అడ్వైజర్ సతీష్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ అమలు ద్వారా అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని రక్షణశాఖ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీశ్‌రెడ్డి చెప్పారు. ఈ కారణంగానే రక్షణరంగ ఎగుమతులు గతేడాది రూ.16 వేల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో స్వదేశీ పరిజ్ఞానం, ఆవిష్కరణలు' అనే అంశంపై విశాఖలో నిర్వహించిన సదస్సులో సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపారమైన అవకాశాలున్న విశాఖ రక్షణ రంగానికి వెన్నెముకగా ఉందని చెప్పారు. తూర్పు నౌకాదళం, డాక్‌యార్డ్, షిప్‌యార్డు, ఎన్ఎస్టీఎల్ తదితర రక్షణ రంగం, అనుబంధ సంస్థలు ఉన్న విశాఖ భవిష్యత్తులో రక్షణ రంగం, ఏరోసిస్టమ్‌కు కేంద్రంగా మారనుందని చెప్పారు. రక్షణ రంగ పరికరాల తయారీ పరిశ్రమలు ఇప్పుడిప్పుడే విశాఖలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో నుంచి సాంకేతికత బదలాయింపుని ప్రోత్సహించడం ద్వారా.. డిఫెన్స్ మెటీరియల్ ఉత్పత్తులు పెరిగాయని తెలిపారు. దేశీయ తయారీరంగానికి ఉత్తేజం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేసిందని చెప్పారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారవుతున్న ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతిచేసే స్థాయికి చేరుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. 2014-15 నాటికి రూ.2 వేల కోట్ల కంటే తక్కువగా ఉన్న డిఫెన్స్ ఎక్స్‌పోర్ట్స్ గతేడాది రూ.16 వేల కోట్లకు చేరుకున్నాయని, భవిష్యత్తులో రూ.25 వేల కోట్ల మార్క్‌ని అధిగమించే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. టార్పెడోలు, క్షిపణులు, పరికరాలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు రక్షణరంగ పరికరాల దిగుమతుల్లో అగ్రభాగంలో ఉన్న భారత్.. ఇప్పుడు ఎగుమతుల్లో అగ్రస్థానం దిశగా పరుగులు పెడుతుండటం శుభపరిణామమని పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఒకప్పుడు సప్లై చైన్‌గా ఉన్న ప్రైవేటు కంపెనీలు డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ సెక్టార్‌గా మారాయని, క్రమంగా డెవలప్‌మెంట్ కమ్ ప్రొడక్షన్ పార్టనర్స్ (డీసీపీపీ)గా అభివృద్ధి చెందాయని చెప్పారు. ఇప్పటికే ప్రైవేట్ తయారీ సంస్థలు ఏడు మిసైళ్లను తయారు చేశాయన్నారు. రక్షణ రంగానికి అవసరమైన ఇన్నోవేషన్స్‌ని సృష్టించే అంకుర పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. డిఫెన్స్ ఇన్నోవేషన్ స్టార్టప్ చాలెంజ్ ద్వారా సాంకేతికత బదలాయింపు జరుగుతోందన్నారు. రక్షణ రంగం వైపుగా ఎక్కువ స్టార్టప్స్ అడుగులు వేస్తున్నాయని చెప్పారు. దేశంలో 2016 నాటికి 400 స్టార్టప్‌లుండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య లక్షకు చేరుకోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)లోను మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో సీఐఐ ఎస్ఐడీఎం చైర్మన్ జె.శ్రీనివాసరాజు, సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బాటలో కేంద్రం

- సబ్సిడీ టమాటాపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ధర పెరిగిన వెంటనే స్పందించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సబ్సిడీపై టమాటాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం కాస్త ఆలస్యంగానైనా వినియోగదారులకు ఊరట కల్పించేలా సబ్సిడీపై టమాటాలు అందించడం ఆనందకరమన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంస్కరణలు కేంద్రంతో సహా పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయనడానికి ఇదొక నిదర్శనమన్నారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల పలు రాష్ట్రాల్లో టమాటా దెబ్బతినడంతో.. దేశవ్యాప్తంగా ధరలు పెరిగాయన్నారు. ఆ వెంటనే సీఎం జగన్ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖను రంగంలోకి దింపామన్నారు. సీఎం యాప్ ద్వారా టమాటాతో సహా ఇతర కూరగాయల ధరల హెచ్చు తగ్గులన సమీక్షిస్తున్నట్టు తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులు, వ్యాపారుల నుంచి సగటున కిలో రూ.99.38 చొప్పున కొనుగోలు చేసి.. రైతు బజార్ల ద్వారా కిలో రూ.50కే వినియోగదారులకు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో సబ్సిడీపై టమాటాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్

- రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ వెల్లడి



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పింఛన్ ప్రయోజనాలు అందనున్నాయని రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ ఉద్యోగులకు గౌరవప్రదమైన అధిక పెన్షన్ విధానం అమల్లోకి వస్తోందన్నారు. తాడేపల్లిలవైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధిక పెన్షన్ కోసం పీఎఫ్ ట్రస్ట్‌కు తెలంగాణ సహా పలు రాష్ట్రాల సంస్థలు దరఖాస్తు చేసినా, కేవలం ఏపీఎస్ ఆర్టీసీకే ఆ అవకాశం వచ్చిందన్నారు. సీఎం జగన్ ఆర్టీసీని అప్పుల ఊబి నుంచి బయటకు తెచ్చారని, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సిబ్బందికి గౌరవప్రదమైన జీతం, పింఛను విధానం తెచ్చారని వివరించారు. గతంలో ఆర్టీసీ ఉద్యోగికి రూ. 3 వేల నుంచి రూ. 4 వేలే పెన్షన్ వచ్చేదని, ఇప్పుడు రూ. 15 వేల నుంచి రూ. 40 వేల దాకా వస్తుందన్నారు. ప్రభుత్వంలో విలీనమైన 50 వేలకు పైగా ఆర్టీసీ సిబ్బందితో పాటు 2014 తర్వాత రిటైర్ అయిన దాదాపు 10,200 మంది ఉద్యోగులు, కార్మికులకు ఈ పెన్షన్ లభిస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికులు త్వరలోనే వారి కుటుంబాలతో సహా సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతారని మంత్రి వివరించారు.

వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడి రాజీనామా

- కార్యకర్తల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యా
- పంచకర్ల రమేష్‌బాబు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వెల్లడించారు. ఇక్కడ గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన రాజీనామాను ప్రకటించారు. తన రాజకీయ చరిత్రలో 13 ఏళ్లపాటు అధికార పార్టీలోనే కొనసాగానన్నారు. తాను పూర్తిగా ఫెయిల్యూర్ అధ్యక్షుడిగానే మిగిలిపోయానన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడంలో సఫలీకృతం కాలేకపోయానన్నారు. వారికి న్యాయం చేయలేనప్పుడు ఈ పదవిలో కొనసాగడం సరికాదనే ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. పార్టీలో తనకెవరూ శత్రువులు లేరన్నారు. వైఎస్సార్‌సీపీలో కాపులకు పెద్దపీట వేశారని, ఒక్క ఉమ్మడి విశాఖలోనే ఒకరికి మంత్రి, మరొకరికి ప్రభుత్వ విప్ పదవులు ఇచ్చారని ఆయన చెప్పారు. ఏ పార్టీలో చేరాలన్న విషయమై కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు.

శ్రీచైతన్య చైర్మన్ బీఎస్ రావు మృతి



సాక్షి, హైదరాబాద్/పెనమలూరు: శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత, చైర్మన్ డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు (బీఎస్ రావు, 75) కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ రోడ్ నెం 32లోని తన నివాసంలో బాత్‌రూంకు వెళ్లిన ఆయన గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలారు. వెంటనే కుటుంబీకులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సుష్మశ్రీ, సీమా ఉన్నారు. ఇటీవలే ఆయన బ్రెయిన్ సర్జరీ చేయించుకున్నారు. కాగా, బీఎస్ రావు మృతదేహాన్ని విజయవాడకు తరలించారు. శుక్రవారం(14న) అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వైద్య వృత్తి నుంచి విద్యావేత్తగా...

బీఎస్ రావు వైద్య వృత్తి నుంచి విద్యావేత్తగా మారారు. గుంటూరు వైద్య కళాశాలలో విద్యనభ్యసించిన బీఎస్ రావు.. ఇంగ్లండ్, ఇరాన్‌లలో 15 ఏళ్ల పాటు వైద్యుడిగా సేవలందించారు. తన సతీమణి డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయ్‌తో కలిసి 1986లో భారత్‌కు తిరిగి వచ్చి విజయవాడలోని పోరంకిలో బాలికల విద్యాసంస్థను స్థాపించారు. తొలుత 56 మంది విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రస్థానం మొదలై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటి ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలకు చేరింది. తెలుగు రాష్ట్రాల్లో 321 జూనియర్ కాలేజీలు, 322 టెక్నో స్కూళ్లు, 107 సీబీఎస్ఈ స్కూళ్లు స్థాపించారు. 2006లో హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

పోలీస్ కస్టడీకి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత

- మరో ముగ్గురు నిందితులు కూడా..
- నేడు మళ్లీ జైలుకు తరలింపు

దొండపర్తి(విశాఖ దక్షిణ): నోట్ల మార్పిడి పేరుతో నేవీ ఉద్యోగులను మోసం చేసిన కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న హోంగార్డ్స్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) స్వర్ణలతను విశాఖపట్నం పోలీసులు ఒక రోజు కస్టడీకి తీసుకున్నారు. ఆమెతో పాటు నిందితులుగా ఉన్న మధ్యవర్తి విజ్జన సూరిబాబు (ఏ-1), ఏఆర్ కానిస్టేబుల్ మహంతి హేమసుందర్, హోంగార్డు వంటాకు శ్రీనులను కూడా గురువారం పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ నిర్వహించారు. 90 లక్షల రూపాయలు విలువ చేసే రూ.500 నోట్లు ఇస్తే.. కోటి రూపాయలు విలువ చేసే రూ.2వేల నోట్లు ఇస్తామని ఆశ చూపి నేవీ ఉద్యోగులను మోసం చేసి 12 లక్షల రూపాయలు కాజేసిన వ్యవహారంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత, సూరిబాబు, మహంతి హేమసుందర్, వంటాకు శ్రీనులను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నిందితులకు ఈ నెల 21వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో వారు జైలులో ఉన్నారు. ఆర్ఐ స్వర్ణలత, ఏఆర్ కానిస్టేబుల్ హేమసుందర్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ సస్పెండ్ చేశారు. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు నిందితులను తమ కస్టడీకి అనుమతించాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... ఒక రోజు కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ మేరకు స్వర్ణలతతోపాటు మరో ముగ్గురు నిందితులను గురువారం ఉదయమే ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేసి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. వీరిని శుక్రవారం తిరిగి జైలుకు తరలించనున్నారు.

ఆగస్టు రాగానే.. అందరికీ హ్యాపీ బర్త్‌డే..

ఎవరైనా ఇద్దరికి ఒకేరోజున బర్త్‌డే వస్తే.. భలే కదా అనిపిస్తుంది. అదే ముగ్గురు, నలుగురి పుట్టినరోజు ఒకే రోజున ఉంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. మరి ఒకే కుటుంబంలో అందరి బర్త్‌డే ఒకే రోజున అయితే.. అదీ ఒకరిద్దరు కాదు ఏకంగా తొమ్మిది మంది పుట్టినది ఒకే తేదీన అయితే.. గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం అవుతుంది. మరి అలాంటి ఓ 'రికార్డు' ఫ్యామిలీ గురించి తెలుసా?

పుట్టినరోజు పెళ్లి చేసుకుని..

పాకిస్తాన్‌కు చెందిన మంగి అమీర్‌అలీ, ఆయన భార్య ఖుదీజా.. ఇద్దరి పుట్టినరోజు ఆగస్టు ఒకటో తేదీనే. దీంతో వారు 1991లో ఆగస్టు ఒకటో తేదీనే పెళ్లి చేసుకున్నారు. సరిగ్గా ఏడాదికి ఆగస్టు ఒకటినే వారికి పాప పుట్టింది. తమ పుట్టినరోజునే పాప పుట్టడంపై అమీర్, ఖుదీజా ఆశ్చర్యపోయినా.. సంబరంగా ఆమెకు సింధు అని పేరుపెట్టుకున్నారు. కొన్నేళ్లకు సాసూ, సప్నా అనే కవల అమ్మాయిలు.. తర్వాత విడివిడిగా అమీర్, అంబర్ అనే ఇద్దరు అబ్బాయిలు.. ఆ తర్వాత అమర్, అహ్మర్ అనే కవల అబ్బాయిలు పుట్టారు. వీరంతా పుట్టినది ఆగస్టు ఒకటో తేదీనే కావడం విశేషం. ఏదో సిజేరియన్ ఆపరేషన్లతో ఇలా ఒకేరోజు పుట్టారనడానికీ లేదు. అంతా సహజ ప్రసవాలేనట. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ఈ కుటుంబం సర్టిఫికెట్లు, ప్రభుత్వ రికార్డులు అన్నీ పరిశీలించేసి.. వీరిని గిన్నిస్‌బుక్ లోకి ఎక్కించేశారు. ''ఇలా ఒకే తేదీన అందరూ జన్మించడం మాకు భగవంతుడు ఇచ్చిన బహుమతి. ఏటా అందరం కలసి ఒకే కేక్ కట్ చేస్తాం. ఒకరికొకరు అందరం శుభాకాంక్షలు చెప్పుకొంటాం..'' అని అమీర్ పేర్కొన్నాడు.

విద్యార్థుల షూ.. అబద్ధాల షో



- జగనన్న కానుక పైనా ఈనాడు విషపు రాతలు
- బూట్ల పంపిణీపై అసత్యాల ప్రచారం
- భూతద్దంలో చూపిస్తూ వాస్తవాలకు సమాధి
- చిన్నపాటి సమస్యపై కొండంత అభాండాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విప్లవాత్మక నిర్ణయాలతో విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వంపై ఈనాడు పచ్చ పైత్యంతో పేట్రేగిపోతోంది. ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమం పైనా విషం చిమ్ముతోంది. చివరకు విద్యార్థులకు సరఫరా చేస్తున్న బూట్లపై కూడా అసత్యాలు వండి వార్చి ప్రభుత్వంపై బురద జల్లుతోంది. 'జగనన్నా... ఈ బూట్లు ధరించలేం' శీర్షికతో ఈనాడు అచ్చువేసిన పిచ్చి రాతలపై వాస్తవాలు విస్తుగొలుపుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేని పచ్చ పత్రిక తప్పుడు రాతలపై 'సాక్షి' 'ఫ్యాక్ట్ చెక్'.

వాస్తవం ఏమిటంటే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 4.40 లక్షల మంది చదువుతున్నారు. ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం 'జగనన్న విద్యా కానుక' అందించింది. వరుసగా నాలుగేళ్లుగా ఈ కానుకలు పంపిణీ చేస్తున్నారు. ప్రతి విద్యార్థికీ సుమారు రూ.2,400 వెచ్చించి బ్యాగ్, బూట్లు, బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఒక డిక్షనరీ, రెండు జతల సాక్స్, మూడు జతల స్కూల్ డ్రెస్, బెల్ట్ ఇస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇండెంట్ పెడుతున్నారు. ఆ సమయంలోనే విద్యార్థులకు జత బూట్లు అందించేందుకు అన్ని తరగతుల విద్యార్థుల పాదాలకు సంబంధించి ప్రింట్ పేపర్ ఆధారంగా కొలతలు తీసుకున్నారు. అవి సప్లై కాగానే స్కూళ్లు తెరచినప్పుడు విద్యార్థులకు వాటిని అందజేశారు.

చాలా కొద్దిమందికే వ్యత్యాసం



పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక అందజేశాం. కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే అక్కడక్కడ బూట్ల కొలతల్లో తేడాలు వచ్చాయి. ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా కొత్త బూట్లు అందిస్తున్నాం. ఇప్పటికే 90 శాతం మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ పూర్తి చేశాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ

ఇదిగో వాస్తవం

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తమకు బూట్లు సరిపోవడం లేదని చెప్పినట్టుగా ఈనాడు తన కథనంలో పేర్కొంది. కానీ ఇక్కడ వాస్తవాన్ని దాచిపెట్టింది. ఆ పాఠశాలలో 380 మంది విద్యార్థులుంటే వారిలో 200 మంది బూట్లు అందుకున్నారు. మిగిలిన వారిలో కొద్దిమందికి మాత్రమే బూట్ల సైజులు తేడా వచ్చాయి. పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు అందించారు. చిన్న పాదాలున్న 200 మంది 6, 7, 8 తరగతి విద్యార్థులకు బూట్ల సైజులు సరిపోయాయి. 180 మందిలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల్లో కూడా కొద్ది మందికి మాత్రమే సైజు తేడా వచ్చింది. విద్యా శాఖ అధికారులు వెంటనే దీనిని గుర్తించారు. మళ్లీ కొలతలు తీసుకుని ఆర్డర్ పెట్టారు. త్వరలోనే వారికి కొత్త బూట్లు అందజేస్తామని ఆ మండల విద్యాశాఖాధికారి నాగరాజు 'సాక్షి'కి చెప్పారు.

వాస్తవం ఇలా ఉండగా ఉమ్మడి జిల్లా అంతటా బూట్ల పంపిణీపై ఈనాడు అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్న విద్యా కానుకపై రాస్తున్న పిచ్చి రాతలపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. చంద్రబాబు ఏలుబడిలో ఇంత ఖరీదు పెట్టి సర్కార్ బడుల్లో పిల్లలకు యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు, సాక్స్‌లు, బెల్ట్‌లు ఇచ్చిన దాఖలాలు లేనే లేవు. పాఠ్య పుస్తకాలు, ఒక జత యూనిఫాం మాత్రమే ఇచ్చేవారు. అదీ కూడా అరకొరగానే. పాఠశాలలో వంద మంది విద్యార్థులు ఉంటే పాతిక మందికి వస్తే గొప్పే అన్నట్లు ఉండేది నాటి పరిస్థితి. ఇప్పుడు పూర్తి పారదర్శకంగా పంపిణీ చేస్తుంటే సాంకేతికంగా ఎదురైన చిన్న సమస్యను భూతద్దంలో చూపి మరీ బురద జల్లుతోంది.



పాఠశాల తెరవగానే పంపిణీ



ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే విద్యా కానుక కిట్లను సరఫరా చేశారు. ఈ కిట్లలో పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు కూడా ఇచ్చారు. గతంలో ఎప్పుడూ ఇలా కిట్లు ఇవ్వలేదు. జగనన్న ఇచ్చిన బూట్లు వేసుకుని కొత్త యూనిఫాంతో ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లడం సంతోషంగా ఉంది.

– జంగం అఖిల, తామరపల్లి, కె.గంగవరం

బూట్లు బాగున్నాయి



ఈ ఏడాది ఇచ్చిన బూట్లు చాలా బాగున్నాయి. పాఠశాల ప్రారంభమైన తొలి రోజు నాటికే బూట్లు ఇచ్చారు. మాకు ఇచ్చిన బూట్లలో ఎక్కడా లోపం లేదు. మా పాదాలకు సరిగ్గా సరిపోయాయి. జగనన్న విద్యా కానుకలో ఇచ్చిన కిట్లలలో వచ్చిన బెల్ట్, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం అన్ని చాలా నాణ్యతగా ఉన్నాయి.

– కుదుపూడి నిఖిల్, కె.గంగవరం

ఫ్యాక్ట్ చెక్

జిల్లా	బూట్లు	యూనిఫాం	డిక్షనరీలు
తూర్పు	1,22,485	1,21,730	21,091
కాకినాడ	159,890	1,59,794	27,214
కోనసీమ	1,15,322	1,14,833	20,287

ఏం జరిగిందో తెలుసుకోకుండానే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 90 శాతం మంది విద్యార్థులకు బూట్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యింది. అక్కడక్కడ కొంత మంది విద్యార్థులకు బూటు సైజు సరిపోలేదు. ఎదిగే వయసు పిల్లలు కావడంతో శారీరక ఎదుగుదలతో పాటు పాదం సైజు కూడా మారుతూండటం సహజం. పై తరగతి పిల్లలకు అందజేసిన బూట్ల విషయంలో కొన్నిచోట్ల ఇబ్బంది రావడం సహజం. జనవరిలో పాదం కొలతలు తీసుకున్నారు. కొలతలు తీసుకుని ఏడు నెలలైంది. కొలతలు పాదం ఇన్నర్ సైజ్ తీసుకోగా, వాటిని బూట్ల తయారీ కంపెనీ బయటి కొలతలుగా భావించడంతో కొందరి సైజులు మారాయి. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా మొత్తం బూట్లన్నీ సరిపోలేదన్నట్టు ఈనాడు తన రాతలతో ప్రజలను కుట్రపూరితంగా తప్పుదారి పట్టిస్తోంది.


పాఠశాల తెరచిన రోజే కిట్ల పంపిణీ



పాఠశాలలు తెరచిన రోజునే జగనన్న విద్యాకానుక పేరుతో పుస్తకాలు, బూట్లు, బెల్టు, డిక్షనరీ, యూనిఫాం అన్నీ కలిపి ఒకే కిట్‌గా అందజేశాం. గత ప్రభుత్వంలో ఇవేమీ ఉండేవి కావు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం పైనే పంపిణీ చేశాం. బూట్లకు సంబంధించి కొన్ని కొలతలు తేడా రావడంతో కొత్తవి ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ

విద్యాకానుక ఒక మైలురాయి



విద్యాపరంగా ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల్లో విద్యాకానుక కూడా ఒక మైలురాయి. విద్యాకానుకలో విద్యార్థులకు నాణ్యమైన బ్యాగ్‌లు, పుస్తకాలు, బూట్లు అందించడంతో పాటు 'నాడు-నేడు'లో పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం పూర్తిగా మార్చింది. సర్కార్ బడుల్లోని విద్యార్థులు పరీక్షల ఫలితాల్లో కార్పొరేట్ తరహాలో దూసుకుపోతున్నారంటే విద్యాపరంగా తీసుకువచ్చిన మార్పులే కారణం.

– ప్రొఫెసర్ ఎ.మురళీకృష్ణ, జేఎన్‌టీయూకే, విద్యావేత్త

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943